


# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 115: గురువారం 11 డిసెంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

## అధికారుల పనితీరుతోనే గ్రామాలు పటిష్టం



**పల్లెలే దేశానికి వెన్నెముక**

**ఏపీలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నా**

**ప్రతిభ ఆధారంగా పంచాయితీరాజ్ ఉద్యోగుల ప్రమోషన్లు**

**ఆదాయవనరులు పెంచడంలోనూ ఉద్యోగులే కీలకం**

**పంచాయితీరాజ్ ఉద్యోగుల సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**అమరావతి :** పల్లెలే దేశానికి వెన్నెముక అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పల్లెల కోసమే పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నా. పదేపదే సమీక్షలు నిర్వహించి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నా అని అన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ సహకారం, సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నామని.. అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పుడు సంస్కరణల

మిగతా 2 లో



### ప్రజల కోసం అవసరమైతే

# రూల్స్ మార్చండి

## మాట ఇచ్చాం... విద్యుత్ ఛార్జీలు పెంచం

**ప్రజలు మెచ్చేలా పరిపాలన**


**వినూత్న ఆలోచనలతో ప్రజలకు సేవలు... అభివృద్ధి పనులు**

**చాలా శాఖలు గాడిన పడ్డాయి... ఇంకొన్ని మరింత గేరప్ కావాలి**

రాష్ట్రానికున్న అప్పులన్నింటినీ రీ-షెడ్యూల్ చేస్తున్నాం

ఏపీ బ్రాండ్ తిరిగి తెచ్చాం... పెట్టుబడులు వచ్చాయి

మంత్రులు, కార్యదర్శులు, హెచ్వోడీల సమావేశంలో ప్రారంభ ఉపన్యాసంలో సీఎం చంద్రబాబు



**అమరావతి:** ప్రజలు మెచ్చే పాలన అందించే దిశగా ప్రతి విభాగం, ప్రతి అధికారి పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈమేరకు అవసరమైతే ప్రభుత్వ బిజినెస్ రూల్స్ సవరించుకోవాలని సూచించారు. సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లో బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడీల కాన్ఫరెన్సు జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులు హాజరయ్యారు. వృద్ధిరేటు

మిగతా 2 లో

### అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్

**సీఎం చంద్రబాబు వినూత్న నిర్ణయం**

**సాగు వ్యయం తగ్గించేలా అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంకుల ఏర్పాటు**

**పత్తి కొనుగోళ్లలో సీసీఐ తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం**

2

## తిరుమలలో దుపట్టా మోసం



దర్యాప్తు ప్రారంభించిన ఏసీబీ

విరుద్ధంగా వ్యవహరించిన నాటి మండలి

మండిపడ్డ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

.. వివరాలు 2లో



## నా అనుభవం 30 ఏళ్లు!

### మీరు నాకు చెప్పొద్దు

**లోక్‌సభలో అమిత్ షా, రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం**

**మీ ఆదేశాలతో పార్లమెంట్ నడవదని రాహుల్‌కు స్పష్టం చేసిన షా**

**ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ**

**చట్టవిరుద్ధ వలసదారుల ఓట్లు పోతాయనేదే విపక్షాల భయమని విమర్శ**

**గతంలో కాంగ్రెస్ ప్రధానులూ ఇలాంటి సవరణలు చేశారని గుర్తు చేసిన షా**

.. వివరాలు 3లో

### కడప మేయర్ సురేశ్‌బాబుకు చుక్కెదురు

**ఎన్నిక జరపవద్దన్న పిటిషన్ కొట్టివేత**

**యథావిధిగా నేడు కడప మేయర్ ఎన్నిక**

3



2

## అమెరికాలో బిజీగా లోకేశ్ పర్యటన

### గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్

అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌లతో భేటీ

## రెండేళ్లలో రెండు లక్షల 50 వేల కోట్ల అప్పులా?



- **కూటమిప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి**
- **మండలి ప్రతిపక్ష నేత బొత్స డిమాండ్**

**విజయనగరం:** కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చాక చేసిన అప్పులను వేటికి ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. బుధవారం విజయనగరంలోని

మిగతా 3 లో

### 18 నెలల విరామం తరవాత

## ప్రత్యక్ష రాజకీయాల్లోకి

**గుడివాడలో ప్రత్యక్షమైన కొడాలి నాని**

**కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే**

**విజయవాడ :** సుదీర్ఘ విరామం తర్వాత క్రియాశీల గుడివాడ రాజకీయాల్లో మాజీ మంత్రి కొడాలి నాని ప్రత్యక్షమయ్యారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో



మిగతా 3 లో

# ప్రజల కోసం అవసరమైతే రూల్స్ మార్చండి



మొదటి పేజీ తరువాయి

పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు చేయాల్సిన ప్రణాళికపై చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు త్రైమాసికాల్లో సాధించిన ఆర్థిక ఫలితాలపై సమావేశంలో సమీక్షించారు. అలాగే మూడు, నాలుగు త్రైమాసికాల్లో సాధించాల్సిన లక్ష్యాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. జీఎస్డీపీ, కేపీఐ, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్, డేటా డ్రివెన్ గవర్నెన్సు అంశాలపై సూచనలు చేశారు. దీంతో పాటు సూపర్ సిక్స్ పథకాల, పౌరసేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఫైళ్ల క్లియరెన్సు, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక, అవేర్, డేటా లేక్, ఐటీ అప్లికేషన్లపై సమావేశంలో అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులు వాటి పరిష్కారంపై హెచ్ఓడీలకు సీఎం సూచనలు చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వాటి ఫలితాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ.. "18 నెలల పాలను సమీక్షించుకుని ఈ ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాల గురించి చర్చించకుని ఆ దిశగా అందరూ పని చేయాలి. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోంది... ప్రజలు మెచ్చే పాలన అందించాలి. ఫైళు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారంతో డేటా లేక్ వ్యవస్థ సిద్ధం అయ్యింది. ఈ సమాచారంతో ఇకపై డేటా డ్రివెన్ గవర్నెన్స్ దిశగా అందరూ పని చేయాలి. నాలెడ్జ్ ఎకానమీ దిశగా ఏపీ అడుగులు వేస్తోంది. అందుకే పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయి. విశాఖలో 1 గిగా వాట్ సామర్థ్యంతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. ప్రధానిని మైక్రో సాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కలిశారు. రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమని చెప్పారు. సుపరిపాలన కోసం అవసరమైతే బిజినెస్ రూల్స్ మార్చుకోవచ్చు. ప్రజల అవసరాల కోసం రాజ్యాంగాన్నే చాలాసార్లు సవరణలు చేశారు. ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ ఆఫీసులకు వచ్చే పరిస్థితి ఉండకూడదు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు చేరే పరిస్థితి రావాలి. గత పాలకులు పూర్తిగా కేంద్ర ప్రాయోజిత పథకాలను అస్తవ్యస్తం చేశారు. గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో కేంద్ర ప్రభుత్వం ఏకంగా నిబంధనలే మార్చేసింది. ఆగిపోయిన కేంద్ర పథకాలను తిరిగి పునరుద్దరించాం. వీటిని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలి. గత పాలకుల నిర్వాకం వల్ల ఏపీ బ్రాండ్ దెబ్బతింది. దానివల్ల అభివృద్ధి ఆగిపోయింది. ఆదాయం తగ్గింది. క్రెడిట్ రేటింగ్ తగ్గిపోవటం వల్ల వడ్డీల భారం పెరిగింది. ఇప్పుడు ఉన్న అప్పును, వడ్డీలను రీ-షెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి. అన్ని ప్రభుత్వ శాఖలూ, విభాగాలు ఆడిట్ పరిధిలోకి రావాల్సిందే. ప్రధాని నరేంద్ర మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి సుపరిపాలన, అభివృద్ధి, రాష్ట్ర పునర్నిర్మాణ హామీ ఇచ్చాం. ఆ దిశగా పాలన సాగేలా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ పని చేయాలి" అని సీఎం స్పష్టం చేశారు. "స్వర్ణాంధ్ర విజన్ యూనిట్లను రేషనలైజ్ చేసి గ్రామ, పట్టణ ప్రాంతాల్లో అవసరమైనట్టుగా విధులు చేపట్టేలా మార్చుకుందాం. ప్రతీ ప్రభుత్వ శాఖ ఓ మంచి ఫలితాల కోసమే పనిచేస్తోంది. ఆ ప్రయోజనాలు ప్రజలకు తెలియాలి. విద్య, విద్యుత్, నీటి భద్రత, వ్యవసాయం, వైద్యం సహా వివిధ శాఖల్లో సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలపై భారం పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే... సంస్కరణల ద్వారా ప్రజలకు మేలు జరిగేలా చూస్తున్నాం. పీపీఏలను రద్దు చేసి గత ప్రభుత్వం రూ.9 వేల కోట్లు ప్రజా ధనం దుర్వినియోగం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో బహిరంగ మార్కెట్ లో యూనిట్ విద్యుత్ ను రూ.5.19 చొప్పున కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు దానిని రూ.4.92కు తగ్గించాం. మొత్తంగా రూ. 9 వేల కోట్ల మేర విద్యుత్ ఛార్జీలు పెంచుకోవడానికి ఈఆర్సీ అనుమతి ఇచ్చింది. కానీ దీని వల్ల ప్రజలపై భారం పడుతుంది. అందువల్ల ఈఆర్సీ సూచనల అమల ఆలోచన చేయడం లేదు. ప్రజలపై భారం వేయకూడదని నిర్ణయించాం. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం. ఐదేళ్లల్లో విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4కు తగ్గించేలా కృషి చేస్తున్నాం. అందరం కలిసి సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశాం. ఒక్క పెన్షన్లలోనే ఇప్పటి వరకు రూ. 50 వేల కోట్లకు పైగా పేదలకు పంపిణీ చేశాం. ఏపీ బ్రాండ్ అనేది చాలా స్ట్రాంగ్ బ్రాండ్. గత పాలకుల వల్ల ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీ బ్రాండ్ తిరిగి తీసుకురాగలిగాం. విశాఖ సదస్సులో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. మన యువతకు ఉద్యోగాలు కూడా వస్తాయి. ఎప్పటికప్పుడు ఎస్ఐపీబీలు పెట్టుకుని పెట్టుబడులకు ఆమోదం తెలుపుతున్నాం. మొదటి త్రైమాసికంలో 12.02 శాతం గ్రోత్ రేట్ వచ్చింది. రెండో త్రైమాసికంలో 11.28 శాతం వృద్ధి నమోదు అయ్యింది. 8.70 శాతం జాతీయ సగటు కంటే ఎక్కువ ప్రగతి సాధించగలిగాం. ఇక భవిష్యత్ కాలానికి 17.11 శాతం లక్ష్యంగా పెట్టుకున్నాం. నీటి భద్రత విషయంలో ముందు చూపుతో పని చేశాం. సాగు నీటి ప్రాజెక్టుల్లో 944 టీఎంసీల నిల్వ చేసుకున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. "ఉన్నతాధికారులంతా శాస్త్రీయంగా ఆలోచన చేసి అభివృద్ధికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. నిధుల లభ్యత తక్కువగా ఉన్నా... అభివృద్ధి పనులు ఆగకుండా చూడాలి. ఈ విధంగా చేయాలంటే అధికారులు వినూత్నంగా ఆలోచన చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాన్ని జోన్లుగా, రీజియన్లుగా, కారిడార్లుగా, క్లస్టర్లుగా హబ్ లుగా విభజించుకుని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. అన్ని శాఖలు, అన్ని ప్రభుత్వ సేవల్లో ప్రజల్లో సంతృప్త స్థాయిని నమోదు చేస్తున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలతో చక్కగా వ్యవహరించాలి. టీటీడీ పనితీరు మెరుగు అవుతోంది. కానీ దేవదాయ శాఖ పని తీరు మెరుగు పడడం లేదు. అన్ని ప్రభుత్వ శాఖలు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలి. జనవరి 15 నాటికి అన్ని సేవలూ ఆన్లైన్లో సేవలందించే పరిస్థితి రావాలి" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్

## సీఎం చంద్రబాబు వినూత్న నిర్ణయం

**అమరావతి:** రాష్ట్రంలో రైతులపై సాగు వ్యయ భారాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తూ, ఆధునిక యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు 'అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి, మిర్చి సహా వాణిజ్య పంటల కొనుగోళ్లపై బుధవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. శాస్త్రీయ విధానంలో పంటల ప్రణాళిక, ఆధునిక యంత్రాలు, డ్రోన్ల వినియోగం ద్వారా సాగు ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్‌ను ప్రారంభించి, అందులో అందుబాటులో ఉన్న పరికరాల వివరాలను పొందుపరచాలని సూచించారు. ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు ఉండాలని, వరికి ప్రత్యామ్నాయంగా రాగులు, జొన్నలు, సజ్జల వంటి చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు.

**ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష**

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు సీఎంకు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 2,606 కొనుగోలు కేంద్రాల ద్వారా 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. రైతులకు 7.39 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రూ.4,085 కోట్లు చెల్లించామని వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 32 శాతం అధికమని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఎం, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఎన్డీఏ ప్రజాప్రతినిధులంతా కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు భరోసా ఇవ్వాలని సూచించారు. రబీ సీజన్‌లో ప్రజలు తినే వరి రకాల సాగుతో పాటు వాటి కొనుగోలు, అంతర్జాతీయ మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు.

**సీసీఐ తీరుపై సీఎం అసహనం**

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ల కేటాయింపులో ఎదు-రవుతున్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసే విషయంలో అనవసర ఇబ్బందులు సృష్టించవద్దని హెచ్చరించారు. ఈ సమస్యలపై వెంటనే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.


**వాణిజ్య, ఉద్యాన పంటలపై దృష్టి**

మిర్చి వంటి పంటలకు మెరుగైన మార్కెట్ కల్పించేందుకు విశ్లేషణా సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. ధరలు ఒక్కసారిగా పడిపోకుండా వాణిజ్య పంటల హార్వెస్టింగ్ ప్రక్రియలో 'రేషనలైజేషన్' విధానాన్ని పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల దశలవారీగా పంట మార్కెట్‌కు వచ్చి గిట్టుబాటు ధర లభిస్తుందని వివరించారు. అరటి, నిమ్మ వంటి ఉద్యాన పంటల కొనుగోలుదారులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 45,420 హెక్టార్లలో సాగవుతున్న సుబాబుల్ రైతులకు మార్కెట్‌కు అనుగుణంగా ధర దక్కేలా చూడాలన్నారు. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లి పంటకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశం లో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమెరికాలో బిజీగా లోకేశ్ పర్యటన

## గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌లతో భేటీ

**శాన్ ఫ్రాన్సిస్కో:** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో అమెరికాలో పర్యటిస్తున్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ టెక్ దిగ్గజ సంస్థల సీఈవోలతో సమావేశమయ్యారు. శాన్ ఫ్రాన్సిస్కోలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌లతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో జరిగిన సమావేశంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న 15 బిలియన్ డాలర్ల ఏఐ డేటా సెంటర్ పనుల పురోగతిపై ప్రధానంగా చర్చించారు. ఈ భారీ పెట్టుబడికి ముందుకు వచ్చినందుకు గూగుల్ బృందానికి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో రాబోతున్న డ్రోన్ సిటీలో గూగుల్ డ్రోన్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సుందర్ పిచాయ్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను సంస్థలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.




అమెరికా వెలుపల గూగుల్ పెడుతున్న అతిపెద్ద ఎఫ్‌డీఐ విశాఖ డేటా సెంటర్ అని ఆయన పేర్కొన్నారు. ఈ భేటీలో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ కూడా పాల్గొన్నారు. అనంతరం అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖలో అడోబ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, శంతను నారాయణన్ డైరెక్టర్‌గా ఉన్న జైర్, కేకేఆర్ వంటి సంస్థల పెట్టుబడులను కూడా ఏపీకి తీసుకురావాలని కోరారు. విశాఖలోని ఫార్మా జోన్‌లో జైర్ ఎలాంట్ ఏర్పాటు, ఆరోగ్య సంరక్షణ రంగంలో కేకేఆర్ పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని విన్నవించారు. మంత్రి లోకేష్ చేసిన విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన శంతను నారాయణన్, తన సహచరులతో చర్చించి తగిన నిర్ణయం ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.

# అధికారుల పనితీరుతోనే..

మొదటి పేజీ తరువాయి



ద్వారా పదోన్నతలు ఎలా వచ్చాయో అందరికీ బాగా తెలుసన్నారు. మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో ఆయన మాటామంతీ నిర్వహించారు. ఉద్యోగులు శాఖాపరమైన సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు ఇవ్వకపోవడం సరికాదనిపించింది. గత ప్రభుత్వంలో ప్రతి పోస్టుకు, బదిలీకి ఓ రేటు పెట్టారు. ఈ పద్ధతిని పూర్తిగా నిర్మూలించాలని చెప్పాను. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపు చేయాలని ఆదేశించానని వెల్లడించారు. పంచాయతీరాజ్ అనుబంధ శాఖల్లో 2లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. సీనియారిటీ, సిన్సియారిటీ, పనితీరు ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని అధికారులకు చెప్పా. మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సులు కూడా ఆ పరిధిలో ఉంటేనే చెప్పాలని సూచించాను. 10 వేల మందికి పదోన్నతులు కల్పించాం. పదోన్నతి వచ్చిన ఉద్యోగి ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది. జీతాలు ఇంకా పెరగాలంటే రాష్ట్ర ఆదాయం పెరగాలి. ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. శశిభూషణ్‌కుమార్, కృష్ణతేజ, వెంకటకృష్ణ వంటి అధికారుల కృషి ప్రశంసనీయం. నా తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగే.. అందుకే ఉద్యోగులపై సానుకూల భావన ఉందని పవన్ అన్నారు. కొన్ని సందర్భాల్లో నిర్ణయం తీసుకుంటే తప్పు.. తీసుకోకుంటే ఒప్పు అయిన పరిస్థితులు ఎదురయ్యాయని చెప్పుకొచ్చారు. అయినా కూడా తన పని తాను చూసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎంగా తన సొంత తెలివి తేటలు ఏమీ కూడా వాడడంలేదన్నారు. బలమైన అధికారులు తనతో ఉన్నారని.. రిఫామ్స్ తీసుకువచ్చి పనిచేశారని అన్నారు. గతంలో చాలా అంశాల్లో పారదర్శకత లేదని తన దృష్టికి తీసుకు వచ్చారని.. సమీక్షల సమయాల్లో చిన్న చిన్న మార్పులు తీసుకువచ్చి పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. తన తండ్రి ఒక ప్రభుత్వ ఉద్యోగి అని.. తనకు ఉద్యోగులంటే ఎనలేని గౌరవం ఉందని పేర్కొన్నారు. ఇంట్లో, ఆఫీసుల్లో ఉద్యోగులకు ఉండే సాధక బాధకాలపై తనకు అవగాహన ఉందని చెప్పుకొచ్చారు. ఉద్యోగులకు ఏమి చేయాలని ఆలోచన చేస్తే.. రిఫామ్స్ తేవాలని అధికారులు చెప్పారని అన్నారు. కష్టపడి పని చేసే వారికి ఎదుగుదల ఎంతో ముఖ్యమని భావించి అమలు చేశామని డిప్యూటీ సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు, మౌలిక వసతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వారు ఉద్యోగుల ఇబ్బందులను కూడా కనీసం పట్టించుకోలేదన్నారు. తాము ఉద్యోగుల ఇబ్బందులు, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రణాళికలు అమలు చేశామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో దాదాపు రెండు లక్షల మంది అవుట్ సోర్సింగ్‌లో ఉన్నారని.. వీరికి పదోన్నతలు ఎలా చేయాలనే అంశంపై మాట్లాడితే వెంకటకృష్ణ వెనెముకలాగా పనిచేశారని తెలిపారు. నేటికీ మన దగ్గర వ్యవస్థలు బలంగా ఉన్నాయంటే వెంకట కృష్ణ, శశిభూషణ్ లాంటి అధికారులు ఉండటమే కారణమని చెప్పారు. ఇదంతా ఒక్కరు చేసింది కాదని.. అందరూ సమిష్టిగా అధికారుల సమూహం పని చేయడం ద్వారానే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. తాను ఎక్కడా జోక్యం చేసుకోలేదని.. క్లీన్ గవర్నెన్స్ కావాలని మాత్రమే అధికారులకు చెప్పానని తెలిపారు. తన తండ్రి తాలూకా అనుభవం తనకు పని చేసింది కాబట్టే.. సీనియారిటీ, క్యాపబులిటీ చూడాలని మాత్రమే చెప్పానన్నారు. బదిలీలు, పదోన్నతులపై అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా సిఫార్సు లెటర్లు ఇచ్చారని.. అయితే వారు సిఫార్సు చేసిన అధికారికి అర్హత ఉంటేనే చేయాలని స్పష్టంగా చెప్పామన్నారు. ఉమ్మడి ఏపీలో కూడా ఈ విధానం అమలు కాలేదని.. ఈ కూటమి ప్రభుత్వంలోనే సాధ్యం అయ్యిందని పవన్ చెప్పారు. గ్రూప్ 1 ద్వారా ఎంపీడీఓలు, డీడీలుగా పదోన్నతిని చట్టబద్ధంగా అమలు చేశామని అన్నారు. మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేధింపులు రాకుండా చూడాలని సూచించారు. ఉద్యోగులపై దాడి జరిగితే మాత్రం క్షమించేది లేదని.. వారి రక్షణ చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. అది ప్రజాప్రతినిధి అయినా, రాజకీయ నేత అయినా చర్యలు తీసుకుంటామని అన్నారు. తన శాఖ పరిధిలో ఉన్న అధికారిని దూషిస్తే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఉద్యోగులు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని పవన్ తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ఉద్యోగులదే కీలక బాధ్యత అని.. మరింత విస్తృతంగా సేవలు అందించాలని అన్నారు. ప్రస్తుతం తీసుకు వచ్చిన సంస్కరణలు నేడు ఆరంభం మాత్రమే అని.. ముందు ముందు చట్టబద్ధంగా మరిన్ని సంస్కరణలు చేస్తామని వెల్లడించారు. 'ప్రతి ఉద్యోగి నా శాఖల్లో నా కుటుంబ సభ్యుడే.. ప్రజలకు సేవలు చేయడం మీ వంతు.. మిమ్మల్ని మంచిగా చూడటం మా బాధ్యత. మీకు ప్రమోషన్లు వస్తే ఎంత ఆనందం చూపారో.. మీ వద్దకు వచ్చే పౌరుడు కూడా మీ సేవలు ద్వారా అంతే ఆనందం పొందాలి. తప్పు చేస్తే నాతో సహా ఎవరైనా శిక్షార్హులే అనేది అందరూ గుర్తుంచుకోండి. పంచాయతీరాజ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఆమోదించాలని కమిషనర్‌ను కోరుతున్నాను' అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# తిరుమలలో దుపట్టా మోసం

**తిరుపతి :** తిరుమల దేవస్థానంలో రూ.54 కోట్ల నకిలీ పట్టు దుపట్టా మోసం బయటపడింది. ఈ విషయమై ఏసీబీ దర్యాప్తు ప్రారంభించింది. దీంతో త్వరలోనే మరిన్ని వివరాలు బయటపడనున్నాయి. అయితే, తాజాగా దీనిపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఓ జాతీయ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'ఏదైనా దేవస్థానంలోకి వెళితే.. మీకు కొంత దుష్ప్రవర్తన కనిపిస్తుంది. పరకామణి విషయంలోనూ చాలా మంది చట్ట విరుద్ధంగా వ్యవహరించారు. టీటీడీలో ఎప్పటినుంచో కొంతమంది ఇష్టమెచ్చినట్లుగా చేశారు. ఈ మోసం ఇప్పుడు వెలుగులోకి రావడానికి ఏకైక కారణం.. మనకు బలమైన టీటీడీ బోర్డు, ప్రభుత్వం ఉండటమే. నేడు మనందరికీ ముఖ్యమంత్రి నుంచి మార్గదర్శకత్వం ఉంది. సరైన ప్రణాళికులతో ముందుకు సాగుతున్నాం. గతంలో మేము పుకార్లను మాత్రమే విన్నాం. ఇప్పుడు అక్కడ ఏం జరిగింది, ఏం చేశారో నిజాలు తెలుస్తున్నాయి. భారతదేశంలోని ఇతర మతాలతో పోలిస్తే.. ప్రభుత్వ చర్యలు, బహిరంగ ప్రకటనలకు సంబంధించి హిందువులను అవమానంగా చూస్తున్నారు. నేను గతంలో చెప్పినట్లుగా హిందువులను లక్ష్యంగా చేసుకుని నిలదీస్తున్నారు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ చెప్పారు.

# పరకామణి చోరీ కేసులో చట్టప్రకారం చర్యలు

## ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు ..విచారణ 16కు వాయిదా

**అమరావతి :** తిరుమల పరకామణి చోరీ కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చోరీ కేసులో ఎన్వీఆర్ నమోదు చేసి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకొనేందుకు సీఐడీ, ఏసీబీ డీజీలకు హైకోర్టు వెసులుబాటు కల్పించింది. చోరీ కేసు లోక్ అదాలత్ వద్ద రాజీ వ్యవహారంతో పాటు నిందితుడు రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు కొనసాగించాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసేందుకు సేకరించిన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు సూచించింది. టీటీడీ అప్పటి ఏవీఎస్వో వై. సతీష్ కుమార్ పోస్టుమార్టం సర్టిఫికేట్‌ను సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని సీఐడీని ఆదేశించింది. కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారాన్ని అవసరమైన మేరకు ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో పంచుకోవాలని స్పష్టీకరించింది. సీఐడీ, ఏసీబీ డీజీలు దాఖలు చేసిన నివేదికలను పరిశీలించిన అనంతరం హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం ఈనెల 16కు వాయిదా వేసింది.

# మీ డబ్బు మీ హక్కు

## అన్‌క్లెయిమ్డ్ మనీ సొంతం చేసుకోండి
## ప్రధాని మోడీ మరోమారు పిలుపు

**న్యూఢిల్లీ :** అన్ క్లెయిమ్డ్ ఆస్తు విషయంలో ఆర్‌బిఐ ఇటీవలే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా తనవంతుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇది ప్రజలకు మేలు చేస్తుందన్న భావనలో ఆయన ప్రకటన చేశారు. క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ



ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్‌లకెయిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.

# కూటమి ప్రభుత్వ అప్పులపై శ్వేతపత్రం

మొదటి పేజీ తరువాయి

జిల్లా వైఎస్సార్సీపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు లక్షల 50 వేల కోట్లు అప్పులు చేశారని అప్పులను వేటికి ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలనీ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు వైద్య విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించాలంటే ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ప్రజలు విద్యావేత్తలు, యువత అందరూ స్వచ్ఛందంగా వచ్చి ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటికరణ కాకుండా సంతకాలు చేశారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అవినీతి స్వార్థం వారి తాబేదారులకు ఆదాయం కల్పించే మార్గంగా ఎంచుకుందని పేద ప్రజల కోసం కాదన్నారు. ప్రైవేట్ వైద్య కళాశాల వల్ల లాభం చేకూరుతుందని కూటను ప్రభుత్వం చెప్పడాన్ని మండిపడ్డారు. దీనిపై ఈ నెల 18న రాష్ట్ర గవర్నర్ ను కలిసి కోటి సంతకాలను సేకరణ పత్రాలను అందజేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో 17 మెడికల్ కళాశాలకు 8000 కోట్లు అవసరమని ఇప్పటికే 1800 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, మిగతా 6500కోట్లు ఖర్చు పెడితే 17 కళాశాలలో ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 18 నెలల కాలంలో 2,50,000 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆ ఖర్చులకు దేనికి ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు కేంద్ర విమానయాన శాఖ మంత్రి ఇండిగో విమానాలు సమస్య వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వ ఆధీనం నడిచే ఇండిగో విమాన సమస్యను రాష్ట్ర మంత్రిగా ఉన్న నారా లోకేష్ పర్యవేక్షణ చేయడం ఏమిటని మండిపడ్డారు చీపురుపల్లి నియోజకవర్గంలో నీ గుర్ల మండలంలో స్టీల్ ఎ÷-లాంట్ విషయంలో ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. ప్రజలకు అవసరమైతే స్టీల్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయాలని ప్రజలకు అవసరం లేకపోతే వద్దని హితవు పలికారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రికి సంబంధిత శాఖ మంత్రికి లెటర్లు రాశానని తెలిపారు. ఈ స్టీల్ ఎ÷-లాంట్ విషయం శాసన మండలిలో ప్రశ్నిస్తానన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపి విజయనగరం జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్ర స్వామి, బొత్స అప్పల నరసయ్య, సంబంగి వెంకట చినప్పలనాయుడు, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, పాల్గొన్నారు

# గుడివాడలో ప్రత్యక్షమైన కొడాలి నాని

మొదటి పేజీ తరువాయి

ఆయన పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత పార్టీ కార్యక్రమంలో తొలిసారి పాల్గొన్నారు కొడాలి. ఎన్నికల్లో ఓటమి, అనారోగ్య సమస్యలతో దాదాపు 18 నెలలుగా ప్రత్యక్ష రాజకీయాలకు మాజీ మంత్రి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కొడాలి నాని.. గవర్నర్‌కు అందించే వినతిపత్రంలో సంతకం చేశారు. ఆపై వినతి పత్రాలను జిల్లా కమిటీకి అందించే పార్టీ శ్రేణుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ శ్రేణులతో కొడాలి నాని ఉత్సాహంగా మాట్లాడారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్య అందాలనే మంచి సంకల్పంతో మాజీ సీఎం జగన్‌మోన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలో ఏర్పాటుకు పునుకున్నారని కొడాలి నాని అన్నారు. వైసీపీ పాలనలో ఐదు కళాశాలలు పూర్తి చేయగా... మరో ఐదు కళాశాలల నిర్మాణం తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. పేద ప్రజలు, విద్యార్థులకు ఉపయోగపడే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటల్స్ ప్రైవేటీకరణ దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ కుట్రను అడ్డుకునేందుకు మాజీ సీఎం జగన్ ప్రజలతో కలిసి పోరాటాన్ని మొదలుపెట్టారన్నారు. తాము తలపెట్టిన ఉద్యమానికి ప్రజల నుంచి చక్కటి స్పందన వచ్చిందని చెప్పారు. ప్రజల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాభిష్టానికి అనుకూలంగా వ్యవహరించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఉద్యమంలో తాము సేకరించిన వినతి పత్రాలను వైసీపీ అధినేత జగన్ నాయకత్వంలో గవర్నర్‌కు అందజేయనున్నట్లు మాజీ మంత్రి కొడాలి నాని పేర్కొన్నారు.

# ఎన్డీఏ ఎంపీలకు నేడు మోడీ విందు

## ఉభయ సభల్లో వ్యూహంపై చర్చించే అవకాశం

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్డీయే భాగస్వామ్య పార్టీల ఎంపీలకు తన నివాసంలో ప్రత్యేక విందు ఇవ్వనున్నారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు ఈ విందు సమావేశం ఏర్పాటు చేశారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నం దున ఉభయసభల్లో పరస్పర సహకారం, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని పటిష్టం చేయడంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. ఎన్డీయే విస్తృత ఎజెండా, ప్రస్తుత సమావేశాల్లో ప్రభుత్వ ఎజెండాపై ప్రధాని ఈ సమావేశంలో ఎంపీలతో ప్రస్తావిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ అంశం కూడా విందు సమావేశంలో ప్రస్తావనకు రావచ్చని తెలుస్తోంది. సీనియర్ మంత్రులు, ఎ÷-లోర్ లీడర్లు, భాగస్వామ్య పార్టీల ఎంపీలు ఈ విందులో పాల్గొంటారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, అసోంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాల కోసం అనుసరించాల్సి వ్యూహంపై కూడా ఎన్డీయే భాగస్వాములతో చర్చించే అవకాశం ఉందని అంటున్నారు. శ్చిమబెంగాల్‌లో ఇప్పటికే పార్టీ సంస్థాగత కార్యక్రమాలను బీజేపీ ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా డిసెంబర్ 20న పశ్చిమబెంగాల్‌లో ప్రధాని పర్యటిస్తారని, నడియా జిల్లాలో పబ్లిక్ ప్రోగ్రాంలో పాల్గొంటారని తెలుస్తోంది. ఈ సందర్భంగా బీజేపీ బెంగాల్ నాయకత్వంతో వ్యూహాత్మక సమావేశాలను కూడా మోదీ నిర్వహించనున్నారు. సంస్థాగత సన్నద్ధతను సమీక్షించనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో పశ్చిమబెంగాల్‌లో నాలుగు నుంచి ఆరు పరివర్తన్ యాత్రలు నిర్వహించేందుకు కూడా బీజేపీ సన్నాహాలు చేస్తోంది. మోదీ స్వయంగా ఒక యాత్రలో పాల్గొంటారు.

# రాహుల్ గాంధీ జర్మనీ పర్యటన

## బిజెపి విమర్శలపై ప్రియాంక ఎద్దేవా
## మోడీ సగం పనిదినాలు
## విదేశాల్లోనే అంటూ విమర్శలు

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిసెంబర్ 15 నుంచి 20 వరకు జర్మనీలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతుండగా.. రాహుల్ విదేశీ పర్యటనపై బిజెపి నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. రాహుల్ ఈజ్ ఎల్ఓపి అంటే లీడర్ ఆఫ్ పర్యటన్ పేరుతో కామెంట్లు చేస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రియాంక గాంధీ స్పందించారు. దేశ ప్రధాని మోడీ సగం పనిదినాలు దేశం బయటే గడుపుతున్నారని బిజెపి నేతలకు కౌంటర్ ఇచ్చారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాహుల్ గాంధీ జర్మనీలో భారతీయులతో భేటీకానున్నారు. ఈ పర్యటనలో ఆయన జర్మనీ మంత్రుల్ని కూడా కలవనున్నారు. రాహుల్ ఈజ్ ఎల్‌వోపీ అంటే లీడర్ ఆఫ్ పర్యటన్ అని బీజేపీ పేర్కొన్నది. విదేశీ నాయకుడు తన నచ్చిన అంశాన్ని చేస్తున్నారని, విదేశీ టూరుకు వెళ్తున్నారని, శీతాకాల పార్లమెంట్ సమావేశాలు డిసెంబర్ 19వ తేదీ వరకు ఉన్నాయని, కానీ రాహుల్ గాంధీ మాత్రం డిసెంబర్ 15 నుంచి 20 వరకు జర్మనీకి వెళ్తున్నట్లు బిజెపి ప్రతినిధి షెహజాద్ పూనావాలా తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల సమయంలోనూ రాహుల్ విదేశాల్లో ఉన్నారని, జంగిల్ సఫారీ చేసినట్లు ఆరోపించారు. పర్యటనపై అనేక విమర్శలు వస్తున్న సమయంలో.. ప్రియాంకా గాంధీ స్పందించారు. దేశం బయటే తన సగం దినాలను ప్రధాని మోదీ గడిపేస్తున్నారని, మరి ప్రతిపక్ష నేతపై ఎందుకు ప్రశ్నలు వేస్తున్నారని ప్రియాంకా కౌంటర్ ఇచ్చారు. జర్మనీ టూరులో రాహుల్ గాంధీతో, కాంగ్రెస్ సీనియర్ నేత శ్యామ్ పిట్రోడా కూడా వెళ్తున్నారని బల్విందర్ సింగ్ తెలిపారు.

# కాలేజీ భవనంపై నుంచి కిందపడ్డ విద్యార్థి

## తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలింపు

**తిరుపతి :** చంద్రగిరి మండలం అగరాల సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు కాలేజ్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. ఓ విద్యార్థి కాలేజ్ భవనంపై నుంచి వెనుక వైపున ఉన్న పైపుల సాయంతో కిందకు దిగేందుకు ప్రయత్నించాడు. అయితే పట్టుతప్పి సదరు విద్యార్థి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గుర్తించిన కాలేజీ యాజమాన్యం విద్యార్థిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పై నుంచి కింద పడటంతో విద్యార్థి చెవి, ముక్కు, నోటి నుంచి రక్తస్రావం ఎక్కువ కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తిరుపతి అమరా ఆస్పత్రిలో విద్యార్థికి చికిత్స అందుతున్నట్లు సమాచారం. అయితే అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడ్డ విద్యార్థి ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న మహిధర్ రెడ్డిగా గుర్తించారు. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరి మండలానికి చెందిన వ్యక్తిగా సమాచారం. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులకు కళాశాల సిబ్బంది సమాచారం అందించింది. వెంటనే వారు ఆస్పత్రికి చేరుకుని తమ బిడ్డ పరిస్థితి గురించి తెలిసి కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలిసిన వెంటనే చంద్రగిరి పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అసలు విద్యార్థి భవనంపై నుంచి పైపులు పట్టుకుని కిందకు ఎందుకు దిగాల్సి వచ్చింది?... అసలు ఏం జరిగింది అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే కాలేజ్ విద్యార్థి ఒక్కసారిగా పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడటంతో తోటి విద్యార్థులు కూడా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

# నా అనుభవం 30 ఏళ్లు! మీరు నాకు చెప్పొద్దు..

## రాహుల్ పై అమిత్ షా తీవ్ర ఆగ్రహం
## లోక్‌సభలో అమిత్ షా, రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం
## మీ ఆదేశాలతో పార్లమెంట్ నడవదని రాహుల్‌కు స్పష్టం చేసిన షా
## ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ
## చట్టవిరుద్ధ వలసదారుల ఓట్లు పోతాయనేదే విపక్షాల భయమని విమర్శ
## గతంలో కాంగ్రెస్ ప్రధానులూ ఇలాంటి సవరణలు చేశారని గుర్తు చేసిన షా



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎన్నికల సంస్కరణలపై జరుగుతున్న చర్చలో రాహుల్ గాంధీ అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అమిత్ షా ఘాటుగా స్పందించారు. “మీ ఆదేశాలతో పార్లమెంట్ నడవదు... సభా సమావేశాలను మీరు శాసించలేరు” అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ కల్పించుకుని, “ముందు నిన్న నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి” అని డిమాండ్ చేశారు. దీనిపై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. తనకు అసెంబ్లీ, పార్లమెంటులో 30 ఏళ్ల అనుభవం ఉందని, తాను ఎప్పుడు మాట్లాడాలో మీరు నిర్దేశించలేరని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR)పై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను అమిత్ షా తిప్పికొట్టారు. విపక్షాలు ‘ఓట్ల దొంగతనం’ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల జాబితా నుంచి మరణించిన వారిని, విదేశీ పౌరులను తొలగించడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని స్పష్టం చేశారు. “చట్టవిరుద్ధ వలసదారులు ఎన్నికల్లో పాల్గొనాలా?” అని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 1952 నుంచి 2004 వరకు అనేకసార్లు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ఓటర్ల జాబితా సవరణలు జరిగాయని గుర్తుచేశారు. “జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు ఎవరూ దీనిని వ్యతిరేకించలేదు. మరి ఇప్పుడెందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారు?” అని నిలదీశారు. నాలుగు నెలలుగా ఏకపక్ష అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తమకు మద్దతిచ్చే చట్టవిరుద్ధ వలసదారుల ఓట్లు తొలగిపోతాయనే భయంతోనే విపక్షాలు ఆందోళన చెందుతున్నాయని అమిత్ షా విమర్శించారు.

# కడప మేయర్ సురేశ్‌బాబుకు చుక్కెదురు

## ఎన్నిక జరపవద్దన్న పిటిషన్ కొట్టివేత
## యథావిధిగా నేడు కడప మేయర్ ఎన్నిక

**అమరావతి :** కడప మాజీ మేయర్ కె.సురేష్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కడప మేయర్ ఎన్నిక నిర్వహణ కోసం ఈనెల 4న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ సురేష్ బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు నిర్ణయం వెల్లడించింది. మేయర్‌గా తనను తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉండగా నోటిఫికేషన్ జారీచేయడం చట్ట విరుద్ధమంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి గడువు 2026 మార్చిలో ముగుస్తుందన్నారు. కాలపరిమితి ముగియడానికి ఆరు నెలల ముందు ఎన్నిక నిర్వహించడానికి పురపాలక చట్టం నిబంధనలు అనుమతించవన్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని పక్రియను నిలువరించాలని కోరారు. ఆరు నెలల ముందు ఎన్నిక నిర్వహించకూడదనే నిబంధన మేయర్ పదవి విషయంలో వర్తించదని ఎస్ఈసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. సభ్యుడి విషయంలో ఆ నిబంధన చెల్లుబాటు అవుతుందన్నారు. మేయర్ ఎన్నిక పరోక్ష ఎన్నిక అని తెలిపారు. పక్రియను నిలువరించొద్దని కోరారు. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయస్థానం సురేష్ బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కడప నగరపాలక సంస్థ మేయర్ ఎన్నిక కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదితి సింగ్ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 11న ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే.

# వడ్డమాను గ్రమంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్

## మంత్రి నారాయణకు రైతుల అంగీకారం

**అమరావతి :** రాజధాని అమరావతిలోని తుళ్ళూరు మండలంలో మంత్రి నారాయణ బుధవారం పర్యటించారు. వడ్డమాను గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్‌కు రైతులు అంగీకారం తెలిపారు. అయితే కౌలు ప్యాకేజీ పెంచాలని మంత్రికి రైతులు వినతి చేశారు. గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు తమ పాసుపుస్తకాలను మంత్రి నారాయణకు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఏడు గ్రామాల్లో 16.666 వేల పైచిలుకు భూమి అవసరమన్నారు. 2014 -19 లో రాజధాని రైతుల సలహాలతో పాలసీ నిర్ణయించామని.. అదే విధంగా రైతులతో చర్చించి వారి నిర్ణయాల ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పారు. ప్రభుత్వం మారటం వలన గత ప్రభుత్వం కేసుల వల్ల జాప్యం జరిగిందన్నారు. తమ పరిధిలో చేయగలిగిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైన్లు సరి చేయమని రైతులు కోరారని.. అది పూర్తి చేస్తామని చెప్పారు. 29 గ్రామాలను అభివృద్ధి చేయడానికి రూ.900 కోట్లు అవసరమని తెలిపారు. ఆరు నెలల్లో తొమ్మిది గ్రామాలను అభివృద్ధి చేయడానికి ఆదేశాలు ఇచ్చామన్నారు. వడ్డమాను గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతులు ఏ విధంగా అడిగితే అలా అభివృద్ధి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# నేడు లొంగిపోనున్న పిన్నెల్లి సోదరులు

**పల్నాడు :** జంట హత్యల కేసులో వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలు గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోనున్నారు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది మే 24న తెదేపా నాయకులు జె.వెంకటేశ్వర్లు, జె.కోటేశ్వరరావు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో తమ ముందస్తు బెయిల్‌ను కొట్టేస్తూ ఏపీ హైకోర్టు ఆగస్టు 29న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన పిటిషన్లను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టేసింది. రెండు వారాల్లోపు లొంగిపోవాలని ఆదేశించింది.



## సంపాదకీయం

# రాహుల్ కన్నా ప్రియాంక బెటర్!

లోక్‌సభలో రెండు రోజుల పాటు రెండు అంశాలపై జరిగిన చర్చలో..విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. నెహ్రూ ద్రోహం గురించి మోడీ మాట్లాడిన సందర్భంలో ఆమె గట్టిగానే ఎదుర్కొన్నారు. ఇవాళ జరుగుతున్న అభివృద్ధికి అంతా నెహ్రూ వేసిన పునాది అని గట్టిగా చెప్పగలిగారు. అలాగే వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ కలుగుతున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగల రని భావించవచ్చు. ఎందుకంటే రాహుల్ కేవలం ఓట్ చోరీ అని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. బీహార్‌లో ఇదే నినాదంతో పోయి బొక్కబోర్లా పడ్డారు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించడ లేదు. ఓట్ల తొలగింపు ద్వారా అర్హులైన ఓటర్లను గుర్తించ కేసు వేయించివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. సుప్రీం కూడా ఇదే కోరింది. కానీ రాహుల్ అది చేయలేదు. తాజాగా పార్లమెంటులోమంగళవారం సర్ ప్రక్రియపై రాహుల్ మాటలు పేలవంగా ఉన్నాయి. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం లేదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధంగానూ లేదు. కేవలం ఆర్‌ఎస్‌ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఓటుచోరీ అనేది అతిపెద్ద దేశద్రోహమని, ఎన్నికల సంఘంతో కలిసి భాజపా దానికి పాల్పడుతోందని రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ఆయన తన పాత మాటలనే రికార్డుగా వినిపించారు. దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. ఎన్నికలకు నెల ముందు మెషీన్ రీడబుల్ నమూనాలో అన్ని పార్టీలకూ ఓటర్ల జాబితాలు ఇవ్వండని అడగడంలో తప్పు లేదు. కానీ నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. దీనికి ఓట్ చోరీ కారణమని అనుకోవాలా అన్నది రాహుల్ చెప్పాలి. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. నిజానికి బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే విపక్షం పట్ల ప్రజల విముఖత ప్రతిబింబించింది. లాలూ కుటుంబంతో పాటు, రాహుల్ తీరుపై అంటే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ ప్రజాతీర్పును ప్రజలంతా అంగీకరించి నా, రాహుల్ మాత్రం అంగీకరించడం లేదు. ఓట్ చోరీ మాయలో పడ్డ ఆయన మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడం లో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు బెంగాల్ సహా అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ మొదలయ్యింది. బెంగాల్లో మమతా బెనర్జీ కూడా మొత్తం పక్రియనే వ్యతిరేకిస్తోంది. ఇది ఎంతవరకు సబబో ఆలోచించాలి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో..పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది వపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్



# ఆరిపోతున్న దీపాన్ని ఆదుకోండి

## విజయనగరం చిన్న పత్రికల ఆక్రందన

### అక్రిడిటేషన్ నిబంధనలను సడలించాలని కోరుతూ ఉద్యమబాట కు శ్రీకారం

**విజయనగరం, డిసెంబరు 10(మనసులో మాట) :**

చిన్న పత్రికలను ప్రభుత్వం ఆదుకోవా లని, అక్రిడిటేషన్ నిబంధనలను సడలించా లని విజయనగరం జిల్లాలోని చిన్న పత్రికల సంపాదకులు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. పల్లెప ల్లెకూ వార్తను మోసుకెళ్లి, స్థానిక సమస్య లకు గొంతుకగా నిలిచిన చిన్న పత్రికలు నేడు అక్రిడిటేషన్ సంకెళ్లు, ఆర్థిక భారంతో నలిగిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

బుధవారం విజయనగరంలో సంఘం నాయకులు పంచాది అప్పారావు, కె.జె. శర్మ, సత్యనారాయణ, నాగరాజు, రవిచం ద్ర శేఖర్, రమణ, తదితరుల ఆధ్వర్యంలో చిన్న పత్రికల సంపాదకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విజయన గరం టౌన్, ఎస్.కోట, రాజాం తదితర ప్రాంతాల నుంచి దాదాపు 50 మంది డైలీ, వార, మాస పత్రికల సంపాదకులు హాజరయ్యారు.

**సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలి**

సమావేశంలో సంపాదకులు మాట్లాడు తూ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, సమస్యలను వెలుగు లోకి తీసుకురావడంలోనూ చిన్న పత్రికలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని గుర్తుచేశా రు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధి కార్యక్రమాల గూర్చి పత్రికల్లో సమగ్రంగా ప్రచురిస్తూ, ప్రజా చైతన్యం తీసుకువస్తున్న తమ పట్ల ప్రభుత్వం, అధికారులు మరింత సానుకూలంగా వ్యవహరించాలన్నారు.

**ముఖ్య డిమాండ్లు**

చిన్న, మధ్యతరహా పత్రికలకు అక్రిడిటే షన్ల మంజూరులో తగిన ప్రాధాన్యత కల్పించాలని సంపాదకులు ప్రధానంగా డిమాండ్ చేశారు.

అక్రిడిటేషన్ల సంఖ్య పెంచాలి: ప్రస్తుత ప్రభుత్వ జీ.ఓ. ప్రకారం చిన్న పత్రికలకు కేవలం రెండు అక్రిడిటేషన్లు మాత్రమే మం జూరు అవుతున్నాయి. ఈ పరిమిత సంఖ్య వలన, ప్రతి మండలంలో, నియోజకవ ర్గంలో పనిచేస్తున్న కనీసం నలుగురు విలే కరులు గుర్తింపుకు దూరమవుతున్నారు. జిల్లా స్థాయిలో ఎడిటర్, స్టాఫ్ రిపోర్టర్‌ల తో పాటు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరి వంతునైనా అక్రిడిటేషన్లు మంజూరు చే యాలని కోరారు.

జీతాలు లేని కష్టాలు: తమ పత్రికల్లో ప నిచేసే అనేక మంది విలేకరులకు స్థిరమైన జీతాలు లేవు. అక్రిడిటేషన్ కార్డు లేకపో వడం వలన, వార్తా సేకరణ కోసం అయ్యే ఖర్చులను, ముఖ్యంగా బస్సులలో ఉచిత/రాయితీ ప్రయాణ సౌకర్యాన్ని పొందలేక సొంతంగా భరించాల్సి వస్తుంది.

ప్రకటనలలో ప్రాధాన్యత: ప్రకటనల విడుదలలో కూడా చిన్న పత్రికలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

వృత్తి గౌరవం: ప్రభుత్వ గుర్తింపు లేక పోవడం వలన విలేకరులు అధికారిక సమావేశాలకు, ఉన్నతాధికారుల పత్రికా సమావేశాలకు ప్రవేశం పొందలేకపోతు న్నారు. ఇది వారి వృత్తి గౌరవాన్ని తగ్గించి, ప్రజల కు సకాలంలో సమాచారాన్ని అందించకుండా అడ్డుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగితం ధరల మంట, ప్రకటనల కరువు ఒకవైపు దహించి వేస్తుంటే... ప్రభుత్వాల చిన్నచూపు వారి జీవనాన్ని, వృత్తి గౌరవా న్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయని సంపాద కులు పేర్కొన్నారు.

**కలెక్టర్‌కు వినతి పత్రం**

తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీ సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించే 'స్పందన' కార్యక్రమంలో విన తిపత్రం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయిం చారు. అనంతరం, భవిష్యత్తులో కార్యక్ర మాల నిర్వహణ నిమిత్తం 12 మందితో కూడిన కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

# కూల్చేస్తున్న నాలుగవ స్తంభం

కూడూ గుడ్డా అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతా అన్నాడట. అలావుంది మనోళ్ళ పద్ధతి. సమాచార శాఖ అసంబద్ధ పద్ధతులకు పాత్రికేయ రంగం వీడి ఏ పాన్‌షా పునో పెట్టుకుని బతకాల్సినపరిస్థితి ఏర్పడుతున్నాది. చిన్న పత్రికేల్లో పనిచేసే పాత్రికేయులకు అక్రిడేషన్ రాదని ప్రచారం మొదలుపెట్టింది. ఎన్డీయే కూటమి వచ్చాక ...సైకో నిర్ణయాలకు నీళ్ళు ఒదిలి పాలన పట్ల అవగాహ నతో ప్రభుత్వం ఉంటుందని భావించడం ఎండమావిలో నీళ్ళని వెదుక్కోవడమేనని తేలిపోతున్నాది. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉండగా పార్టీపై జరుగుతున్నదాడులని, ప్రజా ఉద్యమాలని.. ప్రభుత్వ విధానాలని నిక్కచ్చిగా రాసి నందుకు ఎందరో పాత్రికేయులని ఇబ్బంది పెట్టారు. కూటమి ప్రభుత్వ వచ్చాక పాత్రికేయులపై పగపట్టినట్టు అడ్డగోలు ఉత్తర్వులు తెచ్చి వారిని నడిరోడ్డున నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి ఎన్డీయే అధికారంలోకి రావడానికి ఆనాడు పెద్ద ఎత్తున జరిగిన నిరసనలని.. చంద్రబాబు అరెస్ట్‌ని...ఆనాటి కొన్ని హత్యాకాండలని వెలుగులోకి తీసుకురావడమే పాత్రికేయుల నిబద్ధతకు నిదర్శనం. ఏరులో ఉంటే మల్లన్న ఏరుదాటాకా బోడిమ ల్లన్న అన్న సామెతలా ప్రస్తుతం పాత్రికేయులని చాలా సులువుగా విసిరి...ఏరి పారేస్తున్నారు. మీరిస్తే అక్రిడిటే షన్లు.. గుర్తింపు నిజంగా పాత్రికేయులకు బలాన్నో బలగాన్నో ..ఆర్థిక ఇబ్బంది నుంచి బయటపడడానికో ఏ మాత్రం పనికి రాదు. కానీ అదేదో పద్మశ్రీ అవార్డు ఇచ్చినట్టు తెగ ఫీలయిపోతున్నారు. వక్ఫ్ ఎలా భూములను తనలో కలుపుకుంటుందో.. సర్వోత్తమ న్యాయస్థానానికి పత్రాలు సమర్పిస్తే ఖాతరు చేయలేదు. పరకామణి కేసులో లోక్ అదాల్త్ రాజీ ఎలా కుదుర్చు కుందో చెప్పలేదు.. దాంతో న్యాయవ్యవస్థ విశ్వసనీయత పెద్ద ప్రశ్నగా మారింది. ఇక పార్లమెంటరీ వ్యవవస్థ ఒక ఎంపిని చిత్రవధ చేసిన నప్పుడు ఐపిఎస్‌ల, వెంకన్న ఆస్తులు ఇతర ఏసిబి దాడుల్లో దొరికిన ప్రభుత్వ పెద్దల విషయాల్లో ఐపిఎస్‌లపై నమ్మకం కోల్పతున్నారు. ఇవన్నీ సరికాదన్నట్లు అన్నివ్యవస్థలని పరిరక్షించే బాధ్యత తీసు కుంటున్న పాత్రికేయ వ్యవవస్థను ఛిన్నాబిన్నం చేయడా నికి ఎన్డీయే కూటమి ఇష్టమొచ్చిన జివోలతో వారి హక్కులను హరిస్తూ చిద్రం చేస్తున్నాది. ఎప్పుడూ పాత్రికే యులు ప్రజల...ప్రతిపక్షాల గొంతు వినిపిస్తూనే ఉంటారు. యాజమాన్యాలు పాత్రికేయుల విద్య, వ్యవహా రశైలి వారు రాసే వార్తలు, కథనాల ద్వారా పత్రికల్లో అవకాశం ఇస్తుంది. ఫ్రీలాన్స్ జరర్నలిస్టు తనకుండే పరి జ్ఞానంతో వివిధ అంశాలపై ఉన్న అవగాహనతో కథనాలు రాస్తాడు. ఇక అనేకసంవత్సరాల అనుభవం కలిగి ఉన్న వెటరన్ జర్నలిస్టు తను రాసే విషయాలపైనే పరిపూర్ణత సాధించిచి పత్రికలకు అందిస్తాడు. ఆయా యాజమాన్యాలకు పాత్రికేయుల ఎకడమిక్ ఎడ్యుకేషన్‌తో పనిలేదు. పాత్రికేయులలలో ఉన్న నిబద్ధత.. సౌశీల్యత...కా వాలి. కానీ..మీరిచ్చే గుర్తింపుకార్డుకు ..ఎడ్యుకేషన్ కాలమ్ పెట్టి కొంతమంది జర్నలిస్టులను తొలగించే ప్రయత్నం చేయడం దారుణమయిన విషయం. ఏ ఐఏఎస్ అధికారి ఈ బోడి సలహాను ఇచ్చాడో..దానిని గుడ్డెద్దు చేలో పడినట్టు అమలు చేయాలనుకోవడం ఎంతవరకు సమం జసమో అందరికీ అర్థమైయిపోతున్నాది. పోనీ మీరు మాకు జీతాలు ఇస్తున్నారా? కనీసం వేజ్ బోర్డు అమలుకు జిఓలను చేసి అమలు పర్చారా? కనీసం సంక్షే మానికో...రుణానికో కృషిచేసే విధంగా తెలుగు జర్నలి స్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేడవరపు రంగనాయ కులు అడిగినట్లు మీడియా కార్పొరేషన్ ఏమైనా పెట్టారా...? ఉన్న రైలు పాస్‌ల రాయితీని కరోనాతో పాటు కాటేశారే! కేంద్రం మీకు అనుకూలంగా ఉన్నప్పుడు కూడా వాటిని పునరుద్ధరించే చర్యలు తీసుకో లేదే! చిన్న పత్రికలకు రాయితో ఊడిన కాగితాన్ని అందించగలుగు తున్నారా? వ్యవవసాయదారులకు రాయితీలకు ఇవ్వగలరా? ప్రభుత్వ ప్రకటనలు రోష్టర్ పద్ధతిలో విడుదల చేయగలరా? ఏమి పీకామని మనకి ఇంత మిడిసిపాటు అని ప్రశ్నిస్తే మీతలలు ఎక్కడ పెట్టు కుంటారు? 2025లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు జర్నలిస్టుల అక్రిడిటేషన్ల జారీకి కొత్త రూల్స్, పోర్టల్స్ ప్రారంభించాయి, ముఖ్యంగా ఏపీలో కొత్త రూల్స్ 2025 ఆగస్టు 31 వరకు గడువు పొడిగింపుతో పాటు, రెండేళ్ల కాలానికి (2026-27) కొత్త కార్డుల జారీకి దర ఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపాయి, వీటిలో జర్నలిస్ట్ సంఘాల భాగస్వామ్యం, పారదర్శకత ముఖ్య అంశాలు, ముఖ్యంగా అర్హతకు గుర్తింపు పొందిన మీడియా సంస్థలో పనిచేయడం, సరైన పత్రాలు సమర్పించడం అవసరం. మీడియా అక్రిడిటేషన్ అనేది ఖచ్చితంగా నిజాయితీగల మీడియా సంస్థకు ప్రాతినిధ్యం వహించే ప్రెస్ సభ్యులకు మాత్రమే వర్తిస్తుంది. దరఖాస్తుదారులు తాము నిజాయితీ గల మీడియాకు నివేదించడంలో నిరూపితమైన ట్రాక్ రికార్డ్ కలిగి ఉన్న ప్రొఫెషనల్ ప్రెస్ సభ్యులమని నిరూ పించుకోవాలి . ఇదండి ఒక ఫార్మెట్. నిజాయితీగల మీడియా సంస్థలు...బాగానేవుంది. మరి నిజాయితీతో పనిచేసిన జర్నలిస్టులను కూడా ఆ సంస్థల విలువలతోనే కట్టిపడేస్తే ఎలా.? గత ప్రభుత్వం ఎన్నో ఆంక్షలు..నిషేధా లతో జర్నలిస్టుల గొంతు నొక్కేసింది. ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం అమ్మకి కూడుపెట్టడు..కానీ పెద్దమ్మకు కోక కొంటాను అన్నట్టు ... అర్థం పర్థంలేని పద్ధతులతో....జర్న లిస్టుల జీవితాలతో ఆటలాడుతున్నాది. ఎంప్యానెల్మెంట్ జర్నలిస్టుకు ముడి పెట్టడం....ఏళ్ళ తరబడి పనిచేసిన వారిని కూడా వాళ్ళ అకడమిక్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్ తెమ్మనడం....అక్రిడేషన్ పొందిన నాటి నుండి నేటి వరకు ఉన్న పాత కార్డులు పెట్టమనడం ఇలా చాలా నిబంధనలు పెట్టి సాధ్యమైనంత వరకు పాత్రికేయులకు గుర్తింపు ఇవ్వ కూడదనే కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. మొదట్లో అక్రిడేషన్ కార్డులు ఇచ్చినప్పుడు పాతవి రిటన్ చేస్తేనే కొత్తవి ఇచ్చేవారు. ఆ విషయంలో కనీస అవగాహనలేని సమాచార శాఖ ఈ నిబంధనలు పెట్టడంలో అంతరార్థం ఏమిటి? ఇక ఎప్పుడో చదువుకున్న ధృవపత్రాలు వివిధ పత్రికల కంపెనీలలోనో... లేదా ఇతర ఉద్యోగాల కోసం వాటిని (ఒరిజనల్స్) ఇవ్వడం వలన వాటిని మరలా ఎక్క డినుండి తెస్తామని ప్రశ్నిస్తున్నారు. అయినా అక్షరం చొరవ లేనివాడు ఏ పత్రికల్లోనూ పనిచేయలేడు. వాడి వార్తలు, కథనాలే వాడి నైపుణ్యానికి నిదర్శనం. ఇలాంటి రూల్స్ పెట్టిన వాళ్ళనే ఆత్రగాళ్ళు అంటారు. వాళ్ళకు బుద్ధిమట్టంగా ఉంటుంది. ఇక సమాచార శాఖ ఉన్నతా ధికారులు...సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంత బల మైనదో తెలిసీ కూడా పాలకవర్గ రాజకీయాలకు తలలూపి లేనిపోని విధివిధానాలను తయారుచేసి ''బాస్''ల దగ్గర మెప్పుపొందుతుంటారు. ఏదో ఊడబొడుస్తామని చెప్పి '' అంత ఉరుము ఉరిమి ఇంతేనా కురిసింది'' అన్నట్టు పాత్రికేయుల గుర్తింపును ఎలా తగ్గించాలి....అనే ఆలోచ నలోనే ఉన్నారు. మీరిచ్చే గుర్తింపు కార్డు ఎంతవరకు ప్రయోజకారిగా ఉంటుందో అందరికీ తెలిసిందే. గతంలో ఉన్న రైల్వే పాస్‌లను కట్ చేశారు. ఇక ఆర్టీసీలో మూడవ వంతు ఛార్జి అని చెప్పి మూడవ వంతు వసూలు చేస్తున్నా.... ఎవరికీ పట్టదు. ఎక్కడుందండీ మీ జి.వోల ఆచరణ? ఇలా మీరు ముందుకు వెళితే కలం....ఇంకా కుదించుకుపోలేదు. కాస్త ఝులిపిస్తే..చాలు ఏ మంత్రులకు ఎంత క్వాలిఫికేషన్ ఉంది. గతంలో వారి నేరచరిత్ర ఏమిటి....ఇలా ముందుకు పోతుంటూనే ఉంటారు. పోనీ పాత్రికేయుల్లో నేరచరిత్రకలిగినా...లేదా నిందితులుగా ఉన్నా మీలా వారిని కూడా చూసిచూడ నట్టు ఒదిలివేయగలరా? ఈ ప్రశ్నలు ఇక ప్రజలనుంచి రాకముందే తడుముకోకుండా పునరాలోచించాలి.

ఎం.విజయభాస్కర్(సీనియర్ జర్నలిస్ట్), విజయనగరం

# పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పిద్దాం

## సచివాలయంలో జరిగిన తొలి మార్కెటింగ్ కమిటీ మీటింగ్ లో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**అమరావతి:** ఈవెంట్లు, ఉత్సవాలు, అడ్వర్టైజ్మెంట్ల ద్వారా పర్యాటక రంగానికి మరింత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయం రెండవ బ్లాక్ లోని పేషీలో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన పర్యాటక ప్రమోషన్, మార్కెటింగ్, ఈవెంట్స్, పండుగలు మరియు ప్రకటనల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తొలి భేటీ జరిగింది. సమావేశంలో దాదాపు 25 కు పైగా అంశాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మెగా ఈవెంట్లు, డిస్ట్రిక్ట్ ఈవెంట్లు, జాతీయ, అంతర్జాతీయ రోడ్డు షోలు,ఫెయిర్స్, సోషల్ మీడియా, బ్రాండింగ్ పార్ట్ నర్, హోర్డింగ్స్, డిజిటల్ అడ్వర్టైజ్ మెంట్, బ్రోచర్లు, వీడియోలు, డిజిటల్ కంటెంట్ తదితర రూపాల్లో రాష్ట్ర పర్యాటక రంగానికి, రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి దుర్గేష్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన అరకు చలి ఉత్సవ్, బెలూన్ ఫెస్టివల్, ఫ్లెమింగో ఫెస్టివల్, విజయవాడ ఉత్సవ్, కృష్ణవేణి సంగీత నీరాజనం తదితర అంశాలను గుర్తుచేశారు. అంతర్జాతీయ పర్యాటకులకు చేరువయ్యేలా ఉత్సవాల నిర్వహణ ఉ ండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలకత్తా, హైదరాబాద్ లలో రోడ్డు షోలు నిర్వహించాలని తెలిపారు. అదే విధంగా జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్లలో స్టాళ్ల నిర్వహణ మరింత సృజనాత్మకంగా, పర్యాటకులను, ఇన్వెస్టర్లను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. పర్యాటకుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరిన్ని రూపాల్లో ప్రచారం చేసి జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఏపీకి రప్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం



### గ్రామీణ రోడ్లు బ్రిడ్జిల నిర్మాణానికి

# రూ. 84.62 కోట్లతో పనుల మంజూరు

**- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం (మనసులో మాట) డిసెంబర్ 10:** జిల్లాలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఉన్న గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుందని, గత ప్రభుత్వ హయాంలో మరమత్తులకు నోసుకొని పంచాయతీరాజ్ రోడ్లను నిర్మించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్స్ (సాస్కి) నిధులతో జిల్లా వ్యాప్తంగా 67 పనులకు రూ. 84.62 కోట్లతో జిల్లాలో రోడ్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పరమైన అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బొబ్బిలి నియోజకవర్గం లోని 8 పనులకు, చీపురుపల్లి నియోజకవర్గంలో 10 పనులకు, గజపతినగరం నియోజకవర్గంలో 7 పనులకు, నెల్లిమర్ల నియోజకవర్గంలో 17 పనులకు,రాజాం నియోకవర్గంలో 6 పనులకు, ఎస్ కోటలో 7 పనులకు, విజయనగరంలో 12 పనులకు అనుమతులు దక్కాయని, ఈ నిధులతో రహదారులు, బ్రిడ్జిలను అభివృద్ధి చేసేందుకు పరిపాలన పరమైన ఉత్తర్వులు వెలుపడ్డాయని ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకం( ఏ పీ ఆర్ ఆర్ ఎస్ పి) పథకం కింద ఈ పనులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటం సంతోషించాల్సిన విషయం అని ఆయన తెలియజేశారు. ఈ పనుల్లో భాగంగా గజపతినగరం నియోజకవర్గంలో సుదీరెకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న పనులకు పరిపాలన పరమైన అనుమతులు రావటం సంతోషించాల్సిన విషయమన్నారు. ఇటీవల గజపతినగరం నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందరరేగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన జామి మండల పరిధిలోని శాసనపల్లి పెదవేమలి మధ్య సుదీరెకాలంగా పెండిరగ్లో ఉన్న హై లెవెల్ వంతేన నిర్మాణ పనులకు, గజపతినగరం మండలం ఆంధ్ర ఆర్ అండ్ బి రోడ్ నుంచి మర్రివలస మధ్య రహదారితోపాటు బ్రిడ్జి నిర్మాణపనులకు అనుమతులు రావడం పట్ల ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. విజయనగరం జిల్లా పరిధిలో ఇంతపెద్ద ఎత్తున రహదారులు, బ్రిడ్జి నిర్మాణ పనులకు అనుమతులు రావడం వెనక రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నేత నారా లోకేష్ చొరవ ఎంతో ఉందని, వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఈ ప్రకటనలో వివరించారు.

### జిల్లాలో భూగర్భ నీటి వనరులను

# ఆధ్యాత్మికత ధోరణిలో కాపాడుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్**



పాడేరు డిసెంబర్ 10 ( మనసులో మాట ): మన పూర్వికులు ఆచరించిన ఆధ్యాత్మిక ధోరణి లో ప్రకృతిని పూజించి, ఇంకుడు గుంతలు చెరువులు ఏర్పాటు చేసి కాపాడటం వల్ల భూగర్భ జలాలను పెంపొందించి భవిష్యత్ తరాలకు నీటి వనరులు అందించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు.

బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారత ప్రభుత్వ కేంద్రీయ భూగర్భ జలమండలి దక్షిణ క్షేత్రం, హైదరాబాద్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగ కార్యాలయము విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో రైతులతో,ప్రజలతో చర్చాగోష్టి కార్యక్రమంలో అల్లూరు సీతారామరాజు జిల్లాలో భూగర్భ జలాల అభివృద్ధి,జల యాజమాన్య వనరుల మ్యాపింగ్ మరియు నిర్వహణపై ప్రత్యేక దృష్టి కార్యక్రమం ను ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షపాతం నమోదు, భూగర్భ జలాలు అధికంగా ఉన్ననూ భూగర్భ జలాలను వినియోగించుకోవడంలో వెనుకబడి పోతున్నామని, దానిని అధిగమించి జిల్లాలోని గ్రామాలకు త్రాగునీరు, సాగునీరు అందించే విధముగా జిల్లా భూగర్భ జల వనరుల శాఖ, ఆర్ బ్ల్యూఎస్, డ్వామా శాఖల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు.

తూర్పు కనుమలు ప్రకృతి రమణీయతతో అలారారుతున్నాయని ఉత్తరాంధ్రలో కొన్ని వేల, లక్షల ఎకరాలకు సాగునీరు ఉత్తరాంధ్రలో కొన్ని వందల గ్రామాలకు త్రాగునీరు అందిస్తున్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని లేని పక్షంలో ఆయా ప్రాంతాల్లో భూములు బీడు భూములుగా మారే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలోని 22 మండలాల్లో వర్షపాతం లోటు లేకున్నను నీటి నిల్వ, నీటి నాణ్యత, భవిష్యత్తులో ఎలా కాపాడుకోవాలని దానిపై జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రచిస్తుందన్నారు.

జిల్లాలో గోదావరి,ఏలేరు, తాండవ శారద,గోస్థని మొదలగు నదులు ప్రవహిస్తున్నాయని వాటి ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెంచుతున్నామని దానితో పాటుగా జిల్లాలో ఉన్నటువంటి ప్రజలు అందుబాటులో ఉన్నటువంటి నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జిల్లా భూగర్భంలో నైట్రైట్ , ఫ్లోరైడ్ నియంత్రణలోనే ఉన్నాయన్నారు. జిల్లాలో వర్షం పై ఆధారపడే పంటలు పండిస్తున్నామని సంవత్సరానికి ఒక పంట చేతికి వస్తుందని ఏడాదిలో రెండు మూడు పంటలు చేతికి వచ్చే విధముగా వ్యవసాయ బోర్లను ఏర్పాటు చేసుకోవాలని తద్వారా భూగర్భ జల వనరులను సద్వినియోగం చేసుకునే వాళ్ళం ఎక్కువమంది రైతులు అవుతామని, భూగర్భ జలాలు కూడా పెరిగే దించవలసిన అవసరం ఉందన్నారు. నీటి వనరులు కింది భాగంలో ఆవాసాలు వ్యవసాయ భూములు పైన ఉండుట వలన నీటి ఎద్దడి ఏర్పడుతుందని దానిని అధిగమించుటకు నీటి ఊటలను కాపాడుకొని నిలువ చేసుకొని త్రాగునీటికి వ్యవసాయానికి ఉపయోగించుకోవాలన్నారు.

నీటి యజమాన్య సంస్థ ద్వారా జిల్లాలో నీటి నిల్వకు 254 చెక్ డ్యామ్ లను నిర్మించడం జరిగిందని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంటలను, పంట కుంటలను తవ్వించడం జరుగుతుందని, నీటి ఊటలను, బుగ్గలను కాపాడుకోవాలన్నారు. ఎక్కువ వర్షపాతం నమోదు, బలమైన ప్రకృతిని తయారు చేయడం, శక్తి వంతమైనటువంటి ప్రకృతి వనరులను కాపాడుటకు మానవ నిర్మిత నిర్మాణాలను సంరక్షించడం అధిక భూగర్భ జలం లభించే విధముగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు. మన పూర్వీకులు ఆచరించిన ప్రకృతి ఆరాధన ద్వారా నీటి వనరుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చాన్నారు. గ్రామ సభల తీర్మానాల ద్వారా నీటి వనరులను కాపాడాలన్నారు.కేంద్రీయ భూగర్భ జలమండలి దక్షిణ క్షేత్రం హైదరాబాద్ వారు ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహించడం ప్రజలతో చర్చ గోష్టి నిర్వహించడం తనకెంతో సంతృప్తి నిచ్చిందన్నారు.

కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, హైదరాబాద్ ఎం. జ్యోతి కుమార్ వారు మాట్లాడుతూ వాతావరణం కాలుష్యం లేని ఇటువంటి ప్రాంతంలో జీవించడం మీ అదృష్టమని, సైంటిఫిక్ గా పుస్తక రూపంలో ఉన్నటువంటి సమాచారాన్ని ప్రాక్టికల్ గా దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్యక్రమాలు జరిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 8 శాతం భూగర్భ జలాలను వాడుతున్నారని అవకాశం మేరకే భూగర్భ జలాలను వినియోగించాలని లేనిపక్షంలో భూములు బీడుగా మారే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయానికి ఉపయోగించే బోర్లకు ఫ్లో మీటర్లను బిగించి మోతాదుకు మించి ఎంత వాడుతున్నారో పర్యవేక్షించాలన్నారు. అమెరికా ప్రతినిధి గోపాల్ వారు మాట్లాడుతూ నీటి నిల్వకు 20 వరకు పద్ధతులు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ దామోదర్, శాస్త్రవేత్త, సిజిడబ్ల్యుబి, విశాఖపట్నం,ఆర్ నాగేశ్వరరావు డిప్యూటీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎస్ ఎమ్ ఐ సబ్ డివిజన్ పాడేరు, ఆర్ డబ్ల్యూఎస్, డ్వామా అధికారులు మరియు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పెత్తందార్లుకు దోచిపెట్టేందుకు ప్రవేటీకరణలు

**ఎస్. రాయవరం, డిశంబర్ 10 (మనసులో మాట):** కూటమి ప్రభుత్వం పెత్తందార్లుకు దోచిపెట్టేం దుకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఇతర సంస్థ లను ప్రవేటీకరణ చేసేందుకు మొగ్గు చూపుతుందని మాజీ శాసన సభ్యుడు, వైఎస్సార్సీపి పాయకరావుపేట నియోకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ఆరోపించారు. మెడికల్ కళాశాలలు ప్రవేటీకరణ కు వ్యతిరేకంగా నియోజవర్గంలో వైఎస్సార్సీపి చేపట్టిన సంతకాలు సేకరణ ప్రతులును బుధవారం అనకాపల్లి జిల్లాపార్టీ కార్యలయానికితరలించి, జిల్లా అధ్యక్షుడు అమరనాథ్ కుఅందచేసారు. సంతకాలు ప్రతులుతో బయలుదేరిన వాహానానికి జోగులు జెండాఊపి తరలించారు. వాహానంతో పాటు నియోజకవర్గంలో నాలుగుమండలాల నాయుకులుతో అడ్డురోడ్డు పార్టీ కార్యాలయం నుండి పైవంతెన వరకు ర్యాలీగా తరలివెళ్ళారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైద్యకళాశాలలు ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ 55 వేల మంది సంతకాలు చేసారన్నారు. కోటిసంతకాలను గవర్నర్ కుఅందచేయనున్నట్లు తెలిపారు. కూటమిపాలనలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయుకులు శీరం నర్సింహా మూర్తి, ధనిశెట్టిబాబూ రావు, ఎల్ చంద్రరావు, కర్రిసత్యనారాయణ, మధువర్మ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అనకాపల్లి జిల్లాలో

# 11వ విడత 'మొబైల్ రికవరీ మేళా'

**- బాధితులకు 1.50 కోట్ల రూపాయలు విలువైన 750 మొబైల్ ఫోన్లు అందజేత**

**- మొబైల్ కేవలం పరికరం కాదు, అది వ్యక్తిగత గుర్తింపు - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా**




**అనకాపల్లి, డిసెంబర్ 10 ( మనసు లో మాట):** అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, ప్రజల ఆస్తుల రక్షణే ధ్యేయంగా పని చేస్తోంది. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణ లో 11 వ విడత "మొబైల్ రికవరీ మేళా"ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐ.పి.ఎస్.హాజరయ్యారు. గత రెండు, మూడు నెలల కాలంలో రికవరీ చేసిన 750 మొబైల్ ఫోన్లను (విలువ సుమారు రూ. 1.50 కోట్లు) సంబంధిత బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ జిల్లాలో ఐటీ కోర్ టీమ్ చేస్తున్న నిరంతర కృషిని కొనియాడారు. ఈ 11 వ విడతలో 750 మొబైల్ ఫోన్లు (యాపిల్, శాంసంగ్, వివో, రెడ్ మి మొదలైనవి) రికవరీ చేయబడ్డాయి. 1-6-2022 నుంచి ఇంతవరకు 11 విడత ల్లో కలిపి మొత్తం 4,086 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగింది. వీటి విలువ సుమారు 6.77 కోట్లు రూపాయలు. కేవలం ఈ సంవత్సరంలోనే ఇంతవరకు జరిగిన 3 మేళాల ద్వారా 1,880 మొబైల్ ఫోన్లను (విలువ 3.70 కోట్లు రూపాయలు) రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు.

**సరిహద్దులు దాటిన గాలింపు**

కేవలం అనకాపల్లి జిల్లా లోనే కాకుండా, పొరుగు జిల్లాలైన తూర్పుగోదావరి, అనంతపురం, సత్యసాయి జిల్లాల తోపాటు ఇతర రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా మన ఐటీ కోర్ బృందం వ్యయప్రయాసలకు ఓర్చి ఈ ఫోన్లను రికవరీ చేసిందని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ప్రస్తుత కాలంలో మొబైల్ అనేది కేవలం మాట్లాడటానికి ఉపయోగించే పరికరం మాత్రమే కాదు, అది 'పర్సనల్ ఐడెంటిటీ'గా మారింది. ఫోటోలు, బ్యాంకింగ్ (యుపిఐ), ముఖ్యమైన నోట్స్ అన్నీ అందులోనే ఉంటున్నాయి. గత మేళాలో ఒక విద్యార్థి ని తన కాలేజీ నోట్స్ అన్నీఫోన్లో ఉండటం వల్ల, ఫోన్ దొరక గానే చాలా సంతోషించడం జరిగింది. బాధితుల కళ్ళలో ఆ ఆనందం చూడటమే మాకు నిజమైన సంతృప్తి," అని ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు.

**సులభతరం చేసిన ఫిర్యాదు విధానం**

మొబైల్ పోయినప్పుడు బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. సిఈఐఆర్ పోర్టల్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన www.ceir.gov.in వెబ్సైట్లో 'లాస్ట్ మొబైల్ ' ఆప్షన్ ద్వారా ఐఎంఇఐ నెంబర్, ఫోన్ మోడల్ వివరాలు నమోదు చేయవచ్చు. వాట్సాప్ సేవలు: అనకాపల్లి జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9346912007 కు "హెచ్ఐ" అని మెసేజ్ చేసి, వచ్చే లింక్ ద్వారా ఇంట్లో నుంచే ఫిర్యాదు చేయవచ్చు. ?ప్రజలు అందించిన సమాచారం ఆధారంగానే ఐటీ కోర్ టీమ్ ఇంత వేగంగా స్పందించి ఫలితాలు సాధిస్తోందని, ప్రజలు ఈ విధానాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా కోరారు. నిరంతరం శ్రమిస్తూ, సాంకేతికతను జోడించి బాధితులకు న్యాయం చేస్తున్న సైబర్ సెల్ సిఐ బెండి వెంకటరావు, ఐటీ కోర్ ఎస్సై సురేష్ బాబు, సిబ్బంది ని, ప్రత్యేక సెల్ బృందాన్ని ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. హెచ్.సి లక్ష్మీపతిరావు, పీ.సీ లు , అనంత కళ్యాణ్, గోవిందరావు, దిలీప్ కుమార్, నరేష్, హెూంగార్డులు సింహాచలం, రమేష్ కుమార్ లకు ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందజేశారు. ?ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్ రావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ బి.వెంకటరావు, ఇతర ఇన్స్పెక్టర్లు బాల సూర్యారావు, లక్ష్మీ, రమేష్, ఐటీ కోర్ ఎస్సై బి.సురేష్ బాబు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



# 12 న పెందుర్తిలో క్రిస్మస్ సెలబ్రేషన్స్

**పెందుర్తి (మనసులో మాట)డిశంబరు 10 :** క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 12న శుక్రవారం పెందుర్తి విక్టరీ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్స్ లో క్రిస్టమస్ సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నట్లు పెందుర్తి, బీసీ కాలనీ క్రిస్టియన్ ఫెయిత్ చర్చ్ నిర్వాహకులు సిహెచ్ డేనియల్ సిహెచ్ మేరీ రత్నం, విక్టరీ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటి జయసుధ, ప్రముఖ మాజీ సినీ డాన్సర్ అనిల్ రాజ్, ముఖ్య అతిథులుగా విశాఖ నగరం మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అవగడ్డ జ్యోతి అప్పలనాయుడు పాల్గొంటారని వారు తెలిపారు. సిహెచ్ మేరి రత్నం జన్మదినం పురస్కరించుకొని ఈ వేడుకలు జరుపుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటి జయసుధ వాక్యోపదేశంతో పాటు క్రిస్టమస్ పాటలు, క్రిస్టమస్ నాటకాలతో బాల యేసు జన్మదినాన్ని తలచుకుంటూ అంగరంగ వైభవంగా కార్యక్రమం జరుపబడుతుందని తెలిపారు. ఈ వేడుకల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.చెందిన క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

### విభిన్న ప్రతిభావంతులకు

# ప్రభుత్వం అండగా ఉండాలి - భీశెట్టి



**విజయనగరం (మనసులో మాట) డిసెంబర్ 10:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని,వారి కనీస అవసరాలు తీర్చేందుకి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శ్రీ విజయదుర్గ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు దవడ కొండబాబు అధ్యక్షతన బుధవారం సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశం కి భీశెట్టి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులను సదరన్ రీ వెరిఫికేషన్ పేరుతో ఇబ్బందులు పెడుతుందని ఆరోపించారు, కనీసం కదల్లేని వారిని సుదూర ప్రాంతంలోని ఆసుపత్రికి వెళ్ళమని ఆదేశాలు జారీచేశారని కొంతమంది కొత్తవారికి పింఛన్లు మంజూరు చేయాలని, నిజమైన వికలాంగులను ప్రభుత్వం ఇబ్బందులు పెట్టవద్దని కోరారు, శ్రీవిజయదుర్గ విభిన్న ప్రతిభావంతుల జ్యూట్ బ్యాగ్ తయారీ కేంద్రం లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందచేశారు,నిత్యం విభిన్న ప్రతిభావంతుల అండగా ఉండే దవడ కొండబాబు ని ఘనంగా సన్మానించారు,ఈ సమావేశంలో ట్రైనర్ తాలాడ దీప్తి,మాత ృభూమి సేవాసంఘం ఇప్పలవలస గోపాలరావు, కరక వెంకటరమణ, మజ్జి సత్యనారాయణ, రామునాయుడు,రమ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

**- జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్**



**విజయనగరం (మనసులో మాట) డిసెంబర్ 10:** ప్రతి విద్యార్థి, విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్ కోరారు. ఆయన బుధవారం దత్తరాజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థి, ఐఏఎస్ అధికారి మిత్తిరెడ్డి కుర్మారావు ప్రస్తుతం కరా?టక రాష్టం లో సర్వ శిక్ష డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. ఆయన తాను చదువుకున్న పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే కాకుండా, ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. గత విద్యా సంవత్సరం లో 10 వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి 5 గురు విద్యార్థులకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక, విలువైన పుస్తకాలతో బాటు నగదు బహుమతులు (రూ.5000/4000/3000/2000/1000) లను అందజేస్తున్నారు. ఈ బహుమతులను జిల్లా జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, మరియు మిత్తిరెడ్డి కుర్మారావు గారి తండ్రి మిత్తిరెడ్డి ఆదినారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు బుధవారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి మోహన్ రావు, దత్తిరాజేరు తహసీల్దార్, ఎంపీడీఓ, మండల విద్యాశాఖాధికారి సుధాకర్ గారు, కుర్మారావు అన్నయ్య వెంకటరమణ, పాఠశాల హెడ్మాస్టర్ శశికళ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## అనధికారికంగా టోల్ గేట్ ఏర్పాటు

**కోటవురట్ల(మనసులో మాట) డిసెంబర్ 10:** కోటవురట్ల మండలం గొట్టివాడ వద్ద అనధికారికంగా టోల్ గేట్ ఏర్పాటు చేసి అక్రమంగా సీనరేజ్ వసూళ్లు చేస్తున్నారని జడ్పిటిసి ఉమాదేవి ఆరోపించారు. బుధవారం కోటవురట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పిటిసి మాట్లాడుతూ ఇంత జరుగుతున్న అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ఆమె ప్రశ్నించారు. ఇసుక, పిక్కరాయి తరలిస్తున్న వాహనాల వద్ద అక్రమంగా రూ.400 నుంచి రూ.800 వరకు అక్రమంగా వసూళ్ల చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఏఈ పనితీరుపై బీకే పల్లి సర్పంచ్ లింగన్నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏ సమావేశంలో చెప్పినా పనులు జరుగుతున్నాయని చెప్పిందే చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల భూములను 22ఏ నుంచి తొలగించే విధంగా తహసిల్దార్ చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీటీసీ పీవీ సూర్యారావు విజ్ఞప్తి చేశారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి డాక్టర్ ధనలక్ష్మి హెచ్చరించారు.జ్వరం, వాంతులు తలపోటు తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు,మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ దత్తుడు సీతబాబు పాల్గొన్నారు.

### గొలుగొండ కేజీబీవీ పాఠశాలలో

## బాలికకు గర్భం

**గొలుగొండ, డిసెంబర్ 10,(మనసులోమాట) ..** గొలుగొండ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న ఒక బాలికకు గర్భం వచ్చిన ఘటన వెలుగులోకి వచ్చి స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.

**ఎస్ఓ చర్యలపై విమర్శలు**

సంఘటన బయటకు రానీయకుండా గుట్టుచప్పుడు కాకుండా బాలికను బంధువులకు అప్పగించారని ఆరోపణలు ఎస్ఓపై వెల్లువెత్తుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఎస్ఓ తీరు, వ్యవహారంపై పలువురు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

**ఎస్ఓ రాజీనామా**

వివాదాలు ఉధృతం కావడంతో పాఠశాల ఎస్ఓ తన విధులకు రాజీనామా చేసి స్కూల్‌ను విడిచిపెట్టినట్లు సమాచారం. ఇప్పటికే అధికారుల దృష్టికి విషయం వెళ్లగా, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### పల్స్ పోలియో ఏర్పాట్లపై డా. చంద్రశేఖర్ దేవ్

## ఆకస్మిక పరిశీలన



**అచ్చుతాపురం డిసెంబర్,10..** మనసులో మాట: అనకాపల్లి జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డా. చంద్రశేఖర్ దేవ్ అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. డిసెంబర్ 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమం కోసం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను డా. చంద్రశేఖర్ దేవ్ సమగ్రంగా పరిశీలించారు.

టీకాలు నిల్వచేసే ప్రదేశంలో శీతలీకరణ వ్యవస్థ, రికార్డులు, స్టాక్ వివరాలు వంటి విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తరువాత ఆయన పూడి గ్రామంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని కూడా సందర్శించారు. పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు నిర్ణీత సమయంలో తప్పకుండా ఇవ్వాలి, టీకాలపై గ్రామ ప్రజల్లో అవగాహన పెంచాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

### 16 నుంచి జనవరి 16 వరకు జగన్నాథస్వామి దేవాలయంలో

# ధనుర్మాసోత్సవ వేడుకలు

**- జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రాంకీ చే లక్షప్రదక్షిణ కార్యక్రమ గోడపత్రిక పోస్టర్స్ అవిష్కరణ -**



**అనకాపల్లి, డిసెంబర్ 10 (మనసులో మాట):** అతి పురాతనమైన రెండు శతాబ్దాల పైగా చరిత్ర కల్గిన అనకాపల్లి గవరపాలెం అగ్గిమర్రిచెట్టు సమీపంలోని శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఈనెల 16 నుంచి జనవరి 16 వరకు ధనుర్మాసోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సన్నహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించే లక్షప్రదక్షణ కార్యక్రమ పోస్టర్స్ ను బుధవారం అనకాపల్లి నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జి భీమరశెట్టి రాంకీ చే అవిష్కరించారు. మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సూచన మేరకు మొట్టమొదటి సారిగా శ్రీ జగన్నాథస్వామి ఆలయం లో ధనుర్మాసోత్సవ వేడుకలను పురష్కరించుకొని ఆలయం చుట్టూ లక్ష ప్రదక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థాన ఛైర్మెన్ దాడి బుజ్జి తెలిపారు. ఈ కార్యక్రమం లో జగన్నాథస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ దాడి బుజ్జి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మునగపాక మండలాన్ని నక్కపల్లి రెవెన్యూ డివిజన్ లో కలిపి

# ప్రజలకు కష్టాలు తేకండి

**మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చయ్య నాయుడు**




**మునగపాక, డిసెంబర్ 10,మనసులో మాట..** రిలే నిరాహార దీక్ష ఉద్దేశించి మండల పార్టీ అధ్యక్షులు ఆడారిఅచ్చయ్య నాయుడు మాట్లాడుతూ ఏదైనా ఒక ప్రభుత్వం ఏర్పడితే ఆ ప్రాంత ప్రజలకు ఏది చేస్తే మంచి జరుగుతుంది . ఏ పథకం ద్వారా ప్రజలను మంచి చేయగలుగుతాము ,ఏమి చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగు పడుతుంది, ఏం చేయడం ద్వారా రాష్ట్రంలో ఉన్నటువంటి యువత ఉత్తమమైనటువంటి బాటలో నడవడానికి అవకాశం ఉంటుంది, ఏమి చేయడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి, ఏం చేయడం ద్వారా ప్రజల యొక్క జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి, ఏం చేయడం ద్వారా ప్రజలు ఆర్థికంగా బలపడడానికి అవకాశం ఉంటుంది అని ఆలోచించి చేసే ప్రభుత్వం ఉత్తమమైనటువంటి ప్రభుత్వం అవుతుంది. ఎక్కడో విశాఖపట్నంలో ఉన్నటువంటి రెవిన్యూ డివిజన్ లో కాకుండా అనకాపల్లి పరిసర ప్రాంత ప్రజలకు దగ్గరగా ఉండే విధంగా అనకాపల్లిలో ఒక రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేసి ఆ రెవెన్యూ డివిజన్లో అనకాపల్లి, కసింకోట, మునగపాక మండలాలు అన్నిటినీ కూడా అనకాపల్లి రెవెన్యూ డివిజన్ లో గతంలో ఉన్నటువంటి పాలకుల పుణ్యమా అని సేవలు చేస్తూ ఉంటే ఇప్పుడు వచ్చినటువంటి ఈ కూటమి ప్రభుత్వం మునగపాక మండలాన్ని అనకాపల్లికి దగ్గరగా ఉన్నప్పటికీ కూడా మీకు సేవలు అందాలంటే నాలుగైదు కిలోమీటర్లు వెళ్తే సరిపోదు 60 - 70 కిలోమీటర్లు వెళ్తేనే మీకు దాని తాలూకా విలువ తెలుస్తుంది అని భావించారో ఏమో కానీ నక్కపల్లిలో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేసి అందులో మునగపాక కలపాలని భావిస్తున్నారు. దయచేసి యలమంచిలి నియోజకవర్గ శాసన సభ్యులు , స్థానిక ప్రజాప్రతినిధులు , స్థానిక కూటమి నాయకులు ఈ విషయాన్ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని మునగపాక మండలాన్ని యధావిధిగా అనకాపల్లి రెవిన్యూ డివిజన్ లో కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటారని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారు. మూడవ రోజు కార్యక్రమంలో స్వర్గీయ వైయస్ విగ్రహానికి నివాళులర్పించి దీక్షలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మరిసా రమణ, పి రామ జోగినాయుడు, ఆడారి కాశిబాబు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, మల్ల కనుమనాయుడు, సిరా రమణమ్మ, చీర జోగినాయుడు, ఆడారి కాశి బాబు, పిట్ట మంగరెడ్డి, కరణం పార్వతమ్మ పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### ఘనంగా మహిళా డిగ్రీ కళాశాలలో

# అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు



**అరకులోయ,డిసెంబర్ 10 (మనసులోమాట):** అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ 77వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవశుభాకాంక్షలను విద్యార్థులకు తెలియజేస్తూ 1948లో %ఖచీ% జనరల్ అసెంబ్లీ ద్వారా మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించిన సందర్భంగా డిసెంబర్ 10నమానవ హక్కుల దినోత్సవంజరుపుకుంటారని ఈ ఏడాది 2025 మానవ హక్కుల దినోత్సవాన్ని మన రోజువారీ అవసరాలు అనే థీమ్‌తో జరుపుకుంటున్నారని విద్యార్థినీలకు ప్రిన్సిపల్ చలపతిరావు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు కే ధర్మారావు మాట్లాడుతూ మానవ హక్కుల లో జీవించే హక్కు, స్వేచ్ఛ, బానిసత్వం మరియు హింస నుండి స్వేచ్ఛపనిచేసే హక్కు అభిప్రాయం మరియు భావ ప్రకటనా స్వేచ్ఛ ఇలా ఎన్నో హక్కులు వివక్షత లేకుండా ప్రతి ఒక్కరు పొందేందుకు అర్హులని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధం యొక్క నష్టాలు మళ్లీ జరగకుండా నిరోధించడానికి 1948లో మానవ హక్కుల ప్రకటన ప్రాథమికంగా ఆమోదించబడింది, 1950లో ఈ హక్కుల కోసం ప్రపంచ గుర్తింపు మరియు ప్రోత్సహించడానికి ఈ దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించారని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎకనామిక్స్ అధ్యాపకులు ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ మానవహక్కులు ప్రతి దేశంలోని ప్రతి వ్యక్తికి చెందినవి కాబట్టి వీటిని సార్వత్రిక హక్కులు అని పిలుస్తారని, అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం కేవలం ఒక తేదీ మాత్రమే కాదు, ప్రతిసమాజంగౌరవం,సమానత్వం మరియు న్యాయం గురించి ఆలోచించడానికి ఒక అవకాశం అని సాధారణ ప్రజలు అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమాలు సహాయపడతాయని విద్యార్థులకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

### ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమం పై

# ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

**- మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాలరావు**



**మునగపాక, డిసెంబర్ 10, మనసులో మాట..** ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యుమరసీ (ఎఫ్ ఎల్ ఎన్ )ప్రోగ్రామ్ నీ 75 రోజుల కార్యక్రమాన్ని మన మండలము లో అన్నీ ప్రైమరీ పాఠశాలల్లోకచ్చితం గా జరగాలని మండల విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయులకు సూచించారు. కమిషనర్ , జిల్లా విద్యాశాఖ అధికారి ఈ జి ఎఫ్ ఎల్ ఎన్కార్యక్రమం పై ప్రత్యేక శ్రద్ధ వహించారని, ఇది ప్రాథమిక స్థాయిలో 3 వ తరగతి పూర్తి అయ్యే సరికి అందరికీ చధవడం, రాయడం , అర్థం చేసుకోవడం మరియు సంఖ్యా శాస్త్రం అంటే కూడిక లు, తీసివేతలు , గుణకారాలు మరియు ప్రాథమిక గణిత సమస్యలను చేయడం లో ఈ ఎఫ్ ఎల్ ఎన్ కార్య క్రమం ఉపయోగ పడుతుంది అని, ఎంఈఓ 1. వేణు గోపాల రావు తెలిపారు. ప్రతీ విద్యార్థి ప్రాథమిక విద్యను విజయవంతం గా పూర్తి చేయడానికి ఈ జి ఎఫ్ ఎల్ ఎన్ 75 డేస్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుంది అని , ఇది జాతీయ విధానం (ఎన్ ఈ పి - 2020) లో ముఖ్యమైన విషయం అని, పిల్లల పునాధికి ఇది దోహద పడుతుంది అని ఎంఈఓ-2 బుద్ధశివ నాయుడు తెలిపారు. ఈ కార్య క్రమం లో మండల ప్రైమరీ ఉపాధ్యాయులు మరియు సి ఆర్ ఎం టి లుకర్రి. లక్ష్మీ నారాయణ, బి అచ్చుత కృష్ణ, ఆర్ సత్తి బాబు అందరూ హాజరు అయ్యారు.



### నాతవరం ఎంపీడీవో కార్యాలయంలో

# మాటమంతి లైవ్ ప్రోగ్రాం

**నాతవరం డిసెంబర్10( మనసులో మాట)..** నాతవరంఎంపీడీవోకార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులతో మాటమంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో నాతవరం ఎంపీడీవో కార్యాలయంలో ఏవో పోలుపర్తి పార్ధసారథి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం లైవ్ ప్రోగ్రాంను వీక్షించే ఏర్పాటు చేశారు. దీంతో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.

# ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం




**వి మాడుగుల డిసెంబర్ 10 (మనసులో మాట)..** మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడమైనది. సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సభా అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి వి ఎస్ ఎస్ శాస్త్రి విశ్వవ్యాప్తంగా ఉన్న మానవులందరికీ గల హక్కుల ఆవశ్యకతను వివరించారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి బి రాజు మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవ చరిత్ర ఆవశ్యకతను విశదపరిచారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి జయలక్ష్మి మాట్లాడుతూ మానవ హక్కుల తో పాటు సకల చరచర జీవరాశులకు కూడా హక్కులు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు మానవ హక్కులను కాపాడడంలో వివిధ సంస్థల కృషిని వివరించారు. కామర్స్ అధ్యాపకులు ఎస్.అంబేద్కర్ రాజు సైబర్ నేరాలు కూడా మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తాయన్నారు. ఆంగ్ల అధ్యాపకులు బి నారాయణ పర్యావరణ పరిరక్షణ కూడా మానవ హక్కుల జాబితాలోకి వస్తుందన్నారు. డాక్టర్ పులవర్తి పైడిరాజు సభకు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీ విద్యార్థులు మహేశ్వరి, రమ్య,జ్యోతిక, సతీష్, తరుణ్,లు మానవహక్కుల రకాలు వాటి పరిరక్షణకు వివిధ సంస్థల కృషి తెలియజేశారు.

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ సి వి ఎస్ ఎస్ శాస్త్రి ద్వారా బహుమతులు అందజేశారు.

### కారుణ్య (18 నెలలు) లివర్ సమస్య తో బాధపడుతున్న

# చిన్నారి ఆపరేషన్ కోసం చేయూత



**సబ్బవరం, డిసెంబర్ 10, ( మనసులో మాట):** సబ్బవరం మండలం, పెదనాడపాలెం గ్రామం జోడుగుళ్ళు శ్రీ బంగారు తల్లి సేవా సమితి, ఆర్క్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ దయాల్ నగర్(గాజువాక), మరియు జయేంద్ర మల్కాపురం కానిస్టేబుల్, మేడిచెట్టు రాము ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం ఖండివరం గ్రామం చెందిన గేదెల గంగు నాయుడు, హేమ దంపతుల చిన్నారి కారుణ్య (18 నెలలు) లివర్ సమస్య తో బాధపడుతుంది. చిన్నారి ఆపరేషన్ కోసం ఫోన్ పే ద్వారా కలెక్ట్ చేసిన అమౌంట్ 1,85,289 రూపాయల ఈ చిన్నారికి ఆపరేషన్ నిమిత్తం అందజేయడం జరిగినది.శ్రీ బంగారు తల్లి సేవాసమితి ఆధ్వర్యంలో సింగంపల్లి వెంకటరావు, రోమాల ప్రవీణ్ కుమార్, గండి రవికుమార్, పరవాడ అనిత. ఫోన్ పే ద్వారా కలెక్ట్ చేసిన అమౌంట్ 1,13,100 రూపాయల మల్కాపురం కానిస్టేబుల్ జయేంద్ర, మరియు మేడిచెట్టు రాము. ఫోన్ పే ద్వారా కలెక్ట్ చేసిన అమౌంట్ 33,189 రూపాయలు ఆర్కే ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ టి. సత్యనారాయణ మరియు వై .నగేష్. చెక్కు రూపంలో అందజేసిన అమౌంట్ 39000 వేలు రూపాయలు మేమందరం కలెక్ట్ చేసిన మొత్తం అమౌంటు 1,85,289 రూపాయలు ఆ చిన్నారి తల్లిదండ్రులకు అందజేయడం జరిగినది. ఈ పసిపాప ప్రాణం కాపాడేందుకు మా మొబైల్ లో పెట్టిన స్టేటస్ ని చూసి ఫోన్ పే ద్వారా అమౌంట్ పంపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదములు తెలియజేస్తున్నామనీ తెలిపారు.

## చట్టం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**చీడికాడ, డిసెంబర్ 10, (మనసులో మాట)..** చట్టం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సతీష్ అన్నారు మండలంలో మంచాల ఏపీ మోడల్ స్కూల్లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం సంకల్పం అనే కార్యక్రమం తిరిగింది ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి పండించిన సేవించిన వ్యాపారం చేసిన ఎన్డిపీఎస్ చట్టం ప్రకారం 20 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందన్నారు వీటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఆయన ఆయన కోరారు గంజాయి నిర్మూలనకు 1972 కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు





## కరాటే, ఉషుపై విద్యార్థినీలకు శిక్షణ

**నర్సీపట్నం ,డిసెంబర్ 10 (మనసులో మాట)..** నర్సీపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సెల్ఫ్ డిఫెక్స్ కోసం కరాటే, ఉ షులో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవి.మాధవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ పిడిలు కే.రమేశ్, ఎ. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సీనియర్ నేషనల్ మెడలిస్టులు తేజస్విని, మౌనికలు విద్యార్థినీలకు ప్రాథమిక నుండి ఆధునిక స్థాయి వరకు పటిష్టమైన శిక్షణ అందించారు. ఈ శిక్షణలో బాలికలు ఎంతో ఉ త్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి మాట్లాడుతూ ఈ శిక్షణ బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

## పిఆర్‌టియు ఎన్నిక ఏకగ్రీవం





**కె.కోటపాడు, డిసెంబర్10 (మనసులో మాట):** పి.అర్.టి.యు.(ప్రోగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) కె.కోటపాడు మండల శాఖ నూతన కార్యవర్గానికి బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా పీఅర్టీయు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, రాష్ట్ర కార్యదర్శి సత్యంనాయుడు వ్యవహించారు. ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. పి.అర్.టి.యు. మండలశాఖ నూతనఅధ్యక్షునిగా పోతల నాయుడుబాబు, ప్రధాన కార్యదర్శిగా రావాడ త్రినాధ్, గౌరవ అధ్యక్షునిగా సూరిశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షునిగా గాలి సతీష్, అసోసియేటివ్ అధ్యక్షునిగా వంటాకు శ్రీనువాసరావు, ట్రెజరర్ గా పిల్లల రమేష్, కార్యదర్శిలుగా లగుడు సత్యవతి, బోని విజయలక్ష్మి, భరతలక్ష్మీ, పి.దేముడుబాబు, పి.శ్రీనువాసరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా కె.ఈశ్వరరావు, సిచ్.కమల, జిల్లా కార్యదర్శిలుగా మాడెం వరలక్ష్మి, మండల మురళీకృష్ణ, ఇమంది ప్రవీణ్, కె.అరుణ కుమారి ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయడానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రమాణం చేశారు.

## ఈ నెల 19న ఏ.పి.ఎన్.జ.జి.ఓస్ సబ్బవరం తాలూకా యూనిట్ ఎన్నికలు

**సబ్బవరం, డిసెంబర్ 10, ( మనసులో మాట) :** రాష్ట్ర గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (ఏ.పి.ఎన్.జ.జి.ఓస్) సబ్బవరం తాలూకా యూనిట్ ఎన్నికల డిసెంబర్ 19వ తేదీన జరుగునున్నట్లు ఎన్నికల అధికారి కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ.పి.ఎన్.జ.జి.ఓస్ అనకాపల్లి జిల్లా అడక్ కమిటీ చైర్మన్ అయిన వేల సూర్యనారాయణ ఎన్నికల నోటిఫికేషన్ ను నవంబర్ 18వ తేదీన విడుదల చేయడమైనది. ఈ ఎలక్షన్ నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికల అధికారిగా కె శ్రీనివాస్ నక్కపల్లి తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ గారిని నియమించారు.ఎన్నికల అధికారి ఎలక్షన్ షెడ్యూల్ ను నవంబర్ 20వ తేదీన జారీ చేయడమైనది.ఈ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం తేదీ ఈ నెల 19న న సబ్బవరం ఏపీ ఎన్జీవోస్ తాలిక యూనిట్ సంఘమునకు ఎన్నికలు జరపబడునని తెలిపారు.ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఈనెల 12వ తేదీ న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడును. అదే రోజు నామినేషన్లు పరిశీలన మరియు ఆమోదించబడిన నామినేషన్లను నిర్ణయించబడునని తెలిపారు. సభ్యత్వం చల్లించని సభ్యులు నేరుగా ఎన్నికల అధికారి వారికి చెల్లించి నమోదు చేయించుకోవలసినదిగా కోరడమైనది.సబ్బవరం తాలూకా యూనిట్ సబ్బవరం,పరవాడ మండలాలు పరిధిలోగల పనిచేయుచున్న ఉద్యోగులందరూ ఈ ప్రక్రియలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఎన్నికల అధికారి కోరారు.

### అరకులోయ నియోజకవర్గకోటి సంతకాల పత్రాలను

# జిల్లా వైసిపి కార్యాలయానికి..

### - పంపిన అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



**అరకులోయ, డిసెంబర్ 10 (మనసులో మాట ):** అరకులోయ నియోజకవర్గం ఆరు మండలాలకు చెందిన 53,000 మంది పైచిలుకు ప్రజలు ప్రభుత్వ వైద్య విద్య కళాశాల ప్రైవేటుకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా అరకులోయ నియోజకవర్గం, అరకులోయ మండల కేంద్ర పరిధిలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా అరకులోయ నియోజకవర్గంలో సేకరించినటు వంటి 53 వేల పైచిలుకు సంతకాల పత్రాలను అరకులోయ పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్,జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర,అరకులోయ నియోజకవర్గ పరిశీలకులు ఏటివాక సత్యారావు,మాజీ పాడేరు ఎమ్మెల్యే కొట్ట గుల్లి భాగ్యలక్ష్మితోకలిసిఅరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మీడియా ముందు ప్రదర్శించివారి సమక్షంలోనే బాక్సుల్లో సర్ది వాహనంలో పెట్టి నాయకులతో కలిసి జండా ఊపి వైసీపీ జిల్లా కార్యాలయానికి పంపించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ వైసిపి పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రేణులతో కలిసి స్వచ్ఛందంగా ప్రజల వద్ద నుండి సేకరించినటువంటి పత్రాలను టాటా ఏసీ ఆటోలో పెట్టి పార్టీ జిల్లా కార్యాలయానికి పంపడం జరిగిందన్నారు.17న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డిగవర్నర్ ను కలిసి కోటి సంతకాలు ప్రతులను అందిస్తారనిఅన్నారు. అరకులోయ నియోజకవర్గం లో దాదాపుగా 53 వేల పైచిలుకు ప్రజలు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటుకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టంగా తెలుపారని అన్నారు. పేదలకు వైద్య విద్యను అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 17 కాలేజీలను నిర్మించడానికి తలపెడితేఈ కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను దూరం చేస్తుందని తప్పు పట్టారు.ఈనెల 15వ తారీఖున పాడేరు జిల్లా కేంద్రంలో ర్యాలీలో అరకు నియోజకవర్గ శ్రేణులు పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు.జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా తక్షణమేఉపసంహరించుకోవాలని ఆమెడిమాండ్ చేశారు.అరకులోయ పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూపేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడంతో పాటు,పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు జగన్ గారి పాలనలో రూ.8 వేల కోట్లతో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టి రూ.3 వేల కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు.వైసీపీ హయాంలోనే ఏడు మెడికల్ కళాశాలల పూర్తి చేసి ఐదింట్లో తరగతులు ప్రారంభించారని,మిగిలిన కళాశాలలు నిర్మాణంలో ఉన్నాయన్నారు.చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 10 మెడికల్ కళాశాలలను తన వాళ్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.ఈకార్యక్రమంలోవైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, అరకులోయ మండలం జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి,ఎస్టి సెల్ రాష్ట్ర కార్యదర్శి పాంగి చిన్నారావు,జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు, అనంతగిరి మండలం ఎంపీపీ శెట్టి నీలవేణి, వైసీపీ అరకు నియోజకవర్గం బూత్ కమిటీ ఇన్చార్జ్ విజయ్,ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమ్మిడి అశోక్, వైసీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిరి రవి ప్రసాద్, వైసీపీ అనంతగిరి, అరకు లోయ,డుంబ్రిగూడ, హుకుంపేట, డుంబ్రిగూడ, ముంచంగి పుట్టు, మండల పార్టీ అధ్యక్షులు కొర్ర సూర్యనారాయణ ,స్వాభీ రామ్మూర్తి ,పాంగి పరశురాం ,పాంగి అనిల్ ,పాంగి పద్మారావు,విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ భూషణ్, వైసిపి అరకు నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు సందడి కొండబాబు,వైసిపి అరకులోయ నియోజకవర్గం అంగన్వాడి విభాగ అధ్యక్షురాలు పాడి కవిత, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న ,శెట్టి ఆనంద్,డుంబ్రిగూడ మండలం సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కిముడు హరి,సర్పంచులు పెట్టెలి సుస్మిత ,వంతల వెంకట్రావు , గుమ్మ నాగేష్ ,ఓరబోయిన సుబ్బారావు ,సమ్మిడి వెంకట పూర్ణిమ,అనంతగిరి మండలం సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పాగి అప్పారావు,ఎంపిటిసిలు స్వాభీ రామచందర్, దురియ ఆనంద్ కుమార్,శత్రుగును ,రాందాస్ ,తుమ్మాద్ ,కూడా పాపారావు ,సింహాచలం ,గంజాయి సుశీల,అరకులోయ మండలం సూపర్ ఎంపీపీ నరసింహమూర్తి,వైసీపీ సుంకరమెట్ట గ్రామపంచాయతీ అధ్యక్షుడు కొర్ర అర్జున్ రావు, వైసీపీ అరకులోయ మండలం ఉపాధ్యక్షులు పల్టా సింగి విజయ్ కుమార్ ,గుడివాడ,వైసీపీ అరకులోయ మండలం బూత్ కమిటీ ఇన్చార్జ్ బోయి కిరణ్ కుమార్,వార్డు సభ్యులు శివ, వైసీపీ నాయకులునగేష్ ,మఠం శంకర్ ,మోహన్, ప్రసాద్,విజయ్ దసమి,అర్జున్, సుమారుగా 300 మంది కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలి



**ఎస్. రాయవరం, డిశంబర్ 10,(మనసులో మాట):** ఒకటి నుండి మూడవ తరగతి చదివే విద్యార్థులం దరికి చదవడం, వ్రాయడం, లెక్కలు చెయడం విధిగా రావాలని మండల విద్యాశాఖాధికారి కె. శ్రీరామూర్తి సూచించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఎస్ రాయవరం మండలంలో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంఇ ఓ శ్రీరామమూర్తి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్యారెంటెడ్ ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసి 75 రోజుల కార్యాచరణ ప్రణాళికను పగడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఒకటి నుండి మూడవ తరగతి వరకు విద్యార్థులు చదవడం, రాయడం, లెక్కలు చేయడం తప్పని సరిగా రావాలన్నారు. 75 రోజుల కార్యాచరణ ప్రణాళిక పూర్తయ్యలోపు క్రింది స్థాయిలో ఉన్న విద్యార్థులు అన్ని సామర్థ్యాలలో ప్రావీణ్యత సాధించాలని ఆ దిశగా ఉపాధ్యాయులందరూ పనిచేయాలని సూచించారు.

### ఘనంగా డివిఎన్ కళాశాల లో

## ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ముగింపు వేడుకలు




**అనకాపల్లి, డిసెంబర్ 10 (మనసులో మాట):** అనకాపల్లి దాడి వీరునాయుడు (డివిఎన్) కళాశాల లో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శత దినోత్సవ వేడుకలలో భాగంగా అనకాపల్లి దాడి వీరునాయుడు కళాశాలలో మొట్టమొదటిసారిగా మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు ప్రొఫెసర్ ఎం. శశి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ కోర్సు లలో నైపుణ్యం సంపాదించి విద్యార్థులకు శిక్షణ అందించి మేటి విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ నూతన విద్యా విధానంలో సబ్జెక్టుల వారీగా ప్రత్యేక విభాగాలు అంటూ ఏమీ ఉండవని, ప్రతి ఒక్కరు అన్ని రకాల కోర్సుల పై అవగాహన కలిగి ఏ అంశాన్ని అయినా బోధించే విధంగా ఉండాలన్నారు. దాని కోసమే ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి ఈ రూరల్ జిల్లాలోని విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల అధ్యాపకులకు అధునాతన అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కుళపతి ప్రొఫెసర్ జి.పి రాజశేఖర్, ప్రొఫెసర్లు డి లలిత భాస్కరి, ప్రొఫెసర్ ఎం.శశి, వివిధ స్పీకర్లు డాక్టర్ కే.సుజాత, మళ్ల బాబు కిరణ్, బి. రామకృష్ణ, కే. హరి వెంకట రాజేష్, డాక్టర్ ఎస్. రమణ కుమార్, జోగ తదితర అధ్యాపకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ అంశాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ సహకారంతో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ తమకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని, కొత్త కొత్త విషయాలు నేర్చుకోవడం జరిగిందన్నారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు నేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేస్తామన్నారు. అనంతరం శిక్షణ కార్యక్రమంకు హజరైన అధ్యాపకులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయం సరికాదు

### - నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



**సర్సీపట్నం ,డిసెంబర్ 10 మనసులో మాట)..** మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయం సరికాదని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉ మాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నర్సీపట్నం నియోజకవర్గంలో చేపట్టిన కోటి సంతకాల ప్రజాఉద్యమ కార్యక్రమంకు సంబంధించిన సంతకాలను బుధవారం ప్రత్యేక వాహనాల్లో జెండా ఊపి జిల్లా పార్టీ ప్రధాన కార్యాలయానికి పంపించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తీవ్రంగా నిరసిస్తూ సర్సీపట్నంలో ఈ ఉ ద్యమాన్ని చేపట్టామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 61 మంది తమ మద్దతు ఇచ్చారని చెప్పారు. గత వైసిపి హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేయదానికి పూనుకుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, చిక్కాల రామారావు, వైసీపీ ఎంపిపిలు, కౌన్సిలర్లు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### సర్పంచ్ జయమ్మ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో

## విద్యార్థులు పరిశుభ్రత


**వి.మాడుగుల డిసెంబర్ 10 (మనసులో మాట)..** ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సాగరం కాలనీలో జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవ శిబిరము 5వ రోజు కార్యక్రమంలో భాగంగా సాగరం కాలనీ వీధులన్నీ వాలంటీర్లు పరిశుభ్రం చేసి బ్లీచింగ్ జల్లారు. ఈ కార్యక్రమానికి సాగరం కాలనీ సర్పంచ్ జయమ్మ సన్యాసినాయుడు మరియు ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం రామ్ కుమార్ నేతృత్వం వహించారు. అనంతరం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక విలేఖరి కొండల రావు విద్యార్థులను యువతను ఉద్దేశించి మానవ హక్కుల ప్రాధాన్యాన్ని విశదీకరించారు.

## రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏటీడబ్ల్యుఓ క్రాంతికుమార్



**కొయ్యూరు డిసెంబర్ 10 (మనసులో మాట):** కొయ్యూరు మండలంలోని రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను ఏటీడబ్ల్యుఓ క్రాంతి కుమార్ బుధవారం పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న వసతులు, హాస్టల్ శుభ్రత, ఆహార నాణ్యత, స్టాక్ రూమ్, నీటి సౌకర్యాలు వంటి అంశాలను ఆయన పరిశీలించారు.తరగతి గదులను ప్రత్యక్షంగా తనిఖీ చేస్తూ బోధన పద్ధతులు, హాజరు, చదువు ప్రమాణాలపై ఉపాధ్యాయులతో చర్చించారు.ఆహారశాల పరిశుభ్రత, నిల్వ విధానం, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని క్రాంతి కుమార్ సిబ్బందికి సూచించారు. ఎక్కడైనా చిన్న లోపాలు ఉన్నా వెంటనే సరిచేయాలని ఆదేశించారు.విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

## స్క్రాబ్ టైఫాస్ పై ఎంపీడీవో ఆఫీసులో అవగాహన



**వి మాడుగుల డిసెంబర్ 10 (మనసులో మాట)..** స్క్రబ్ టైపస్ అనే వ్యాధి పట్ల మండలంలో ప్రతి ఒక్కరు అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని మాడుగుల ఎంపీడీవో కే అప్పారావు పేర్కొన్నారు, ఈ వ్యాధిపై బుధవారం మండలంలో ఉన్న వైద్యాధికారులు ఇతర శాఖల చెందిన అధికారులు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించాలని ప్రతి ఒక్కరు జాగ్రత్త తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ వ్యాధి పొలాల్లోనూ తుప్పల్లోనూ ఉన్న చిన్న క్రిమి వల్ల వస్తుందని ఆది సోకిన వారికి ఒంటిమీద దద్దుర్లు శరీరం నొప్పులు వాటి లక్షణాలు కలుగుతాయని వ్యాధి వచ్చినట్లు అనుమానం వ్యక్తులు అధికారులకు వెంటనే తెలియజేసి తగిన వైద్యం చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఈ వ్యాధితోఒకరు మృతి చెందడం జరిగిందని వారు పేర్కొన్నారు.

## నర్సయ్య పేటలో ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం





**చోడవరం, డిసెంబర్ 10(మనసులో మాట ):** మండలంలోని నర్సయ్య పేట పంచాయతీలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఒకటవ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా శిబిరం బుధవారం ముగిసింది. గ్రామ సర్పంచ్ ఉగ్గిన నాగబాబు గౌరీశంకరి అధ్యక్షతన జరిగిన ముగింపు సభకు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ , రిటైర్డ్ లెక్చరర్ ఎన్.దేవుడు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సేవా కార్యక్రమాల విశిష్టత తెలిపారు. విద్యార్థులు పంచాయతీ ఖాళీ స్థలం లో మొక్కలు నాటారు. విద్యార్థులుకు బహుమతులు అందజేశారు కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పి.ఓ డి.మాల్యాద్రి, నారాయణ మూర్తి ,మల్లిబాబు, రవికుమార్, యు.విశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**అంకుపాలెం లో.....** మండల సమీపంలోని అంకుపాలెం గ్రామంలో ఎన్ఎస్ఎస్ రెండవ యూనిట్ ఆధ్వర్యంలో సేవా శిబిరం కొనసాగుతుంది. విద్యార్థులకు బుధవారం జీఎస్ టి అవగాహన సదస్సు నిర్వహించారు .28 మంది విద్యార్థినులు 22 మంది విద్యార్థులు పాల్గొన్న శిబిరంలో వివిధ రకాల అంటు వ్యాధులు గురించి ఏఎన్ఎం అప్పలనర్సమ్మ అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పివోలు బి.పిచ్చమ్మ, రత్న భారతి ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో వి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### మునగపాక మండలాన్ని అనకాపల్లిలో కొనసాగించాలని

## మూడో రోజు రిలే నిరాహార దీక్షలు

### దీక్షలో పాల్గొన్న నాగవరం, మల్లవరం, గొల్లల పాలెం, వాడ్రాపల్లి వైసిపి నేతలు




**మునగపాక, డిసెంబర్ 10, మనసులో మాట..** మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని నిరసన వ్యక్తం చేస్తూ నాగవరం, మల్లవరం, గొల్లల పాలెం, వాడ్రా పల్లి వైసీపీ నేతలు మూడో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. వీరికి సంఘీభావంగా వివిధ గ్రామాల నుంచి వైసీపీ పార్టీ శ్రేణులు తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. దీక్షలో కూర్చున్న వారిలో మల్ల కన్నుమనాయుడు, చీర రమణమ్మ, చీర జోగినాయుడు, మల్లవరం సర్పంచ్, కరణం పార్వతి, పిట్ట మంగరెడ్డి, ఆడారి కాశిబాబు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



### 2010కు ముందు నియమితులకు
# టెట్ మినహాయింపు ఇవ్వాలి
### - యుటిఎఫ్ నిరసన

**అచ్చుతాపురం డిసెంబర్ 10 మనసులో మాట:** 2010కు ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని కోరుతూ అచ్యుతాపురం మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.రవి కూమార్ మాట్లాడుతూ టెట్ పై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. అనంతరం తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మారి శెట్టి వెంకట అప్పారావు,మహిమా రావు, గణేష్,సలీం, కొండబాబు, అరుణ సత్య నారాయణ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సాధన సమితి ప్రతినిధులు



**యలమంచిలి డిసెంబర్ 10 మనసులో మాట..** పట్నంలోని జిల్లా పరిషత్ అతిధి భవనంలో ప్రతి బుధవారం జరిగే జన వాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ని కలిసి యలమంచిలి కేంద్రంగా కొత్త రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ యలమంచిలి రెవెన్యూ డివిజన్ సాధన సమితి ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సి.హెచ్ సోమేశ్వరరావు, ఎక్స్ పి.ఏ.సి.ఎస్ చైర్మన్ మల్ల కొండబాబు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆడారి పూరి జగన్నాథం, పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, బిజెపి పార్టీ నాయకులు నక్క శివ శంకర్, ఎల్లపు రాజు, బీసెట్టి లక్ష్మణరావు, జి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ మహాసభల విజయవంతానికై విరాళ సేకరణ



**నర్సీపట్నం ,డిసెంబర్ 10 (మనసులో మాట)..** నర్సీపట్నం ఇందిరా మార్కెట్ ముఠా కార్మిక సంఘం(సీఐటీయూ) ఇందిరా మార్కెట్,పాత బస్టాండ్, సరస్వతి ప్రెస్ రోడ్డులోని షాపులు, ఆటో కార్మికులను కలిసి సీఐటీయూ అఖిల భరత మహాసభలు జయప్రదంకు విరాళాలు సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ కార్మికులు పక్షాన నిరంతరం పోరాడుతున్నా సీఐటీయు జాతీయ మహాసభలు మొదటి సరిగా విశాఖపట్నంలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు అన్ని రాష్ట్రాలండి, విదేశాలుండి 2000 మంది కార్మిక ప్రతినిధులు వచ్చి కార్మికులు ఎదుర్కొనే సమస్యలను చర్చించి భవిష్యత్ పోరాటాలను రూపొందిస్తారన్నారు. జనవరి 4 ఆదివారం ఆర్కే భీచ్లో 2లక్షల మందితో బహిరంగ సభ, డిసెంబర్ 27వ తేదీ నుండి జనవరి 7వ తేదీ వరకు కల్చరల్ ప్రోగ్రాం జరుగుతాయన్నారు. సినీనటులు ప్రకాష్ రాజ్, కమలహసన్, గాయకులు గోరేటి యాంకన్నా, సుద్దాల అశోక్ తేజ, మంగ్లీ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. కావున కార్మికులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.శివ, ముఠా నాయకులురాము, శేషు, తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ చొరవతో సి. సి రోడ్డు మంజూరు



**జిమాడుగు (మనసులో మాట) డిసెంబర్ 10..** జిమాడుగు మండలంలో గల సోలాభం పంచాయతీ, వంజంగి పాడు గ్రామం లో పీసా ఉపాధ్యక్షులు లకే రామకృష్ణ చొరవతో సి. సి రోడ్డు మంజూరు చేయటం జరిగింది. 20, లక్షలు రూపాయలు వర్క్ ఓపినింగ్ ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులు సోలాభం పంచాయతీ సర్పంచ్ ఐసరం హనుమంతరావు, మాజీ ఎంపీపీ గంగరాజు(బుజ్జి ) టీడీపీ సీనియర్ నాయకులు మత్స్య రాస రామరాజు, పంచాయతీ రాజ్ (జె. ఇ)మాణిక్యం పంచాయతీ ఇంజినీర్ శాఖ గోపాల్, గోవర్ధన్ టీడీపీ నాయకులు మాధుల బాలకృష్ణ, వంజంగి పాడు గ్రామ పెద్ద లకే అబ్బాయి దొర, మంగళి దొర, తెల్లన్న దొర రాజాం దొర రామలింగం, మత్యకొండ బాబు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీరాజ్
# రోడ్ల అభివృద్ధి కోసం 15 కోట్లు
### - ఎమ్మెల్యే సుందరపు



**యలమంచిలి డిసెంబర్ 10 మనసులో మాట..** యలమంచిలి నియోజకవర్గం లో పాడైపోయిన పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ 15.26 కోట్లు నిధులు మంజూరు చేశారని చెప్తూ ఈ సందర్భంగా మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గురువారం నాడు జనవాణి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ మొదటిగా పంచాయతీ రోడ్లు తీవ్రంగా దెబ్బ తిన్న ఏటికొప్పాక, నాగవరం రోడ్డుకు ఈ నిధులు కేటాయించడం జరుగుతుందని, ఇప్పటికే రాజకోడూరు, అప్పారాయుడుపాలెం, పనులు పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇవి కాకుండా పంచాయతీ రాజ్ బిటి రోడ్లు నిర్మాణానికి 25 నుండి 30 కోట్లు సాంక్షన్ కానుంది అన్నారు. అనంతరం జనవానిలో లబ్ధిదారుల నుండి అభ్యర్థనలు స్వీకరించారు. యలమంచిలి రెవెన్యూ డివిజన్ కావాలని సాధన సమితి సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బొద్దపు శ్రీను, ఊటకూటి రమేష్, కొటారి శ్రీను, లవుడు లోవరాజు, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గోపీనాథ్, రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు మల్ల కొండ బాబు, సిహెచ్ సోమేశ్వరరావు, ఆడారి పూరి జగన్నాథం, నక్క శివశంకర్, రాజు పాల్గొన్నారు.

### అనకాపల్లి నియోజకవర్గ
# గ్రామీణ రహదారులకు మహర్దశ
### అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కృషితో రోడ్లు అభివృద్ధి కి 16 కోట్లు నిధులు మంజూరు



**అనకాపల్లి, డిసెంబర్ 10 (మనసులో మాట):** అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కృషి తో నియోజకవర్గం లోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టినట్టయ్యింది. అనకాపల్లి, కశింకోట మండలాల రహదారుల అభివృద్ధి కి మాజీ మంత్రి,అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రతిపాదనలతో 16 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అనకాపల్లి, కసింకోట మండలాల రోడ్లకు జీవో నెంబర్ 970 ద్వారా నిధులు కేటాయింపులు జరిగాయి. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్, రూరల్ రోడ్డు స్ట్రెన్తెనింగ్ లో భాగంగా కసింకోట మండలం ఎన్ హెచ్ 16 నుంచి పడమటమ్మ లోవ వయా విస్సన్నపేట రోడ్డుకు 13 లక్షలు రూపాయలు, గోకువానిపాలెం అప్రోచ్ రోడ్డుకు 78 లక్షలు రూపాయలు, నర్సీపట్నం రోడ్డు నుంచి అచ్చర్ల రహదారి కి రెండు కోట్ల నాలుగు లక్షలు రూపాయలు, ఆర్ఇసిఎస్ రోడ్డు నుంచి కచ్చర్లపాలెం రోడ్డుకు 2 కోట్ల 9 లక్షలు రూపాయలు, తీడా నుంచి అచ్చర్ల రోడ్డు కు 2 కోట్ల నలభై ఒక లక్ష రూపాయలు, ఎన్ హెచ్ 16 రోడ్డు నుంచి ఉగ్గినపాలెం రోడ్డు కు 47 లక్షలు రూపాయలు, మోసయ్యపేట నుంచి అచ్చర్ల జంక్షన్ రోడ్డు కు 94 లక్షలు రూపాయలు మంజూరు అయ్యాయి. అలాగే అనకాపల్లి మండలం వెంకుపాలెం అప్రోచ్ రోడ్డు కోటి మూడు లక్షలు రూపాయలు, కుంద్రాం నుంచి ఆర్ భీమవరం రోడ్డు కు కోటి పద్నాలుగు లక్షలు రూపాయలు, కేబి రోడ్డు నుంచి మొండిపాలెం రోడ్డు కు కోటీ ఒక లక్ష రూపాయలు, కేబీ రోడ్డు నుంచి తమ్మయ్యపేట 23 లక్షలు రూపాయలు, చిన్నసంపతపురం నుంచి తమ్మయ్యపేట రోడ్డు కు తొంబై మూడు లక్షలు రూపాయలు, దిబ్బపాలెం రోడ్డు నుంచి బవులువాడ కు 75 లక్షలు రూపాయలు, కేబి రోడ్ నుంచి వేటజంగాలపాలెం 13 లక్షలు రూపాయలు, జగన్నాధపురం నుంచి సాకిపల్లి రోడ్డు కు కోటి 97 లక్షలు నిధులు కేటాయించడం జరిగిందని స్థానిక విలేకరుల సమావేశం లో తుమ్మపాల ఎంపీటీసీ, జనసేనపార్టీ నాయకులు చదరం నాగేశ్వరరావు, అనకాపల్లి మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), మండల జనసేన పార్టీ నాయకులు గంగుపాము జగదీష్ , సిహెచ్ఎన్ అగ్రహారం కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బంటు రవి, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ కర్రీ సత్యనారాయణ, కశింకోట మండల టిడిపి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, కసింకోట పిఎసిఎస్ చైర్మన్ సిగిరెట్టి శ్రీను తదితరులు వెల్లడించారు. కాగా అనకాపల్లి, కశింకోట మండలాలో రహదారులకు 16 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు కూటమి ప్రభుత్వానికి, ప్రధాన రహదారుల అభివృద్ధి కి అత్యదిక నిదులకు కృషి చేసిన అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కు వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ దాడి నాగరాజు, బిజెపి ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, కుంద్రం, మామిడిపాలెం సర్పంచులు పూడి పదేశి నాయుడు, నందవరపు సూరిబాబు, మడక ఆది లక్ష్మీనారాయణ, కుటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఉత్పత్తులపై ప్రాణాలిక రూపొందించాలి

- ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో పండే దేశవాలి పసుపు పంటకు మంచి గిరాకీ
- గిరిజన ఉత్పత్తులపై ఎప్ పి ఓస్ కు ప్రతి నెల వర్క్ షాప్ నిర్వహించాలి
- పాడేరు డివిజన్ ఎఫ్ పి ఓస్ తో సమీక్షా - జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



**పాడేరు డిసెంబర్ 10 (మనసులో మాట):** పాడేరు ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో పండే పంటకు ప్రణాళిక రూపొందించాలని, గిరిజన ఉత్పత్తులలో పోషకాలతో పాటు వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజర్ (ఎఫ్ పిఒ)లతో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నా జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్. ఏజెన్సీ గిరిజన ప్రాంతం అయినా అరకు కాఫీ పంటకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ఉందని, అలాగే మిరియాలు, పసుపు పంటకు కూడా మంచి పేరుందని తెలిపారు. ప్రతినెల ఎఫ్ పి ఓస్ లకు ఆ య ప్రాంతంలో పండే పంటలపై శిక్షణలు డివిజనల్ వారీగా ఇచ్చే విధంగా చూడాలని, ఉత్పత్తులపై సరైన అవగాహన కల్పించి, ఆదర్శ రైతులకు వీలైనంత ఎక్కువ మంది గ్రూపులలో సభ్యులను చేర్చుకొని రైతులు పండించే పంటను ఎఫ్ పి ఓస్ లే కొనుగోలు చేయాలన్నారు. రైతులు దళారుల అమ్మడం వల్ల నష్టపోతున్నారన్నారు. రైతుల పండించిన పంటలను దలారులకు ఇవ్వకుండా ఎఫ్ పి ఓస్ ద్వారా రైతులకు తెలియజేయాలన్నారు. ఏ ప్రాంతంలో ఏ పంటలు ఉత్పత్తి ఎక్కువగా అవుతుందో వాటికి తగినట్లుగా రైతులకు వాటి ధరలపై తెలియజేయాలన్నారు. కాఫీ , మిరియాలు కు గ్రేడింగ్ ప్రాసెసింగ్ యూనిట్లో లాగే పసుపు ప్రాసెసింగ్ యూనిట్లను కూడా ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలని, ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించిన సబ్సిడీలు పై రైతులకు వివరించాలని తెలిపారు. రైతులకు కావలసిన పనిముట్లు ప్రోసెసింగ్ యూనిట్ల కు సంబంధించిన వాటిపై బ్యాంకు రుణాల ద్వారా రుణాలు అందే విధంగా చూడాలన్నారు. పసుపు గ్రేడింగ్, ప్రాసెసింగ్ చేసి విక్రయించినట్లయితే మంచి లాభాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఏఏ డివిజన్లో ఎన్ని ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయో వాటిపై సమగ్ర నివేదికను వాటిపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి కె బాల కర్ణ, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి రాజేష్, సతీష్, పాడేరు డివిజనల్ ఎఫ్ పి ఓస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ అఖిల భారత మహాసభలు జయప్రదం కై విరాళాలు సేకరణ



**అచ్చుతాపురం డిసెంబర్ 10 మనసులో మాట:** మండల కేంద్రం లో సీఐటీయూ అఖిల భారత మహాసభలు జయప్రదం కు విరాళాలు సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, జి. కోటేశ్వరరావు జిల్లా కార్యదర్శి రొంగలి రాము మాట్లాడుతూ కార్మికులు పక్షాన నిరంతరం పోరాడుతున్నా సిఐటియు జాతీయ మహాసభలు మొదటి సరిగా విశాఖ పట్నంలో జరుగుతున్నవి. ఈ మహాసభల కు అన్ని రాష్టాలుండి, విదేశాలుండి 1500 మంది కార్మిక ప్రతినిధులు వస్తారు. కార్మికులు ఎదుర్కొనే సమస్యల ను చర్చించి భవిష్యత్తు పోరాటాలను రూపొందిస్తారు. జనవరి 4 ఆదివారం RK బీచ్ లో లక్షమందితో బహిరంగ సభ, డిసెంబర్ 27నుండి జనవరి 7వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరంగుతాయి ని నివహా నటులు,ప్రకాష్ రాజ్, కమలహసన్,గాయకలు గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, మంగ్లీ వెంకన్నతదితరులు హాజరు కానున్నారు. కావున కార్మికులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కొంద్రపు సోమ నాయుడు, ఐద్వా నాయకులు లక్ష్మి, అంగన్వాడి యూనియన్ నాయకులు వరలక్ష్మి,నారాయణమ్మ, రాజ్యలక్ష్మి జి.నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలకు పాదయాత్రతో 10వసారి వెళ్తున్న సూర్యారావును సన్మానించిన ఈశ్వరరావు

- చినదొడ్డుగల్లు లో పదవ సారి తిరుమల కు పాదయాత్ర చేస్తున్న సూర్యనారాయణ కు సత్కారం
- అనకాపల్లి నుంచి తిరుమల కు పాదయాత్ర గా బయలుదేరిన గోవిందస్వాములకు వైస్ ఎంపీపీ ఎంపిపి ఈశ్వరరావు ఆతిధ్యం

**నక్కపల్లి, డిసెంబర్ 10 ( మనసు లో మాట):** అనకాపల్లి నుంచి తిరుమల తిరుపతికి పాదయాత్ర గా బయలుదేరిన గోవిందస్వాములకు నక్కపల్లి లో కాగిత గ్రామానికి చెందిన పోతంశెట్టి బాబ్జి ఆతిథ్యాన్ని ఇచ్చారు. అనంతరం చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు దంపతుల నివాసంలో సద్ది స్వీకరించారు. ఈ సందర్భంగా పదవ సారి పాదయాత్ర తో తిరుమల కోనేటిరాయుని దర్శించు కోవడానికి వెళ్తున్న (71) సంవత్సరాల పిల్లి సూర్యనారాయణ ను కుటుంబ సమేతంగా శాలువాతో సత్కరించి తాంబూలం అందజేసి వారి ఆశీస్సులు పొందారు. అదేవిధంగా మరో 9మంది గోవిందలకు తాంబూలాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ పాదయాత్ర తో ఎవరు వెళు న్నా వారికి తన శక్తి మేరకు ఆతిధ్యం ఇవ్వడం అలవాటన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద స్వామి లు దాడినాయుడు, ఎల్లపు వెంకట రమణాజీ, వేగి కోటేశ్వరరావు, వేగి సూర్యనారాయణ, మల్ల త్రినాథ్, బుద్ధ సత్యనారాయణ, భీశెట్టి జగదీష్, నవీన్, హేమంత్, బాబ్జి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### సిఐటియు మహాసభల విజయవంతం కు
# విస్తృత ప్రచారం



**అనకాపల్లి, డిసెంబర్ 5 (మనసు లో మాట):** విశాఖపట్నం లో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం అనకాపల్లి పట్టణం లో సిఐటియు అనకాపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించడం తోపాటు విరాళాలను సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.వి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ లు మాట్లాడారు విశాఖపట్నం లో మొట్టమొదటిసారిగా జరుగుతున్న అఖిలభారత మహాసభలు జయప్రదానికై అనకాపల్లి ప్రాంతంలోని కార్మిక వర్గం ఎంతో కృషి చేస్తుందన్నారు. దీనిలో భాగంగానే పట్టణంలో ఇంటింటికి , షాపు లకు వెళ్ళి మహాసభల నినాదాలు తీసుకువెళ్లడం తోపాటు విరాళాలను కూడా సేకరించడం జరుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గాన్ని ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు దుష్ట విధానాలపై అకుంఠిత దీక్షతో పోరాటాలు నిర్వహిస్తున్న సిఐటియుని ప్రజలు, చిరు వ్యాపారులు ఆదరిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో కార్మికుల పోరాటాలను విస్తృతపరచడంతో పాటు వారికి అండగా సిఐటియు నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి మండల కన్వీనర్ కాళ్ల తాళ్లయ్యబాబు, వి. ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, గండి నాయన బాబు, బీశెట్టి అప్పారావు, బోడి రాజు, కనకాల అప్పలరాజు, కాపుశెట్టి అప్పారావు, పెద్ద కార్మిక ముఠా జట్టు, పార్సిల్ ముఠా కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

### ఈనెల 13న
## గణపర్తి శ్రీ గౌరీ పరమేశ్వరుల మహొత్సవం
### ఉత్సవం శాంతియుతంగా నిర్వహించాలని పోలీసులు హెచ్చరిక



**మునగపాక, డిసెంబర్ 10, మనసులో మాట..** మండలంలో గల గణపర్తి శ్రీ గౌరీపరమేశ్వరలమహొత్సవం ఈనెల 13న శనివారంజరుపుటకు ఉత్సవ కమిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా10/12/25ది న ఉదయం 11గం కు ఎలమంచిలి సీఐ ధనుంజయ రెడ్డి మరియు ఎస్సై ప్రసాద్ రావు సమావేశం ఏర్పాటు చేసి ఎటువంటి అల్లరులు,గొడవలు లేకుండా ప్రశాంతముగా జరగాలని సూచించారు. ఎవరు అసభ్యంగా గానిఘర్షణ వాతావరణం కలుగజేసిన వారి పై కఠినమైన చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ చదరం వెంకట్ సూర్య గణేష్ నాయుడు, కర్రి రామ నాగేశ్వరరావు, చదరం అప్పలనాయుడు, కాళ్ల చంద్రమోహన్, ఆడారి గోపి, చదరం సత్తిబాబు, కాంద్రేగులకొండలరావు, పిట్టా అప్పారావు, గొంది రవి, భీంపల్లి గంగాశంకర్,కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు హాజరైనారు.



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు




## 'తూర్పు' గ్రామీణ రహదారులకు
# మహర్దశ

- ▸▸ జిల్లాలో రూ.72.39 కోట్లతో 125 కి.మీ.ల గ్రామీణ రహదారులకు కొత్త రూపం
- ▸▸ పల్లె ప్రగతికి కూటమి బాటలు ▸▸ మంత్రి కందుల దుర్గేష్
- ▸▸ నిడదవోలు నియోజకవర్గంలో 21 రహదారి మరమ్మతులు, నిర్మాణ పనులకు గానూ రూ.28.89 కోట్ల పరిపాలన అనుమతులు జారీ
- ▸▸ త్వరలోనే నూతన రోడ్లపై సురక్షిత ప్రయాణం చేయవచ్చని వెల్లడి
- ▸▸ అభివృద్ధికి పర్యాయపదంగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్న మంత్రి దుర్గేష్

**తూర్పు గోదావరి (మనసులో మాట), డిసెంబరు 10:** పంచాయతీ రాజ్, గ్రామీణాభివ ృద్ధి శాఖల ద్వారా ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంతింగ్ ప్రాజెక్టు (ఏపీఆర్ఎస్పీ) తొలి దశ క్రింద నిడదవోలు నియోజకవర్గంలో 21 రహదారి మరమ్మతులు, నిర్మాణ పనులకు గానూ రూ.28.89 కోట్ల ప్రత్యేక పీఆర్ఆర్ (ప్లాన్) నిధులను కేటాయిస్తూ వెంటనే పనులు ప్రారంభమయ్యేలా కూటమి ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేయడంపై మంత్రి కందుల దుర్గేష్ ఆనందం వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఉండ్రాజవరం మండలంలో 9 పనులకు రూ.15.56 కోట్లు, పెరవలి మండలంలో 5 పనులకు గానూ 8.71 కోట్లు, నిడదవోలు మండలంలో 7 పనులకు గానూ రూ.4.62 కోట్లు కేటాయించిందని ఒక ప్రకటనలో మంత్రి దుర్గేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో రూ.72.39 కోట్లతో 125 కి.మీ.ల గ్రామీణ రహదారులకు మహర్ధశ రానుందని అన్నారు. మెరుగైన నాణ్యతతో రోడ్లు నిర్మించడం, మరమ్మతులు చేయడం తద్వారా రవాణా సౌకర్యాలను మెరుగుపర్చే ఉద్దేశంతో అభివ ృద్ధికి పర్యాయపదంగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. ప్రభుత్వ నిర?యంతో ఏపీ గ్రామీణ ప్రాంతాల రోడ్లు పట్టణ రోడ్లకు ధీటుగా నిర్మాణం జరుపుకోనున్నాయని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వెల్లడించారు. గడిచిన ఐదేళ్లలో నిడదవోలు నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులు పూర్తిగా అధ్వాన్నస్థితికి చేరుకుని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఆ పరిస్థితిని గమనించి ఆయా రోడ్ల అభివ ృద్ధికి మోక్షం కలిగించాలని మంత్రి కందుల దుర్గేష్ తొలి నుండి క ృతనిశ్చయంతో ఉన్నారు. తట్టెడు మట్టి కూడా వేయని గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో అడుగుకొక గుంత ఏర్పడి ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు వర?నాతీతం అన్నారు. ఈ క్రమంలో రోజూ వారీ ప్రయాణాలతో పాటు పంట ఉత్పత్తులు తరలించేందుకు రైతులు, ప్రజలు, వాహనదారులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితిని మార్చాలని నిర?యించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సంబంధిత అంశాన్ని మంత్రి దుర్గేష్ ప్రభుత్వం ద ృష్టికి తీసుకెళ్లారు. ప్రజల వినతి మేరకు నిడదవోలు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో దెబ్బతిన్న రహదారులు నిర్మించి ప్రజలకు సురక్షితమైన ప్రయాణానికి బాటలు వేయాలని కోరుతూ పదుల సంఖ్యలో ప్రభుత్వానికి ఇచ్చిన అన్ని ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు అంగీకరించి రోడ్లను మంజూరు చేయడంపై మంత్రి దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ క్రింద కొన్ని రహదారులు మరమ్మతులకు నోచుకున్నాయని, ప్రస్తుతం అధునాతన పరిజ్ఞానంతో నిర్మించే రోడ్లతో రహదారి వ్యవస్థ మరింత పటిష్టంగా కానుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట మాట ప్రకారం అందమైన రహదారులు నిర్మిస్తానని చెప్పిన మంత్రి కందుల దుర్గేష్ ఆ దిశగా ముందుకు సాగుతుండటంపై ప్రజల్లో సంత ృప్తి నెలకొంది. త్వరలోనే సరికొత్త రహదారులతో నియోజకవర్గం అభివ ృద్ధి పథంలో సాగడమే గాక పల్లెల్లో ప్రగతి వికసిస్తుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో
# ఆ సంఘటన దురదృష్టకరమే

- ▸▸ నన్ను తీవ్రంగా కలచివేసింది
- ▸▸ కూటమి ప్రభుత్వం వచ్చాక ఓపీ, గైనిక్ వార్డు కేసులు గణనీయంగా పెరిగాయి
- ▸▸ ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం పెంచగలిగాం
- ▸▸ మోరంపూడి ఫ్లైఓవర్, రోడ్ల సమస్యల పరిష్కారిస్తాం
- ▸▸ భరత్ విమర్శలు అర్థం లేనివి .. అందుకే విమర్శలు పట్టించుకోను
- ▸▸ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం తప్ప వేరే ధ్యాస లేదు
- ▸▸ రాజమండ్రిని ఆంధ్రప్రదేశ్ లో ఒక ఆదర్శ నగరంగా మార్చాలన్నదే నా ధ్యేయం
- ▸▸ ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన అనంతరం మీడియాతో ఎమ్మెల్యే వాసు





**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** కొన్ని రోజుల క్రితం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక గర్భిణీ ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం కారణంగా మరణించడం దురదృష్టకర సంఘటన అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఈ విషయం నన్ను ఎంతగానో కలచి వేసిందని, తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని అన్నారు. ప్రభుత్వాసుపత్రి గైనిక్ వార్డ్ ను ఎమ్మెల్యే వాసు బుధవారం ఉదయం సందర్శించి, రోగుల ఆరోగ్య పరిస్థితులపై విచారణ చేశారు. వైద్య సేవలు, సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే వాసు మీడియాతో మాట్లాడుతూ గర్భిణీ మరణించిన సంఘటన గురించి తెలియగానే, తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి, ఆ ప్రసూతి వార్డు పరిస్థితి, ఇలాంటివి ఎన్ని జరుగుతున్నాయి, ఎందుకు జరుగుతున్నాయి అనే వివరాలు తెలుసుకున్నానని తెలిపారు. కూటమి ప్రభుత్వం గెలిచినప్పటి నుండి ప్రజా ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ..'ఆరోగ్య రాజమండ్రి' నినాదంతో ముందుకు వెళ్తున్నామని ఇందులో భాగంగా, ఆసుపత్రి అభివృద్ధి కోసం చేస్తున్న పనుల గురించి ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియాలని మీడియా ద్వారా చెబుతున్నానని ఎమ్మెల్యే వాసు గుర్తుచేశారు. ఇప్పుడు ఆసుపత్రిని సందర్శించి, డాక్టర్లు ఇచ్చిన నివేదికలను పరిశీలించాక, రక్తస్రావంతో మరణించడం వంటి కేసులు చాలా అరుదుగా జరుగుతాయని చెప్పారని అన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న ఔట్-పేషెంట్ (ఓపీ) సంఖ్యతో పోలిస్తే, ప్రస్తుత ప్రభుత్వంలో ఎంతో వ్యత్యాసం ఉందని, సంఖ్య గణనీయంగా పెరిగిందని ఈ విషయాలను 2023, 2024, 2025 సంవత్సరాలలో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా గైనకాలజీ వార్డులో వచ్చి చూపించుకుంటున్న గర్భిణీల సంఖ్య కూడా విపరీతంగా పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇస్తున్న చికిత్స, అందిస్తున్న సేవల కారణంగా రాజమండ్రి ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం పెంచగలిగామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లను ట్రీట్ చేసే విధానాన్ని బట్టే సగం జబ్బు నయమవుతుందన్నారు. చికిత్స విషయంలో ఎలాంటి తేడాలు చేసినా, ఏ చిన్న అవకతవకలు జరిగినా, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయడంతో వారు కూడా అర్థం చేసుకున్నారని ఎమ్మెల్యే వాసు తెలిపారు. కేవలం ఈ సమస్యలపై విచారణతోనే ఆగిపోవడం లేదని, ఆసుపత్రిలో సదుపాయాలు పెంచడానికి, మంచి వైద్య పరికరాలు తీసుకురావడానికి కష్టపడుతున్నామని, పేదవాడికి కూడా ప్రైవేట్ ఆసుపత్రిలో లాంటి వైద్యం ఉచితంగా అందాలనేది కూటమి ప్రభుత్వ సంకల్పం అని ఆయన స్పష్టం చేశారు.

మాజీ ఎంపీ భరత్ చేసిన వ్యాఖ్యల గురించి ఎమ్మెల్యే వాసు ప్రస్తావిస్తూ.. రాజకీయాల్లో గెలుపోటములు సర్వసాధారణమని, దాని గురించి అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అయితే మొన్నటి వరకు ఈవీఎంలు అన్నాడు. ఈవీఎంల గురించి 'మీకేమైనా అనుమానాలు ఉంటే మోదీ గారిని అడగండి' అని మేము చెప్పగానే, ఈవీఎంలు అనడం మానేశాడని గుర్తు చేశారు. ఇప్పుడేమో 'డబ్బులు పంచి నెగ్గాం' అని అంటున్నాడు. నేను డబ్బులు పంచి నెగ్గితే, మరి గతంలో జగన్ ఎలా నెగ్గారని ఆయన ప్రశ్నించారు. భరత్ ఏదేదో మాట్లాడుతున్నారని, ఆయనే కాదు, ఎవరు ఎన్ని విమర్శలు చేసినా, నేను పట్టించుకోనని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న కూటమి ప్రభుత్వానికి, నాకు ప్రజా సేవ తప్ప వేరే ధ్యాస లేదు. నా పూర్తి దృష్టి రాజమండ్రి అభివృద్ధిపై, ప్రజల సమస్యల పరిష్కారంపైనే ఉంటుందని ఎమ్మెల్యే వాసు స్పష్టం చేశారు. "మా వాడు శారీరకంగానే కాదు, మానసికంగా కూడా కొంచెం పాడైపోయినట్టు ఉన్నాడు. మీరు కూడా చెప్పండి, ఇలాంటి రాజకీయాల్లో ఇవన్నీ కామనే" అని ఆయన వ్యాఖ్యానించారు. ఎవరెన్ని అనుకున్నా రాజమండ్రిని ఆంధ్రప్రదేశ్ లో ఒక ఆదర్శ నగరంగా మార్చాలన్నదే నా ధ్యేయమని, అందుకోసమే పనిచేస్తానని అన్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో ఆదిరెడ్డి అప్పారావు కృషి కూడా ఉంది..**

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో ఎంతో మంది కృషి ఉందని ఎమ్మెల్యే వాసు అన్నారు. అందులో ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కృషి కూడా ఉందన్నారు. అప్పట్లో వైద్య ఆరోగ్య మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ కృషి ఉందన్నారు. అప్పట్లో ఇది నేను ప్రత్యక్షంగా చూశానని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇక్కడ గైనిక్ హెడ్ ఆవిడ వలన ఇక్కడ అనేక ఇబ్బందులు వస్తుంటే, మంత్రి కామినేనితో అప్పారావు మాట్లాడినవన్నీ కూడా నేను ఇంకా మర్చిపోలేదన్నారు. అలా కష్టపడి తెచ్చుకున్న వాటికి ఇప్పుడు ఏదైనా ఇబ్బంది వస్తుంటే, ఎలా ఊరుకుంటాం? అని ఆయన ప్రశ్నించారు. ఆసుపత్రికి ఇంకా చేయవలసింది చాలా ఉందని, నియమకాలు చేసుకోవలసిన అవసరం ఉందని, కాలేజీ అనుసంధానం అవ్వటం వల్ల కొన్ని ఇబ్బందులు తగ్గుతున్నాయని ఆయన అన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ చాలా సహకరిస్తున్నారని ఆయన తెలిపారు.

**మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద గుంతలకు శాశ్వత పరిష్కారం..**

మోరంపూడి ఫ్లైఓవర్ సిటీ నియోజకవర్గంతో పాటు రూరల్ నియోజకవర్గానికి కూడా వెళ్తుందని, అంతకంటే ముఖ్యంగా ఇది ఎంపీ పరిధిలో ఉంటుందని ఎమ్మెల్యే వాసు అన్నారు. అయినా సరే, అందరూ ఇది సిటీలోకి వస్తుందనే ఉద్దేశ్యంతో నన్నే లక్ష్యంగా చేసుకుని ప్రశ్నిస్తుంటే, నేను కూడా చేయాల్సింది చేయాలనే ఉద్దేశంతో, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కాబట్టి, దీన్ని పరిష్కరించడానికి ముందుకు వచ్చానని ఆయన తెలిపారు. వర్షాల వల్ల రోడ్ల పనులు ఆలస్యం అయిన మాట వాస్తవమేనని, అందుకే మొదట, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని పూర్తి చేశామని ఆయన తెలిపారు. ప్రజలు ఇకపై ఇబ్బంది పడకుండా ఉండేందుకు, ఆ సైడ్ రోడ్ల పూర్తి పనులు, లైటింగ్ తో సహా అన్నీ పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. జనవరి 15 నాటికి ఈ పనులన్నీ పూర్తిచేసి, రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ప్రకటించారు. "ఇది నా హామీ..ఈ విషయం గురించి ఎంపీ పురందేశ్వరి కూడా వచ్చిన తర్వాత తెలియజేస్తానని" ఆయన అన్నారు. వానాకాలం అయిపోయినందున మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చి నగరంలో డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేయించే కార్యక్రమం చాలా వేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. మీడియా సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.





## చంద్రబాబు అంటే మోసం
## సత్యానందరావు అంటే దోపిడీ
### మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంటే పేదలకు ప్రభుత్వ వైద్యం దూరం చెయ్యడమే

**కొత్తపేట( మనసులో మాట) నవంబర్ 10..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలోని జిల్లా వై. యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ పేదవారికి ప్రభుత్వ వైద్యం దూరం చేసి, కార్పొరేట్లకు దోచి పెట్టాలనే దుర్బుద్ధితో కూటమి ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వచ్చింది అని అన్నారు. 17వ తేదీన కోటి సంతకాల ప్రతులను మా పార్టీ నాయకులు వై.యస్.జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్ కు అందిస్తారు.ప్రజాభిప్రాయానికి అనుగుణంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని కోరడం జరుగుతుంది అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి సెట్టింగులు, అసత్య ప్రచారాలు, హంగులు, ఆరాటాలు, దోపిడీలు, కక్ష రాజకీయాలతో కాలం వెళ్లదీస్తున్నారని జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. అరకొరగా తల్లికి వందనం ఇచ్చి చేతులు దులుపుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిది అని ఇలా ఇచ్చిన హామీలు ఏమి అమలు చేయకుండా అన్ని అమలు చేసేసాం అని చెప్పే గొప్ప నాయకుడు ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రమే అని దుయ్యబట్టారు.నియోజకవర్గంలో జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తపేటలో మరల వైసీపీ రాదని చెప్తున్నారు, అన్నదమ్ములు ఇద్దరు కలిసి ఎంత దోచేస్తున్నారో ప్రజలే గమనిస్తున్నారని, ఇది సోషల్ మీడియా కాలం మీరు చేస్తున్న దోపిడీ ఎంత దాచినా దాగదు అని తెలుసుకుంటే మంచిది అని, అలాగే అధికారంలో ఎవరు ఉంటారో అది చెప్పాల్సింది మీరు కాదు ప్రజలు అని తెలుసుకుంటే మంచిది అని హితవు పలికారు.అలాగే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపల్లి దేవస్థానంలో ఏర్పాటు చేసుకున్న కలెక్షన్ ఏజెంట్ గురించి మీ హయాంలో ఆలయంలో జరుగుతున్న అపచారాల గురించి, దోపిడీ గురించి మీ నాయకులే కోడై కూస్తున్నారు. ఆలయంలో హుండీ లెక్కింపులో టీడీపీ నాయకుడు డబ్బు చోరీ చేసి దొరికిపోతే చర్యలు శూన్యం, వాడపల్లి ఆలయంలో హుండీ దోపిడీలు ఈ తెలుగుదేశం హయాంలోనే ఎందుకు జరుగుతాయో ప్రజలు అందరూ గమనించాలి.ఏది ఏమైనా 18 నెలల్లోనే ప్రజలు కళ్ళు తెరుచుకున్నారని, మరల వైసీపీ అధికారంలోకి వస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా ప్రమోషన్లకు నోచుకొని ఎంపిడిఓ లను డివిల్డిఓ లుగా పదోన్నతి కల్పించిన ఘనత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేనే ఏర్పాటు చేశానని క్రెడిట్ చోరికి ప్రయత్నం చేయడం హాస్యాస్పదం. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## హైపర్ కమిటీని వీలైనంత త్వరలో నియామకం చేస్తాం...
### రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** జర్నలిస్టులపై దాడుల నివారణకు వీలుగా రాష్ట్రస్థాయిలో హైపర్ కమిటీని వీలైనంత త్వరలో నియామకం చేస్తామని రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధి వర్గానికి హామీ బుధవారం ఇచ్చారు. సచివాలయంలో డిసెంబర్ 9వ తేదీ హెూం మంత్రిని కలిసిన ఫెడరేషన్ ప్రతినిధి వర్గం జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు రాష్ట్రస్థాయిలో హైపర్ కమిటీ, జిల్లా స్థాయిలో దాడుల నివారణ కమిటీలను నియమించాలని అందుకు వీలుగా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని వాటిని తక్షణమే అమలు చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే కమిటీ నియామకం పై తగిన చర్యలు తీసుకోవాలని ఓ ఎస్ డి అనిల్ కుమార్ కి ఆదేశం ఇచ్చారు. మంత్రిని కలిసిన ఫెడరేషన్ ప్రతినిధి వర్గంలో ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు తో పాటుగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలిమి శ్రీ,, ఎంబీనాథన్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ఆనంద్, చిన్న పత్రికల సంఘం నాయకులు హుస్సేన్ ఖాన్ లు ఉన్నారు.



# న్యాయ విజ్ఞాన సదస్సు

**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 10:** హక్కులు అంటే చట్టపరమైన, సామాజిక, నైతిక సూత్రాల ప్రకారం వ్యక్తులకు లభించే స్వేఛ్ఛ అని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ రహమతుల్లా పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కోర్టు హాల్లో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పౌరుల వ్యక్తిగత వికాసానికి, హుందాగా జీవించడానికి ప్రాథమిక హక్కులు, మానవ హక్కులు, ముఖ్యమైనవి అన్నారు. వీటిని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరి పైన ఉంది. జాతి, కులం, ప్రాథమిక హక్కులు లింగం, మతం, వంటి బేధాలు లేకుండా ప్రతి మనిషికి పుట్టుకతో లభించేవే ప్రాథమిక హక్కులు అని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డీ నాగేశ్వరరావు, ఏజిపి కాశి సిద్ధార్థ కుమార్, న్యాయవాదుల దోనుపాటి ఆంజనేయులు , దాసరి సత్యనారాయణ ప్యానల్ అడ్వకేట్ గుత్తుల శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సభ్యుడు ఉదయ్ కు కృతజ్ఞతలు తెలిపిన జిల్లా కాప్స్ రాక్స్ సభ్యులు



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వందేమా తర గీతం 150 వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన ప్రత్యేక చర్చలో భాగంగా మన జిల్లాకు చెందిన తొలితరం స్వతంత్ర సమరయోధుడు కాపు ముద్దుబిడ్డ ద్వార బంధాల చంద్రయ్య దొర గురించి ప్రస్తావించడంతో పాటు, ఆయన పోరాటపటిమను పార్లమెంట్ వేదికగా తెలియచెప్పిన కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ కు కాపు రాక్స్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశ పార్లమెంటు చరిత్రలోనే ఒక కాపు సమరయోధుడు గురించి మొదటిసారి ప్రస్తావించిన ఘనత ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కి దక్కుతుందని హర్షం వ్యక్తం చేశారు. చరిత్రలో మరుగున పడ్డ ఒక కాపు స్వతంత్ర సమరయోధుడిని స్మరింపచేసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ చరిత్రలో నిలిచిపోయారని, కాప్స్ రాక్స్ ఫౌండర్ పెద్దిరెడ్డి శివ భాస్కర్ ఆదేశానుసారం కాకినాడ జిల్లా సభ్యులు త్వరలోనే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ని కలవడం జరుగుతుందని కాప్స్ రాక్స్ జిల్లా కోఆర్డినేటర్ నాగడమూడి సత్యనారాయణ రాజు, ఉభయ గోదావరి జిల్లా సభ్యులు తెలిపారు.

## కొత్తపేటకు 35 ఆరోగ్య కేంద్రాలు, 2 ఆరోగ్య యూనిట్లు రు.13.71 కోట్లతో విశాల్ ఆరోగ్యాభివృద్ధి

### - ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట (మనసులో మాట) నవంబర్10..** దేశవ్యాప్తంగా వైద్య, ఆరోగ్య రంగంలో జరుగుతున్న మౌలిక వసతుల అభివ ృద్ధి కార్యక్రమాలలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ద ృష్టి సారించింది. రాష్ట్రంలో వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా కొత్తపేట నియోజకవర్గానికి మొత్తం 35 విలేజ్ హెల్త్ క్లినిక్స్, 2 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు మంజూరు అయ్యాయి. ఈ మేరకు వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ అధికారిక లేఖ ద్వారా వివరాలు తెలియజేశారు. కొత్తపేట నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో రూ,13.71 కోట్ల వ్యయంతో ఆరోగ్య కేంద్రాల నిర్మాణం అభివ ృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ నిర్మాణాలు పూర్తికాగానే నియోజకవర్గ ప్రజలకు అత్యుత్తమ ఆరోగ్య సేవలు చేరువలో అందుబాటులోకి వస్తాయని, గ్రామీణ స్థాయిలో వైద్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య సదుపాయాల విస్తరణ కొత్తపేట అభివ ృద్ధిలో మరొక కీలక అడుగుగా నిలుస్తుందని తెలిపారు.
ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ కు హ ృదయపూర్వక క ృతజ్ఞతలు తెలిపారు.

# భూగర్భ జలాల పెంపు పై క్షేత్ర స్థాయి చర్యలు చేపట్టాలి

**- లీకేజీల నివారణ, ఇంకుడు గుంతలు, నీటి సంరక్షణే లక్ష్యం**

**- కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** జిల్లాలో భూగర్భ జలాలను పెంచుకునే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆ దిశగా క్షేత్ర స్థాయిలో వెంటనే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తు కార్యాచరణ పై నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, భూగర్భ జలాలు, డ్వామా, గ్రామ, వార్డు సచివాలయ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాల గణాంకాలపై నిశితంగా దృష్టి సారించి, పెరుగుదల దిశగా స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డ్వామా ఆధ్వర్యంలో డిసిల్టేషన్, బుష్ క్లీరెన్స్, ఇంకుడు గుంతలు, కుంటల పునరుద్ధరణ వంటి పనులకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూడా జల సంరక్షణ పద్ధతులపై స్థానిక సంస్థలు భాగస్వామ్యంతో చేపట్టాల్సి ఉందన్నారు. జలవనరుల శాఖ గోదావరి కాలువలు సహా ప్రధాన కాలువల్లో లీకేజీల నివారణ, గట్ల పటిష్ఠతపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సమగ్ర నివేదిక అందజేయలని కోరారు. భూగర్భ జలాల శాఖ మండలాల వారీగా ప్రత్యేక గణాంకాలు, రియల్ టైమ్ పర్యవేక్షణ అందించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో భూగర్భ జలాలు పెరిగే దిశగా మండల అభివృద్ధి అధికారులు నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలని ఆమె ఆదేశించారు. రూరల్ వాటర్ సప్లై ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టవలసిన పనులు చేపట్టాలని, అందుకు అనుసరించి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 88 గ్రామాల్లో భూగర్భ జలాలు అత్యల్ప స్థాయిలో, 122 గ్రామాల్లో సగటు కంటే తక్కువగా ఉన్నాయని తెలిపారు. భూగర్భ జలాలను పెంచడంపై దృష్టి పెడితే రూ. 5 వేల కోట్ల ఆర్థిక వనరులు పరిరక్షించుకునే అవకాశం ఉందని, ఇటీవల జిల్లాలో పర్యటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తు చేశారని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. అడవుల సంరక్షణ పద్ధతుల్లో, విస్తృత స్థాయిలో ఇంకుడు గుంతలు నిర్మాణం, చెరువుల పూడిక తీత, ఇతర పరిరక్షణ వంటి చర్యల ద్వారా 80 శాతం భూగర్భ జలాల డిశ్చార్జ్ నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రాబోయే వేసవి సీజన్‌లో నీటి అవసరాలు దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా క్షేత్ర స్థాయి పనులు ప్రారంభించాలన్నారు. వచ్చే సమీక్ష సమావేశం నాటికి సమన్వయ శాఖల అధికారులు సమగ్ర నివేదిక అందజేయాలని, అందుకు అనుగుణంగా జిల్లాలో భవిష్యత్తు కార్యాచరణ అమలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ కే గోపినాథ్, భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వై శ్రీనివాస్, జిల్లా జీఎస్డబ్ల్యూ అండ్ ఎస్ అధికారి పీ వీణాదేవి, డ్వామా ఏవో కిషోర్, ఇతర శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోగుల సహనాన్ని పరీక్షించకండి

**త్వరితగతిన సేవలు అందించండి - కడియం ప్రభుత్వ హాస్పటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల**



రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:రోగులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరితగతిన సేవలు అందించాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వైద్యులకు సూచించారు. బుధవారం ఉదయం కడియం ప్రభుత్వ హాస్పటల్, సీహెచ్సీ సెంటర్ ను ఎమ్మెల్యే గోరంట్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బారులు తీరి నిరీక్షిస్తున్న రోగులకు సత్వరమే వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని వైద్యులకు ఆదేశించారు. హాస్పిటల్లో సిబ్బంది కొరత ఉందని తెలియజేయగా హాస్పటల్ సిబ్బందిపై నివేదిక అందించాలని సూచించారు. ఆ క్రమంలో అక్కడ ఉన్న రోగులతో మాట్లాడి హాస్పటల్ లో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంటు జీ రత్నమాధురితో మాట్లాడుతూ పూర్తి స్థాయిలో వైద్య సదుపాయం బాధితులకు సత్వరమే అందాలని, ఆ రీతిగా వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని తెలిపారు. స్క్రబ్ టైఫాస్ వంటి వ్యాధులకు పరీక్షలు చేసేందుకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలను ఆరా తీశారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం తదితరులు ఉన్నారు.

# రేపు టీడీపీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

**- క్రైస్తవులు భారీగా తరలి రావాలని నిర్వాహకుల విజ్ఞప్తి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ నెల 12న స్థానిక భారీ మార్కెట్ సెంటర్ లో ఉన్న ఎంఎస్ఆర్ గ్రౌండ్స్ లో భారీ ఎత్తున క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ వెల్లడించారు. ప్రతీ ఏటా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదిరెడ్డి కుటుంబం సహకారంతో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ నెల 12వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమయ్యే వేడుకలకు సిటీ నియోజకవర్గంలోని 42 డివిజన్ కమిటీలు, సభ్యులు, క్రైస్తవులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితర టీడీపీ ముఖ్య నాయకులతో పాటు దైవజనులు కూడా పాల్గొంటారని వివరించారు. ఆదిరెడ్డి కుటుంబం క్రైస్తవులకు అండగా నిలబడటమే కాకుండా చర్చిల నిర్మాణం, పాస్టర్లకు కూడా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. మనకు వలె మన పొరుగు వారిని ప్రేమించమని క్రీస్తు బోధించిన విధంగా ఆదిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో కుల, మతాలకు అతీతంగా ఈ క్రిస్మస్ వేడుకలు జరుగుతాయన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు మాట్లాడుతూ టీడీపీ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఈ ఏడాది ముందుగానే ని ర్వ హి ం చ డా ని కి నిర?యించారన్నారు. క్రీస్తు బోధించిన మానవతా విలువలను కొనసాగించాలనే లక్ష్యంతో టీడీపీ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలకు అందరూ హాజరు కావాలని కోరారు. క్రైస్తవుల ప్రతినిధి చిర్రా ప్రకాశం మాట్లాడుతూ ఆదిరెడ్డి కుటుంబం ఎల్లప్పుడూ క్రైస్తవులకు అండగా నిలబడుతోందన్నారు. క్రిస్మస్ వేడుకలతో అందర్నీ ఒకేచోట చేర్చి ఆత్మీయ విందు ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు మరుకుర్తి రవియాదవ్, చాపల చిన్నరాజు, సాల్మన్ రాజు, సుధాకర్, విల్సన్, సుందర్రావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కులను మానవ హక్కులుగా గుర్తించాలి

**- 554 గ్రామాలను 5వ షెడ్యూల్డు ప్రాంతంలో చేర్చాలి - అయినాపురపు సూర్యనారాయణ డిమాండు**




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 45 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న 554 గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చి వారి హక్కులను కల్పించే వరకు ఆదివాసీ మహాసభ న్యాయ పోరాటం చేస్తుందని న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ స్పష్టం చేశారు. దీనిపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ప్రభుత్వం తీవ్రమైన తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీల హక్కులను మానవ హక్కులుగా గుర్తించాలని ఆయన డిమాండు చేశారు. బుధవారం ది రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లడుతూ గిరిజనులు అధికంగా నివసించే గ్రామాలను 5వ షెడ్యూల్డు ప్రాంతంలో కలపాలనే సమస్యను పరిష్కరించాలని 2019లో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్ప శ్రీవాణి అధ్యక్షతన జరిగిన గిరిజన సలహా మండలి 2019లో తీర్మానించిందని గుర్తు చేశారు. ఇదే విషయమై 2019 నవంబరు 4న మంత్రి ఉన్నత స్థాయి అధికారులతో ఆంధ్రప్రదేశ్ లోని 5వ షెడ్యూల్లో కలపవలసిన 554 గ్రామాల జాబితా విషయమై చర్చించారన్నారు. ఇందులో కాకినాడ జిల్లాలోని శంఖవరం మండలంలోని 15 గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని 14 గ్రామాలు, రౌతులపూడి మండలంలో 11 గ్రామాలు మొత్తం 40 గ్రామాలు కూడా ఉన్నాయి. 2019లో రంపచోడవరం ఐటీడీఏ పీఓ ఈ మేరకు పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారికి లేఖ వ్రాశారు. అనంతరం 3 గిరిజన సంఘాలు హైకోర్టులో రిట్ పిటీషన్ (నెం.4957/2021) దాఖలు చేశారు. 2022 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన ఈ 40 గ్రామాలకు 5వ షెడ్యూలు ఫలాలు అందే విధంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఆదేశాలు అమలు కాకపోవడంతో ఇటీవల ఆదివాసి మహాసభ హైకోర్టులో రిట్ పిటీషన్ నెం.33189/2025 దాఖలు చేసింది. అనంతరం కాకినాడ జిల్లా కలెక్టరు సగిలి షాన్మోహన్ ఈ విషయమై తగిన చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని పెద్దాపురం ఆర్డీఓని, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల తహశీల్దార్లను, మండల ప్రజాపరిషత్ అధికారులను ఈ నెల 2వ తేదీన ఆదేశించారన్నారు.. 1980వ సంవత్సరం నుండి ఈ సమస్య పెండింగ్‌లో ఉంది. కాకినాడ జిల్లాలోని ఈ 40 గ్రామాలను 1980లోనే 5వ షెడ్యూల్డు ప్రాంతంలో కలపాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపినా ఇప్పటికీ 5వ షెడ్యూలులో చేర్చలేదన్నారు. ఇదిలా ఉండగా కాకినాడ జిల్లాలో 50 శాతం గిరిజన జనాభా మించి ఉన్న గ్రామాలు మరో 19 ఉన్నాయని వాటిని కూడా 5వ షెడ్యూలులో చేర్చాలని గిరిజన సంఘాలు డిమాండు చేస్తున్నాయన్నారు. 5వ షెడ్యూల్లో కలపకపోవడం వలన ఆదివాసీలు భూమి పైన, వనరులు పైన హక్కులు పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో డిస్ట్రిక్టు రూరల్ డెవలప్‌మెంట్ సభ్యుడు జర్తా సరస్వతి, జీడెం నాగేశ్వరరావు, కాకర దేవీ వరప్రసాద్, జర్తా బాలరాజు, లోతా వెంకట రమణ, ఆవూరి అప్పారావు, రొబ్బాల శ్రీను, సిహెచ్ వెంకటరత్నం, జక్కల పాండవులు తదితరులు పాల్గొన్నారు.



## జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**27 మందికి రూ.17.78 లక్షల చెక్కుల పంపిణీ**

**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబర్ 10..** కూటమి అధికారంలోకి వచ్చాక సీ.ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతికి ఎముక లేనట్లుగా దరఖాస్తు చేసుకున్నవారందరికీఅందిస్తున్నారని, ఇందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లుకాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ అన్నారు. రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్, అప్పలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా మారిందని వ్యాఖ్యానించారు. మన ప్రభుత్వంలో ఇప్పటికే అనేక దఫాలుగా కోట్లాది రూపాయల చెక్కులను పంపిణీ చేశామన్నారు. పేదలందరికీ న్యాయం చేస్తున్నామన్నారు. మరికొన్ని చెక్కులు మంజూరు అయినట్లు సీఎం కార్యాలయం నుంచి సందేశం వచ్చిందని త్వరలోనే వాటిని సైతం పంపిణీ చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పైన మన నియోజకవర్గంపైన అభిమానంతో పంపిన దరఖాస్తులన్నీ ఆమోదిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిలీఫ్ ఫండ్ అందుతుందని వ్యాఖ్యానించారు. బుధవారం నియోజవర్గంలోని 27 మందికి 17 లక్షల 78 వేల రూపాయలు విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, తోట గాంధీ, నీలం శ్రీను, పాండ్రంగి రాంబాబు, రేఖ బుల్లి రాజు, పాఠంశెట్టి రవి, కుంచే తాతాజీ, జ్యోతుల రాంబాబు, ఎస్ బాబు, రాయి సాయి, నలమహారాజు, బు సాల విష్ణు, బాలనాగు, కురుకూరి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కపిలేశ్వరపురం మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక




**కపిలేశ్వరపురం (మనసులో మాట ) డిసెంబర్ 10..** స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో గురువారం ఎంపీపీ పదవికి ఎన్నిక జరుగునుంది. మండల పరిషత్ అధ్యక్ష పదవికి ఈనెల 11 వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశం హాలు లో నిర్వహించనున్నట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిణి, డివిజనల్ డెవలప్మెంట్ అధికారిణి వి విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్టేట్ ఎలక్షన్ కమీషన్ అమరావతి ఎన్నికల నోటిఫికేషన్ పురస్కరించుకుని ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కపిలేశ్వరపురం మండల ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి 2025 అక్టోబర్ 13న తన పదవికి అనూహ్య రీతిలో రాజీనామా చేయడంతో ఖాళీ అయిన నేపథ్యంలో అద్దంకి వారి లంక ఎంపీటీసీ గా ఉన్న సాకా శ్రీనివాస్ ఇంచార్జి ఎంపీపీ గా తాత్కాలిక బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ పదవికి ఎన్నిక మిర్వహించి ఎంపీపీ భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇత్తరువు మేరకు పదవికి ఎన్నిక నిర్వహిస్తున్నట్లు సభ్యులందరూ హాజరు కావాలని ఆమె కోరారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ డే



**జగ్గంపేట (మనసులో మాట) డిసెంబరు 10..** స్థానిక జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. దేవరపల్లి చెన్నారావు నేత ృత్వంలో రసాయన మరియు భౌతిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో "కెమిస్ట్రీ డే" ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందరరేగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆల్రెడ్ నోబెల్ వీలునామా ప్రకారం రసాయన శాస్త్ర, భౌతిక శాస్త్ర, వైద్య శాస్త్ర, అర్థ శాస్త్ర, సాహిత్య మరియు శాంతి రంగాలలో విశేష క ృషి చేసిన వారికి ఈ రోజున నోబెల్ బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. సునీత విద్యార్థులకు నోబెల్ బహుమతి ఆవిరావేం గురించి, ఈ సంవత్సరం వివిధ రంగాలలో నోబెల్ బహుమతులకు ఎన్నికైన వారి గురించి మరియు వారు చేసిన విశేష క ృషి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు, ఫిజిక్స్ అధ్యాపకులు గోపాలక ృష?, గణిత విభాగాధిపతి ఝాన్సీ దేవి, మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**కాజులూరు (మనసులో మాట) డిసెంబరు 10..** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జే రాంబాబు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాంబాబు ఒక ప్రకటనలో తెలుపుతూ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఈ సమావేశానికి సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు ,పలు శాఖలకు చెందిన అధికారులు హాజరు అవ్వాలని ఆయన తెలియజేశారు. మండలంలోని పలు శాఖలకు చెందిన అధికారులు తమ శాఖకు సంబంధించిన వివరాలను తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజా ప్రతినిధులకు అధికారులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భోజనం అనంతరం రెండు గంటలకు మండల పరిషత్ సమావేశం ఎంపీపీ మాతా భారతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



# డ్రింక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 22 మంది అరెస్టు...

## 22 మందికి న్యాయమూర్తి లక్ష్మీ కుమారి జైలు శిక్ష

### రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్య చేపట్టిననేపథ్యంలోనే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు...

**జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్**

కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10

కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఉత్తర్వులు ప్రకారము, కాకినాడ పట్టణంలో రోడ్ యాక్సిడెంట్లను తగ్గించాలని ఉద్దేశంతో కాకినాడ ట్రాఫిక్ 1అండ్ 2 పోలీస్ స్టేషన్ పరిధిలో త్రాగి వాహనం నడుపుతున్న వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 22 పై కేసులను నమోదు చేసారు .వాహన తనిఖీలలో భాగంగా, తాగి వాహనం నడిపిన వాహనదారులకు, స్పెషల్ మొబైల్ జే.ఎఫ్. సి మేజిస్ట్రేట్ కోర్ట్ కాకినాడ ఎన్. ఉషా లక్ష్మి కుమారి కోర్టులో హాజరుపరచగా 22 మంది పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు జైలు శిక్ష విధించారు .మొత్తం ఈ 22 కేసులలో జైలు శిక్ష విధించారు.1 కేసులో 6 రోజు చొప్పున 3 కేసులో 4 రోజు చొప్పున 11 కేసులో 3 రోజు చొప్పున 7 కేసుల లో 2 రోజు చొప్పున జైలు శిక్ష విధించినట్లు జిల్లా పోలీస్ అధికారులు బుధవారం తెలిపారు.

# ముమ్మిడివరం నియోజకవర్గం అభివృద్ధి పనులకు రూ. 24.86 లక్షలు మంజూరు

**- ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు**



**ముమ్మిడివరం(మనసులో మాట) డిసెంబరు 10:** ముమ్మిడివరం నియోజకవర్గ రహదారులకు కూటమి ప్రభుత్వం నుంచి రూ. 24.86 కోట్ల మంజూరయ్యాయని ముమ్మిడివరం శాసన సభ్యుడు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా అభివ ృద్ధి కోసం ఎదురుచూస్తున్న గ్రామీణ రహదారులను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారులు ప్రాజెక్ట్ గ్రాంట్ ద్వారా కీలక అభివ ృద్ధి పనులకు భారీ నిధులను ఆమోదించిందన్నారు. ఈ ప్రతిపాదనలు ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ద ృష్టికి తీసుకెళ్లడంతో ఈ నిధులు మంజూరు అయ్యాయి అన్నారు. నియోజకవర్గం లో తాళ్లరేవు మండలం లో నేషనల్ హైవే-216 నుండి రామన్నపాలెం - బొడ్డు వానిలంక వరకు రహదారికి 1.06 కిమీ లకు రూ.58లక్షలు అలానే బొడ్డువానిలంక గ్రామానికి వెళ్లే అత్రేయపాయపై వంతెన నిర్మాణం కు 13 కోట్లు మంజూరయ్యాయి కాట్రేనికోన మండలం పల్లంకుర్రు ఆర్ అండ్ బి రహదారి నుండి ఉప్పలగుప్తం ఆర్ అండ్ బి రహదారి వరకువయా సీ. హెచ్ గున్నేపల్లి - దేవరపల్లి 1.71 కిమీ మేర రూ.61 లక్షలు,అలానే చల్లపల్లి ఆర్ అండ్ బి రహదారి నుండి నీల్లరేవు అడవిపేట - చిర్ర యానాం రోడ్ మార్గం రహదారి 19.27 కిమీ మేర రూ.10.67 కోట్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. మొత్తం 4 పనులకు రూ. 24.86 కోట్లు కేటాయించిన ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే సుబ్బరాజు నియోజకవర్గం ప్రజల తరుపున ప్రత్యేక క ృతజ్ఞతలు తెలిపారు.

**మనసులోమాట వార్త కు స్పందన**

## జగనన్న కాలనీలో అక్రమంగా షాపుల నిర్మాణాలు

# తొలగించిన అధికారులు




**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 10..** జగనన్న కాలనీలో అక్రమంగా షాపుల నిర్మాణం పై డిసెంబర్ 8 న ప్రచురితమైన వార్త కు అధికారులు స్పందించారు. అక్రమంగా నిర్మిస్తున్న షాపులను కూల్చివేశారు. ప్రజాసంఘాలు ఈ అక్రమ నిర్మాణాలపై పలు మార్లు అధికారులకు పిర్యాదు చేయడం జరిగింది. కాలనీకి సిపి ల్యాండ్ గా ఉంచిన స్థలాన్ని కొందరు ఆక్రమించి లే అవుట్ వేసి అమ్మకాలు చేయడంతో పాటు బిల్డింగ్ లు నిర్మిస్తున్నారు.కాలనీ వారికి కమ్యూనిటీ స్థలంగా ఉంచిన స్థలంలో అక్రమ కట్టడాలు చేస్తున్నారని అధికారులకు అందిన పిర్యాదుతో వారు వాటిని తొలగించారు. నిర్మాణాలను అర్.ఐ జి. మంగపతి నాయుడు, విఆర్ఓ బోరగ నాగసత్యనారాయణ దొర,విఆర్ఏల ఆధ్వర్యంలో తొలిగించడం జరిగింది


జగనన్న కాలనీ వద్ద ప్రభుత్వ భూమిలో
అక్రమంగా షాపుల నిర్మాణం
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ అధికారులు -

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎంపిక చేసిన పాఠశాలలలో వ్యవసాయ శాఖ పర్యవేక్షణ లో

# విద్యార్థులకు మట్టి నమూనా సేకరణ, పరీక్ష విధానాలపై అవగాహన



**ఏలేశ్వరం (మనసులో మాట) డిసెంబర్ 10..** ఏలేశ్వరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల తో పాటు లింగంపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సామర్లకోట వ్యవసాయ శాఖ అధికారిని పీకేవీ లక్ష్మి ఎస్టిఎల్ సామర్లకోట మట్టి నమూనా సేకరణ పరీక్ష విధానాల పై ఆయా పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పంటలు దిగుబడులు బాగా రావాలంటే ఖచ్చితంగా భూసార పరీక్ష చేయించి సమతుల్య పోషకాల ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం ఆత్మ బి.టి.యం. నీలి బాబురావు సేకరించిన మట్టి నమూనా వివరాలను మొబైల్ యాప్ లో ఆన్లైన్ చేసే విధానమును విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,సైన్స్ టీచర్స్ , ఏ ఈ ఓ సత్య , వి ఏ ఏ లు రాజ్ కుమార్ , దీప్తి, ప్రక ృతి వ్యవసాయ సిబ్బంది, విద్యార్థులు ఇతర టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ హితం ప్రకృతి వ్యవసాయం : విజయరామ్



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** ఆరోగ్యకర ఆహార పదార్థాలను స్వీకరించడం ద్వారా మానవాళికి ఎన్నో ప్రయోజనాలను చేకూర్చే ప్రకృతి వ్యవసాయం పట్ల ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని. ఉభయ తెలుగు రాష్ట్రాల పద్మ శ్రీ సుభాష్ పాలేకర్ క ృషి ప్రక ృతి వ్యవసాయ ప్రచారకులు విజయరామ్ అన్నారు. కెప్టెన్ అజ్జరపు మల్లికార్జున్ రావు రాజేశ్వరి దంపతుల స్వీయ పర్యవేక్షణ లో కాకినాడ జిల్లా రామేశ్వరంలోని హరిత రాగ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రక ృతి రాగా వారి నేచురల్ బయో ఇన్పుట్ రిసోర్సెస్ సెంటర్ ను ప్రక ృతి వ్యవసాయ ప్రచారకర్త విజయరామ్ (హైదరాబాద్) ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ . కాకినాడ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏలియాజర్ ,రిసోర్స్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ శివచక్రం స్వీయ పర్యవేక్షణలో ఏర్పాటు అయిన ఈ కేంద్రం రైతులందరికీ అందుబాటులో ఉంటూ ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు .సుమారు 49 గ్రామాల ప్రజలకు ఈ కేంద్రం నుండి ప్రక ృతి వ్యవసాయ విధానంతో పాటు ఆరోగ్యకర ఉత్పత్తు లకు అవసరమైన విజ్ఞానంతో పాటు ముడి పదార్థాలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి ఇన్పుట్స్ రిసోర్సెస్ సెంటర్స్ ను ప్రతి మండల పరిధిలో ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో భాగంగా కాకినాడ జిల్లాలో రైతులకు అవసరమైన సెంటర్ ను ఏర్పాటుకు ప్రక ృతి రాగ సంస్థ ప్రారంభించడం శుభ పరిణామమని విజయరామ్ గారు అన్నారు.ప్రక ృతి వ్యవసాయ ప్రోత్సహించాలన్న ఆశయంతో అనేక రాయితీలను ప్రకటించడమే కాక జిల్లా స్థాయిలో వ్యవసాయ శాఖలో ప్రక ృతి వ్యవసాయం కు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని విజయ రామ్ అన్నారు. అధిక ఉత్పత్తులు కోసం రసాయనిక ఎరువులను వినియోగించడం వల్ల కలిగే దుష్పరిణామాలు పట్ల రైతులను చైతన్యవంతులుగా చేయవలసిన బాధ్యత మనందరి పైన ఉందని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా గో ఆధారిత ఉత్పత్తుల ద్వారా వ్యవసాయాన్ని ,ఈతరాన్ని రాబోయే తరాన్ని ఈ ప్రక ృతి వ్యవసాయం ఉపయోగ పడుతుందని విజయరామ్ అభిప్రాయపడ్డారు. ప్రక ృతి వ్యవసాయ విధానాన్ని విద్యార్థి దశ నుండే పరిచయం చేయాల్సిన కర్తవ్యం ప్రభుత్వాలకు ముఖ్యంగా వ్యవసాయ శాఖ అధికారులకు ఉందని ఆయన గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజీ కి చెందిన అగ్రికల్చర్ స్టూడెంట్స్ తో కలిసి విజయ రామ్ చేసిన కార్యక్రమాలు గ్రామీణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ ప్రతినిధులు తొ పాటు ప్రకృతి రాగా సంస్థ ప్రతినిధుల బృందం సుబ్రహ్మణ్యం ,శ్రీనివాస్, ఫణీంద్ర, శివ సాయి కుమార్, బి వి ఎస్ నారాయణ, టి శివ ,జయ కుమార్, ఇంజనీర్ సాయి ప్రసాద్ ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజ్ అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి రాజు కాలేజీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వివేకానందలో ఘనంగా ప్రపంచ

# మానవ హక్కుల దినోత్సవ వేడుకలు



**జగ్గంపేట(మనసులోమాట) డిసెంబరు 10..**జగ్గంపేట శ్రీ స్వామి వివేకానంద విద్యాసంస్థలలో ప్రిన్సిపాల్ అండ్ కరెస్పాండెంట్ ఒమ్మి రఘురామ్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రఘురామ్ మాట్లాడుతూప్రతి సంవత్సరం డిసెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే మానవ హక్కుల దినోత్సవం అనేది మనిషి పుట్టుకతోనే పొందే స్వేఛ్ఛ, సమానత, గౌరవం వంటి విలువలను గుర్తు చేస్తుందన్నారు. 1948లో ఐక్యరాజ్యసమితి ఆమోదించిన మానవ హక్కుల విశ్వ ప్రకటన ప్రపంచం మొత్తానికి ఒకే సందేశం ఇచ్చిందని ఆ సందేశమే “మనుషులందరు హక్కుల్లో సమానులు” అని తెలియజేసారు. మన దేశం వంటి ప్రజాస్వామ్యంలో మానవ హక్కులు అత్యంత ముఖ్యమైనవని.ప్రతి వ్యక్తి తన అభిప్రాయాన్ని స్వేఛ్ఛగా వ్యక్తపరచుకోవడం,విద్య పొందడం, గౌరవంగా జీవించడం,వివక్ష లేకుండా అవకాశాలు పొందడం ఇవన్నీ మానవ హక్కులలో భాగమేనన్నారు.మానవ హక్కులు కేవలం పుస్తకాలలోనే కాకుండా, ప్రతి ఇంటిలోను,ప్రతి పాఠశాలలోను, ప్రతికార్యాలయ ంలోను అమలవ్వాలన్నారు.ఈ రోజు మనం ప్రత్యేకంగా గుర్తుంచుకోవాల్సిందేమంటే హక్కులు ఉన్నట్లే బాధ్యతలు కూడా ఉన్నాయని.మన హక్కులను రక్షించుకోవాలంటే,ఇతరుల హక్కులను కూడా గౌరవించాలన్నారు. మనం చేసే చిన్న చిన్న మంచి పనులు కూడా ఒక పెద్ద మార్పుకు కారణం కావచ్చన్నారు.మన సమాజంలో పిల్లలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలు వీరి హక్కులు మరింత జాగ్రత్తగా పరిరక్షించాలన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగినప్పుడు నిశ్శబ్దంగా ఉండటం కూడా అన్యాయానికే మద్దతు ఇచ్చినట్టేనన్నారు. అందుకే మనం అందరం న్యాయం, సమానత్వం,మానవత్వం అనే విలువలను నిలబెట్టాలన్నారు.ఈ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా,మన సమాజాన్ని మరింత బాధ్యతాయుతంగా, శాంతియుతంగా,మానవతా విలువలతో ముందుకు తీసుకెళ్లే ప్రతిజ్ఞ మనమందరం చేద్దామన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు మానవ హక్కులు తెలియజేసే సాంస్క ృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. చార్టులు,ప్లే కార్డ్స్ ప్రదర్శించారు.కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## 13న రాజమండ్రిలో 1008 మంది విద్యార్థులచే.. శతక పద్య శాస్త్రాధిక గళ ధారణ

# వందేమాతర గీతాలాపన

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** నేటి తరం విద్యార్థుల్లో తెలుగు భాష పట్ల మమకారం పెంచేందుకు 1008 మంది విద్యార్థులచే, శతక పద్య సహస్రాధిక గళ ధారణ, వందేమాతర గీతాలాపన కార్యక్రమం రాజమండ్రిలో ఈ నెల 13న గోదావరి గట్టు ఛాంబర్ భవనంలో ఆవిష్కృతం కాబోతోంది. మాత ృ భాషా పరిరక్షణ సేవా సమితి పెరవలి ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి యువజన సమితి సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని సమన్వయకర్తలు సీహెచ్ సీ నాగభూషణం, సమితి పూర్వాధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సరస్వతి ఘాట్లో ఆధ్యాత్మికవేత్త తోట సుబ్బారావు బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థులు భరతమాత, తెలుగు తల్లి, వేషధారణలో పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ శ్రీపాద సీతా మహాలక్ష్మి తెలుగు బాల సేతిక శతక విశిష్టతను తెలియజేస్తారని చెప్పారు. మాత ృ భాషను ఈ తరానికి చాటాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వివిధ పాఠశాలల యాజమాన్యాల భాగస్వామ్యంతో, ఈ కార్యక్రమం జరుగుతోందని వివరించారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, అతిథులుగా పాల్గొనే ఈ కార్యక్రమాన్ని తెలుగు భాషా అభిమానులంతా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు మాదిరాజు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ, రఘుపాత్రుని సాయిబాబా, గుడిపూడి సునీల్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం ప్రసాదించిన

# మానవ హక్కులను కాపాడుకోవాలి

**ప్రముఖ న్యాయవాది డాక్టర్ వై వసంత..**



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** భారత రాజ్యాంగం ప్రసాదించిన మానవ హక్కుల ఉల్లంఘన నిత్యం జరుగుతుందని, దీనిని సంఘటిత పోరాటంతోనే ఎదుర్కోవాలని న్యాయవాది డాక్టర్ వై . వసంత పేర్కొన్నారు . స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. మనిషి మనిషిగా ఉండడానికి, మనుగడ సాగించడానికి అవసరమైన హక్కులే మానవ హక్కులని అన్నారు. 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందం తీర్మానం జరిగిందన్నారు. పుట్టిన ప్రతి వ్యక్తికి స్వేఛ్ఛగా జీవించే హక్కు ఉందన్నారు. ప్రజలు స్వేఛ్ఛకు భంగం కలిగే రీతిలో ప్రభుత్వాలు పనిచేయరాదన్నారు. ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. న్యాయబద్ధమైన తీర్పు ద్వారా తప్ప మరే విధమైన పద్ధతుల్లోనూ పౌరులు స్వేఛ్ఛను బంధీ చేయడం, బహిష్కరించడం తగదని వసంత తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు ,చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డీఈవోగా బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావు



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 10:** డా. బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారిగా పి.నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీఈవోగా విధులు నిర్వర్తించిన డా. షేక్. సలీం బాషా గుంటూరు డీఈవోగా బదిలీ పొందిన విషయం పాఠకులకు విదితమే. ఆయన స్థానంలో నూతన డీఈవోగా నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. డీఈవోగా బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావును సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ, డీసీసీబీ సెక్రటరీ బి.హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, ఎంవీవీ సత్యనారాయణ, డీఈవో కార్యాలయ ఏడీ నక్కా సురేష్, కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాను విద్యాపరంగా అభివ ృద్ధి పథంలో నడిపిస్తానని, పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రణాళికాబద్దంగా క ృషి చేస్తానని తెలిపారు.



## వందేమాతరం 150 ఏళ్ల

### సందర్భంగా రాజ్యసభ ప్రత్యేక చర్చలో పాల్గొన్న

## ఎంపీ సానా సతీష్ బాబు

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** జాతీయ భావజాలానికి ప్రతీకగా నిలిచిన వందే మాతరం గీతం 150 వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక చర్చలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పాల్గొని భావోద్వేగభరితంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన వందేమాతరం గీతం చరిత్ర, భారత స్వాతంత్ర్య సమరంలోని దాని పాత్ర, అలాగే తన స్వస్థలం కాకినాడతో ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని వివరించారు.ఎంపీ సతీష్ బాబు మాట్లాడుతూ వందే మాతరం గీతం ఏ మతానికీ చెందింది కాదని, మాత ృభూమి పట్ల భారతీయుడి ప్రేమను ప్రతిబింబించే జాతీయ గీతమని గుర్తుచేశారు. బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో లక్షలాది మందికి ప్రేరణగా నిలిచిందని పేర్కొన్నారు. తన స్వస్థలం కాకినాడలో 1923లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో చోటుచేసుకున్న చారిత్రక సంఘటనను ప్రస్తావించారు. వందే మాతరం గీతంపై అభ్యంతరంతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మౌలానా మహమ్మద్ అలీ జౌహర్ సభనుంచి బయటకు వెళ్లిన ఘటన చరిత్రలో ఒక బాధాకరమైన అధ్యాయంగా మిగిలిందని పేర్కొన్నారు.

అదే ఘటనకు శతాబ్ద కాలం తర్వాత చరిత్ర ఇచ్చిన సమాధానంగా, నవంబర్ 7 2025, కాకినాడలో మౌలానా మహమ్మద్ అలీ వీధికి వందే మాతరం మార్గ్ అనే పేరు పెట్టిన విషయాన్ని సభ ద ృష్టికి తీసుకువచ్చారు. ఇది కేవలం ఒక రోడ్డుపేరు మార్పు కాకుండా జాతీయ చైతన్యానికి ఇచ్చిన గౌరవమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డా. రాధా మోహన్ దాస్ అగర్వాల్ గారు, ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ గారు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్న విషయాన్ని కూడా పేర్కొన్నారు.దేశం మొత్తానికి చెందిన గీతం వందే మాతరం అని, చరిత్ర మనల్ని విడదీయకుండా ఏకం చేయాలనేది కాకినాడ నేల నుంచి దేశానికి వెళ్లే తన సందేశమని ఆయన స్పష్టం చేశారు.అలాగే, ఈ చర్చలో మాట్లాడే అవకాశాన్ని కల్పించిన తమ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ప్రత్యేక క ృతజ్ఞతలు తెలిపారు.

## 13న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 13న 4వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తునట్లు జాతీయ న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడ్డదగ్గ క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు, తదితర కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సంవత్సరం నిర్వహించిన 3వ జాతీయ లోక్ అదాలత్ లో 756 సివిల్ కేసులు, 547 యాక్సిడెంట్ కేసులు, 15431 రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు, 518 ప్రీ-లిటిగేషన్ కేసులు, మొత్తం 17073 కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. పరిష్కరించబడిన మొత్తం సొమ్ము రూ.100,99,11,504లు (అక్షరాల వంద కోట్ల తొంబై తొమ్మిది లక్షల పదకొండు వేల ఐదు వందల నాలుగు రూపాయులు). 2024 సంవత్సరంలో జరిగిన 4 జాతీయ లోక్ అదాలత్ లలో 2,131 సివిల్ కేసులు, 7,796 రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు, 696 ప్రీ - లిటిగేషన్ కేసులు, మొత్తం 10,623 కేసులు పరిష్కరించబడ్డాయి, మొత్తం పరిష్కరించబడిన మొత్తం సొమ్ము రూ.162,35,24,590లు (అక్షరాల నూట అరవై రెండు కోట్ల ముప్పై ఐదు లక్షల ఇరవై నాలుగు వేల ఐదు వందల తొంబై రూపాయులు)గా చెప్పారు. ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కు 46 బెంచులు ఏర్పాటు చేశారని తెలిపారు. హై కోర్టు ధర్మాసనం ఆదేశాల మేరకు ట్రాఫిక్ చలనా కేసులు కూడా జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చనని తెలిపారు. అదే విధంగా ఎక్సైజ్ కేసులలో కూడా డ్యూటీ పేయిడ్, నాన్ డ్యూటీ పెయిడ్ కేసులను కూడా రాజీ చేసుకోవచ్చు అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ కు 18,035 కేసులను రాజీ చేయడానికి గుర్తించడం జరిగినదన్నారు. కావున అందరూ ఈ జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత కోరారు.

### జాతీయ రహదాలకు అవసరమైన భూసేకరణ

# పనులు వేగవంతం చేయండి...

### - అధికారులను ఆదేశించిన కాకినాడ జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి




**కాకినాడ( మనసులో మాట) డిసెంబర్ 10..** జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ కలిసి కాకినాడ రూరల్ వాకలపుడి నుంచి అన్నవరం వరకు నిర్మించిన జాతీయ రహదారి భూ సేకరణ పురోగతి, కాకినాడ సెజ్ భూములు రైతులు పేరున బదిలీ చేసే ప్రక్రియపై రెవెన్యూ, కెఎస్ఈజెడ్, ఎన్.హెచ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందరరేగా భూ సేకరణ, సెజ్ భూములు వివరాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ కాకినాడ పోర్టును జాతీయ రహదారులకు అనుసంధానం చేసే ప్రక్రియలో భాగంగా వాకలపుడి నుంచి అన్నవరం వరకు నిర్మించిన జాతీయ రహదారికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక ద ృష్టి పెట్టి పనిచేయాలన్నారు. నిరీ?త సమయంలోగా భూ సేకరణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా కాకినాడ జిల్లాలో యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఎస్ఈజెడ్ లిమిటెడ్ కింద కాకినాడ డివిజన్, పెద్దాపురం డివిజన్ పరిధిలో ప్రత్యామ్నాయ భూమి 259.040 ఎకరాలు, రైతులు వదిలేసిన భూమి 930.176 ఎకరాల భూమిని 1,545 మంది రైతులకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పత్రాలపై స్టాంపు డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రెవెన్యూ, కెఎస్ఈజెడ్, శాఖల అధికారులు సమన్వయతో పనిచేసి, సెజ్ భూములను రైతుల పేరును బదిలీ చేసే ప్రక్రియ సజావుగా సాగేందుకు క ృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లి బాబు, కె.శ్రీరమణి, ఎస్ఈజెడ్ ఎస్డీసీ ఎన్.శ్రీధర్, కాకినాడ సెజ్ జీఎం ఎం.శ్రీనివాసు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ సైబర్ క్రైమ్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు



**కొత్తపేట (మనసులో మాట) నవంబర్ 10..** అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక హై స్కూల్ లో విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్, పై రావులపాలెం టౌన్ సీఐ ఎమ్ శేఖర్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత. మత్తుకు గంజాయి కి ఆకర్షితులు కావద్దని. చదువుకుని. ఉజ్వల భవిష్యత్తుకు. పునాదులు వేసుకోవాలని. ఉన్నతమైనా ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రుల కు. గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులను ఉద్దేశిస్తూ. సెల్ ఫోను వాడకంపై సూచనలు ఇస్తూ అనవసర లింక్ లు ఓపెన్ చేయవద్దని. ఎవరైనా డిజిటల్ అరెస్ట్ పేరున బెదిరిస్తే భయపడవద్దని. అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవద్దని ఎవరైనా. డబ్బులు పోగొట్టుకున్నటైతే. 1930 కు 24 గంటలలో కాల్ చేసి కంప్లైంట్ చేయాలని చెప్పారు . మైనరు పిల్లలకు నడపటానికి మోటారు వాహనాలు ఇవ్వరాదని. ఏదైనా ప్రమాదం జరిగితే. మైనరు తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో శాశ్వత సిబ్బందిని నియమించాలి

### -జిల్లా సాంఘిక సంక్షేమ వసతి గృహాధికారుల సర్వసభ్య సమావేశం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** సాంఘిక సంక్షేమ శాఖ తూర్పు గోదావరి జిల్లా వసతి గృహాల సంక్షేమ శాఖ సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు ముప్పిడి రాజు అధ్యక్షతన రాజమండ్రిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడిగా రాచర్ల జాకబ్ పాల్గొని వసతి గ ృహ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత శాఖ అధికారులతో చర్చించి, జిల్లాలో ఖాళీగా ఉన్న వసతి గృహాలకు శాశ్వత సిబ్బంది నియమించాలని, నాలుగవ తరగతి సిబ్బంది కొరతను ప్రభుత్వం గుర్తించి నియమించాలని, అలాగే పారిశుధ్య కార్మికులను నియామకం నిర?యించి అది వసతి గృహాలకు పారిశుద్ధ్యం నిమిత్తం సిబ్బందిని అందించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర?యానికి వసతి గ ృహ అధికారులు తరపున హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని కలిసి జిల్లా సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ మీటింగ్ లో జిల్లా యూనియన్ సభ్యులు, వసతి గ ృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.


### వైద్యాధికారులు బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా ఉండి

# ప్రజలకు సేవలు అందించాలి

### - కాకినాడ జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి -



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** వైద్యాధికారులు బాధ్యతాయు తంగా, అప్రమత్తతో పనిచేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి బుధవారం ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం లోని వివేకానంద సమావేశ మందిరంలో వైద్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైద్య శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకి సేవలు చేయాలని ఆదేశించారు. కాకినాడ జిల్లాలోని అన్ని పి.హెచ్.సి, యు.పి.హెచ్.సి వైద్యాధికారులు స్క్రబ్ టైఫస్ వ్యాధి పై అప్రమత్తత , 24 / 7 పి.హెచ్.సి లలో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. ఈ నెల 21 తేదీన నిర్వహించే పల్స్ పోలియో పై సన్నద్ధత, పి.ఎం.జె.ఏ.వై సర్వే 100 శాతం అయ్యేలాగా చూడాలని, పి.ఎం.వి.వి.వై , ఎన్.సి.డి. 4.0 సర్వే, అసంక్రమిత వ్యాధులు ఆర్.సి.హెచ్, హెచ్.ఎం.ఐ.ఎస్, యు.విన్ పోర్టల్ ,ఎం.ఆర్. కాంపెయిన్ నేషనల్ డి.వార్మింగ్ డే , టి.బి., లెప్రసీ కేసులు, సీజనల్ వ్యాధులు , సైబర్ నేరాలకు సంబంధించి ఒ.టి.పి హెచ్చరికల గురుంచి మరియు ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు లు ఏవిధంగా జరుగుచున్నాయో తెలుసుకొని అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. ఎప్పటికప్పుడు అన్ని యాప్ లలో వివరాలు నమోదు చేయుటను పరిశిలించి నూటికి నూరు శాతం అమలు అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమాల అమలుకు సిబ్బంది తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. జిల్లాలో ఫీల్డ్ లెవెల్లో ఆశ కార్యకర్తల యొక్క చేయు విధులను గురించి మరియు ఈ ఆశా యాప్ లో అప్లోడ్ చేయవలసిన,ఈ.సి విజిట్స్,హెచ్.బి.ఎన్.సి. విజిట్స్,ఐ.ఎఫ్ ఏ విటమిన్ అడ్మినిస్ట్రేషన్ వి.హెచ్.ఎస్.ఎన్.డి, వి.హెచ్.ఎస్. ఎన్.సి విధులు నమోదు గురుంచి సమీక్షా సమావేశంలో చర్చించి మరిన్ని సూచనలు చేసి జిల్లాలో మాతృ మరణాలపై, శిశువుమరణాలు తగ్గించే దిశగా నివారణ చర్యలు ఎలా చేపట్టాలో తెలియజేసినారు. మాతృ మరణాలు అరికట్టుటలో కమ్యూనిటీ స్థాయి మరియు ఫెసిలిటీ లెవెల్ లో తీసుకోవలసిన మెజర్స్ గురుంచి సూచనలు ఇవ్వడం జరిగినది. ప్రమాదకరమైన పరిస్థితులలో వున్న గర్భవతులు తీసుకోవలసిన జాగ్రత్రలు గురించి, గర్భ సమయంలో అన్నీ పరీక్షలు, ప్రమాదకర గర్భిణీ స్త్రీలను గుర్తించి సకాలంలో సంబంధిత ఆసుపత్రికి మెరుగైన ప్రసవ సేవల గురుంచి తీసుకోవలసిన జాగ్రత్తల గురుంచి, ఆసుపత్రి ప్రసవాలు పెంచేలా చర్యలు తీసుకొవాలని, ఏదైనా ఫీల్డ్ లెవెల్ లో సమాచారం తెలిసినప్పుడు వెంటనే జిల్లా యంత్రాశీగానికి తెలియజేయాలి.యు.పి.హెచ్.సి, రామారావు పేట,ప్రతాప్ నగర్, హెల్త్ వెల్ సెంటర్ పెదబ్రహ్మ దేవం 1 , 2 , నేమం, ఏరియా హాస్పిటల్ తుని చిన్న పిల్లల విభాగానికి జాతీయ ఆరోగ్య నాణ్యత ప్రమాణాలు విభాగానికి సంబందించి ఉత్తమ ప్రశంస పత్రాలను వారందరికి ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జె.నరసింహ నాయక్ , డి.సి.హెచ్.ఎస్. డా. మహేశ్వర రావు, డి.ఎల్.టి.ఒ డా. చలమయ్య, జిల్లా ఇమ్మునైజేషన్ ఆఫీసర్ డా. కె.వి. సుబ్బరాజు, ఎన్.సి.డి. అండ్ ఆర్.బి.ఎస్.కె. డా. వి. అరుణ డి.పి.ఎం.ఒ, డా. జి.లక్ష్మి, పెద్దాపురం డివిజన్ సూపర్విజింగ్ ఆఫీసర్ డా, ఎన్.ప్రశాంతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ . జి. దేవ కుమారి, డిప్యూటీ డెమో కె. సూర్య చంద్ర రావు, మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .





## ఘనంగా జగన్మోహిని కేశవ స్వామి, పవిత్రోత్సవాలు

**కొత్తపేట (మనసులో మాట )నవంబర్ 10..** జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామి వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించే పవిత్రోత్సవాలు మంగళవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు ఉదయం విశ్వక్షణ, పుణ్యాహవచనం, గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చైర్మన్ నాగేశ్వరరావు దంపతులు ఆలయ ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండిట్ ఫణి శర్మ, శ్రీనివాసు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

### ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# నోబెల్ డే కార్యక్రమం

- ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి....
- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.డి.సునీత



**ఏలేశ్వరం (మనసులో మాట)డిసెంబర్ 10..** ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో నోబెల్ డే కార్య క్రమాన్ని రసాయన శాస్త్ర విభాగ ఆద్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. డి సునీత పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ తో ఆల్ఫ్రెడ్ నోబెల్ (అలఫ్రెడ్ నోబెల్ ) ఒక స్వీడిష్ రసాయన శాస్త్రవేత్త అని , ఇంజనీర్, ఆవిష్కర్త, వ్యాపారవేత్త, డైనమైట్ను కనుగొనడం ద్వారా ప్రసిద్ధి చెందారని తన సంపదతో మానవాళికి గొప్ప సేవ చేసిన వారికి ఇచ్చే నోబెల్ బహుమతులను (నోబెల్ ప్రైజెస్ ) స్థాపించారని తెలిపారు. ఇంకా ఆమె మాట్లాడుతూ ఆయన వీలునామా ద్వారా ఈ బహుమతులు 1895లో ప్రారంభమయ్యాయని చెప్పారు , ఇవి శాంతి, సాహిత్యం, వైద్యం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, ఆర్థికశాస్త్ర రంగాలలో ఇవ్వబడతాయయని అంటే కాక ఆయన జీవిత చరిత్ర ఆవిస్కరణలు విపులంగా వివరించారు. 2025 సంవత్సరానికి సంబందించిన నోబెల్ బహుమతుల పొందిన వ్యక్తుల పరిశోదనల గూర్చి విద్యార్థులకు విపులంగా ప్రిన్సిపల్ డాక్టర్ డి. సునీత వివరించారు.ఈ కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె. వేంకటేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ ఆర్ఆర్సి కొ- ఆర్డినేటర్ డా. ఎస్కే మదీనా, అద్యపకులు వి. రామ రావు , కె. సురేష్. డా. శివప్రసాద్. వీరభద్ర రావు, లక్ష్మి,డా. కె బంగార్రాజు,మేరి రొసిలిన పుష్పా సతీశ్ అద్యపకేత సిబ్బంది అధ్యాపకేత సిబ్బంది సత్యనారాయణ , ధర్మ రాజు , దివ్య,రామలక్ష్మి కమల, కళావతి , పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకే మెడికల్ కాలేజీలు

# ప్రైవేటీకరణ కూటమి కుట్ర

### - వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



**ప్రత్తిపాడు ( మనసులోమాట )డిసెంబర్ 10:** పేద లకు వైద్య విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం కుట్ర పన్నడమే కాకుండా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి,జగన్ మోహన్ రెడ్డికి ప్రజల్లో మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేపట్టిందని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆరోపించారు.మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణపై ముద్రగడ నివాసం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు.నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడగిరి బాబు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు.మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం రౌతులపూడి, మండలాలు ఏలేశ్వరం పట్టణంతోపాటు సుమారు60 వేలమంది స్వచ్ఛందంగా సంతకాలు చేసి కూటమి ప్రభుత్వానికి తమ వ్యతిరేకతను సంతకాలు ద్వారా తెలియజేశారుసేకరించిన సంతకాలపత్రాలనుపార్టీ మండల కన్వీనర్ లు వైసిపి నాయకులు కార్యకర్తలసమక్షంలో కాకినాడ జిల్లా పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే విధంగా పరిపాలన సాగిస్తుందని విమర్శించారు. దానిలో భాగంగా వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు.కోటి సంతకాల సేకరణకు సహకరించిన వైసిపి నాయకులకు, కార్యకర్తలకు ప్రజలకు ముద్రగడ గిరిబాబు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం సేకరించిన సంతకాలు తరలించే వాహనానికి మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఒమ్మి రఘురాం, తుని నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి జమీలు, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి. రాష్ట్ర వైసిపి యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవిందు, జెడ్పిటిసిలు గొల్లు చినదివాణం, బెహరా దొరబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి, మండలాలతో పాటు ఏలేశ్వరం రూరల్ మండలం వైసిపి అధ్యక్షులు రామిశెట్టి నాని, గొల్లపల్లి సురేష్, నరాల శ్రీను, సిహెచ్ సత్యన్నారాయణ, శిగడం వెంకటేశ్వరరావు, తోపాటు ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## మత్స్యరంగ వృద్ధి, ఎగుమతుల విస్తరణ పై ఎంపీ సానా సతీష్ బాబు

# ప్రశ్న కు కేంద్రం స్పష్టత

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** భారత దేశంలోఆక్వా రంగం వృద్ధి, మార్కెట్ విస్తరణ, మత్స్యకారుల ఆర్థిక బలోపేతం, దక్షిణ భారత ఆక్వా ఉత్పత్తుల తక్షణ రవాణా సౌకర్యాల ప్రాముఖ్యతపై బుధవారం రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు , కేంద్రం సమగ్ర నివేదికను అందించింది. కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం, 2024%-%25లో భారత్ 16.98 లక్షల టన్నుల సముద్ర ఆహారాన్ని 62,408 కోట్ల రూపాయలు విలువతో 130 దేశాలకు ఎగుమతి చేసిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.రొయ్యల ఉత్పత్తిలో ముఖ్య కేంద్రంగా నిలిచిన కాకినాడ, గోదావరి ప్రాంతం ఈ ఎగుమతుల్లో కీలక పాత్ర పోషిస్తున్నదని కేంద్రమంత్రి పేర్కొన్నారు..

అమెరికా (36శాతం ), చైనా (17శాతం ), యూరోపియన్ యూనియన్ (15శాతం ) ప్రధాన మార్కెట్లుగా నిలిచాయని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.కొత్త మార్కెట్ల విస్తరణ, విలువ జోడింపుపై కేంద్రం చేపట్టిన చర్యలు కాకినాడ నుండి రొయ్యల ప్రాసెసింగ్, ఎగుమతి యూనిట్లకు అవకాశాలను పెరుగనున్నాయి అని అన్నారు.జి ఎస్ టీ తగ్గింపుతో విలువ ఆధారిత ఉత్పత్తుల ఉత్పత్తి, స్థానిక ప్రాసెసింగ్ యూనిట్లకు లాభం చేకూరే అవకాశం ఉందని కేంద్ర మంత్రులు స్పష్టం చేశారు. కొత్త మార్కెట్ల విస్తరణ కోసం ఎం పి ఈ డి ఏ ద్వారా అవగాహన కార్యక్రమాలు, కొనుగోలుదారు అమ్మకందారు సమావేశాలు, విలువ జోడింపుపై శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కేంద్రమంత్రి మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ సింగ్ పేర్కొన్నారు. దేశీయ వినియోగం పెంచేందుకు పి ఎం ఎం ఎస్ వై కింద 34,788 మౌలిక సదుపాయ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. విలువ ఆధారిత సముద్ర ఆహారాలపై జి ఎస్ టీ ని 12 శాతం నుంచి 5 శాతం కు తగ్గించడం వినియోగాన్ని పెంచుతుందని చెప్పారు. మత్స్యకారులకు కేసీసీ ద్వారా 2 లక్షల రూపాయలు వరకు రుణాలు లభిస్తున్నప్పటికీ, ప్రత్యేక టాప్-అప్ లోన్లకు ప్రస్తుతం నిబంధనలు లేవని కేంద్రం మంత్రి స్పష్టం చేశారు.. దక్షిణ భారతదేశం నుండి ఆక్వా ఉత్పత్తుల రవాణా కోసం ప్రత్యేక రైలు సేవ ప్రవేశపెట్టే ప్రణాళిక లేదని రైల్వే శాఖ కేంద్రమంత్రి తెలియజేశారు.

## కోనసీమ జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా నాగేశ్వరరావు



**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 10:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా పడాల నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించి అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థకు పేరు ప్రఖ్యాతులు రాష్ట్ర స్థాయిలో ఇనుమడింప చేసేలా అందరి సమన్వ యంతో కృషి చేయాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో విద్యా వ్యాప్తి ద్వారా ఎంతోమందినీ ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలని ఆ దిశగా ముందడుగు వేయాలని సూచించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**గండేపల్లి. మనసులో మాట. డిసెంబర్ 10.** గండేపల్లి మండలం మురారి గ్రామం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నారు. అయితే అతని ఒంటిపైన ఏ విధమైన గాయాలు లేవు. వ్యక్తి ఎవరికైనా తెలిసిన యెడల ఈ ఫోన్ నెంబర్ కు తెలియపరచవలనని గండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు. ఫోన్ నెంబర్ 9440 90 4841, 9440796529.

## రైతాంగానికి

# గిట్టుబాటు ధర ఇవ్వాలి..

- రైతు సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తే కూటమి ప్రభుత్వం పతనం ఖాయం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు
- భూమి లేని కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరావు - రైతుల సమస్యలపై వ్యవసాయ మార్కెట్ వద్ద సీపీఐ నిరసన




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** ఖరీఫ్ సీజన్ లో 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తామని, అందుకు గాను 6. 7 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచుతామని చెప్పి ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తోందని, కనీసం గోనె సంచులను రైతాంగానికి అందించడంలో తీవ్రంగా విఫలమవుతోందని రైతుల ఉసురు తగులుతుందని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకపోతే కూటమి ప్రభుత్వం పతనం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు హెచ్చరించారు. బుధవారం ఉదయం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద రైతుల సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మధు మాట్లాడుతూ తేమ శాతం పేరుతోనూ, ధాన్యం రంగు మారిందని, తాలు, తప్పలు ఉన్నాయని ధాన్యం కొనుగోలు చేయకుండా అనేక కొర్రీలు పెడుతున్నారన్నారు. కనీసం పంటను ఆరబెట్టుకోవడానికి, తడవకుండా కాపాడుకోవడానికి పట్టాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం, రైతు సేవా కేంద్రం, రవాణా ఇన్ చార్జీలు, కస్టోడియన్ ఆఫీసర్లు రైస్ మిల్లర్స్ తో కుమ్మక్కై ధాన్యం దళారులకు అమ్ముకునే విధంగా వ్యవహరిస్తున్నరన్నారు. దీంతో 75 కేజీల బస్తాను రూ.1200లకు అమ్ముకుని బస్తాకు రూ.400ల నుంచి 500 రూపాయలు వరకు నష్టపోతున్నారని మధు తెలిపారు. ధాన్యంతో పాటు పత్తి కొనుగోలు విషయంలో పీఎం యాప్, సీం యాప్ ల పేరుతో అనేక ఇబ్బందులు పెడుతున్నారని రాష్ట్రంలో 2.5 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగుచేశారని చెప్పారు. సుమారు రూ.13 లక్షల క్వింటాళ్ళ దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400లు ఉన్నప్పటికీ వ్యాపారులు మార్కెట్లో రూ.1600ల నుంచి 1700ల మధ్యలో కొనుగోలు చేస్తున్నారని మధు తెలిపారు.

వ్యవసాయ, ఉద్యానవన పంటలతోపాటు ఆక్వా రైతులు పరిస్థితి కూడా దయనీయంగా మారిందన్నారు. ఎగుమతి, దిగుమతి విధానాలు స్వదేశీ రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. దేశ రైతంగానికి నష్టం చేసే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని ధ్వజమెత్తారు. దీంతో రైతుల కుటుంబాలు కుదేలు అవుతున్నాయని, వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది దన్నారు. రైతాంగ ఆత్మహత్యల పరంపర కొనసాగుతోందని, ఇది చాలదన్నట్టు రైతు ప్రయోజనాలకు నష్టం చేసే విధంగా సీడ్ బిల్లు, విద్యుత్తు బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్ట బోతున్నారన్నారని తెలిపారు. కొనుగోలు నిబంధనలు సడలించి ధాన్యం, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను మద్దతు ధరలకే కొనుగోలు చేస్తామని, అరటి రైతులకు న్యాయం చేస్తామని, ఉల్లి పంట రైతులకు హెక్టారకు రూ.50వేలు ఇస్తామని, భూమిలేని ప్రతి కౌలురైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందజేస్తామని అనేక వాగ్దానాలు చేశారన్నారు. వీటిలో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని ఆరోపించారు.

రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుపాను వలన రూ.5,500 కోట్లకు పైగా నష్టం జరిగితే, ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.1000 కోట్ల మేర రైతులకు నష్టం జరిగిందన్నారు. ఎన్యూమరేషన్ పూర్తిచేసి నెల రోజులైనా రైతాంగానికి నష్ట పరిహారం అందించలేదన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న ఉచిత పంటల బీమా పథకం ఎత్తివేసి స్వఛ్ఛరేద పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టడంతో బీమా ప్రీమియం భారంగా ఉండటం వలన ఎక్కువ మంది రైతులు బీమా పథకంలో చేరలేక పోయారన్నారు. ప్రక ృతి వైపరీత్యాలు వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు బీమా పరిహారం దక్కే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ రైతులకు న్యాయం చేయాలని, ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా ఆదుకోవాలని మధు విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరావు మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్న, పత్తి పంటలను మద్దతు ధరలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ కలిపి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. భూమి లేని కౌలు రైతుల అందరికీ అన్నదాత సుఖీభవ పథకంతో పాటు బ్యాంకు రుణాలు, వ్యవసాయ, ఉద్యాన తదితర అన్ని రకాల పథకాలు అమలు చేయాలన్నారు. మార్కెట్ లో ధరలు పడిపోయి నష్ట పోతున్న అరటి, నిమ్మ, బత్తాయి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జట్ల సంఘం కే రాంబాబు, నగర కార్యదర్శి వీ కొండలరావు, సహాయ కార్యదర్శులు సప్పా రమణ, పీ లావణ్య, రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వరావు, కే శ్రీనివాస్, ఎం ప్రసాద్, నల్ల రామారావు, జీఏ రామారావు, వెంకటరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

# కోటి సంతకాల సేకరణలో విజయవంతం



**జగ్గంపేట(మనసులోమాట) డిసెంబరు 10..** జగ్గంపేట నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా నిర్వహించింది వై.ఎస్ అర్ కాంగ్రెస్ పార్టీ.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి క్షేత్ర స్థాయిలో ప్రతి కార్యకర్త శ్రమించారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఈ కోటి సంతకాల సేకరణ ను విజయవంతంగా ముగిసింది.ప్రభుత్వ వైద్య కళాశాల లను ప్రైవేట్ పరం చేయడానికి కూటమి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైసీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వై, ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో జగ్గంపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి, జగ్గంపేట వైసీపీ ఇంచార్గ్ తోట నరసింహం, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణను ఘనంగా ముగించింది. అనంతరం జగ్గంపేటలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజా ఉద్యమం కోటి సంతకాల బాక్సులను కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి తరలించడానికి జగ్గంపేట వైసీపీ ఇంచార్జ్ తోట నరసింహం ఆధ్వర్యంలో వ్యాన్ సిద్ధం చేసి జెండా ఊపి కాకినాడ వైసీపీ కార్యాలయానికి తరలించడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మరియు ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ రాంజీ,కాకినాడ జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు రామకుర్తి శ్రీరామ చంద్ర మూర్తి,జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు కొప్పన శివనాథ్, గండేపల్లి ఎంపీపీ చల్లగళ్ల దొరబాబు ,జగ్గంపేట మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మరియు మండల,గ్రామ అనుబంధ కమిటీల సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమ బోర్డు పథకాల అమలుకై 12న జరిగే

# సదస్సును జయప్రదం చేయండి

**భవన నిర్మాణ కార్మికులకు పథకాల అమలపై ప్రభుత్వం పండగ లోపు తీపి కబురు తెలియజేయాలి....**

**ఏపీ బిల్డింగ్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్**



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్క్ స్ ఏఐటియుసి అనుబంధ సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు అమలుకే కాకినాడలో సాంబమూర్తి నగర్ రెవెన్యూ కాలనీ రోడ్ పి.ఆర్ భవన్లో డిసెంబర్ 12న శుక్రవారం ఉదయం జరిగే సదస్సును జయప్రదం చేయాలని, ఈ సదస్సుకు తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రిషన్లు, పెయింటర్లు, ప్లంబింగ్, వడ్రంగి తదితర రంగాల కార్మికులు హాజరు అవ్వాలని ఏపీ బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పిలుపు నిచ్చారు. బుధవారం ఉదయం కాకినాడలో నిర్మాణ రంగ కార్మికుల అడ్డాల వద్ద సదస్సు కరపత్రాలు పంపిణీ చేసి విస్తృతంగా వీర్ కమల్ సెంటర్, కరణం గారి సెంటర్, కొండయ్యపాలెం, దుర్గా నగర్, గుడారిగుంట, అయోధ్య నగర్, దుమ్ములపేట, గ్లాస్ హౌస్ సెంటర్,జై రామారావు పేట తదితర ప్రాంతాల కార్మికుల అడ్డాల వద్ద సదస్సు కోసం విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. దీనికి ముఖ్య అతిథి గా ఏపీ బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ క్లెయిమ్స్ 110 కోట్లు నిధులు ఉన్నాయని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు ఐదు కోట్ల రూపాయలు పైగా క్లెయిమ్స్ పెండింగ్లో ఉన్నాయని, భవన నిర్మాణ కార్మికులకు క్లెయిమ్స్ నిధులు మంజూరు చేయకుండా స్కిల్ డెవలప్మెంట్ పేరుతో 70 కోట్లు నిధులు కేటాయిస్తున్నా రని, ఎన్ని కోట్లు నిధులు కేటాయించిన స్థానికులకు పనులు కల్పించకుండా ఇతర రాష్ట్రాల వారికే పనులు కల్పిస్తున్నారని పథకాల అమలు చేయడంలో పాలకులు విఫలం చెందుతున్నారని ఆయన అన్నారు. వాడ దాటకముందు వాడ మల్లన్న వాడు దాటిన తర్వాత బోడి మల్లన్న అనే చందంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల రాకముందు భవన నిర్మాణ కార్మికులకు హామీ ఇచ్చిందని, భవన నిర్మాణ కార్మికుల ఓట్లతో గద్దెనెక్కి మాట మార్చుతున్నారని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కార్మిక శాఖ మంత్రికి ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసిన ప్రతిఫలం లేదని, కార్మిక శాఖ మంత్రి కి భజన చేసే ఆత్మగౌరవ సభలు ఎన్ని నిర్వహించిన ప్రయోజనం లేదని, ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధం కావాలని, పండగ లోపు భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అమలపై ప్రభుత్వం తీపి కబురు తెలియజేయాలని, లేదంటే పండగ తర్వాత భవన నిర్మాణ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కలిసి వచ్చిన సంఘాలన్నిటిని కలుపుకుని పథకాల అమలు చేసే వరకు ఉద్యమిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నమ్మి బాలకృష్ణ, సత్యనారాయణ, వినోద్ కుమార్, త్రినాధ్, సూరిబాబు, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.



## పిసి అండ్ పిఎన్డిటి యాక్టర్ ను ప్రతిష్టాత్మకంగా

# జిల్లాలో అమలు చేయాలి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి**

కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10పిసి అండ్ పి ఎన్ డి టి యాక్ట్ ను ప్రతిష్టంగా అమలు చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయం లోని వివేకానంద సమావేశం మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, పోలీస్ , స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, జిల్లా స్థాయి పీసీ అండ్ పీఎన్డీటీ సమన్వయ కమిటీ సమావేశంబుధవారం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు. కాకినాడ జిల్లా లో ఉన్న 159 స్కానింగ్ కేంద్రాలలో 280 ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని, అదేవిధంగా 48 స్కానింగ్ సెంటర్లో డెకాయిట్ ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్న పి.హెచ్.సి, సి.హెచ్.సి, సచివాలయం మరియు ప్రైవేటు స్కాన్ సెంటర్ ప్రైవేటు హాస్పిటల్ లలో పిసి అండ్ పిఎన్డిటి యాక్ట్ కు సంబందించి టోల్ ఫ్రీ నెంబర్ మరియు వాట్స్ యాప్ మొబైల్ నెంబర్ యొక్క స్టికర్ ను స్కాన్నింగ్ సెంటర్ / హాస్పిటల్ లో రిసెప్షన్ / వెయిటింగ్ హాల్ లో విధిగా ప్రదర్శించే లా చూడాలన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, జిల్లా స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్ల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. స్కాన్ సెంటర్స్ నిర్వహిస్తున్న డాక్టర్స్ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిస్తే పీసీ & పీఎన్డీటీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, స్కాన్ సెంటర్ ను సీజ్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో 4 నూతనంగా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు .రెండు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లలో నూతన మిషనరీ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడం జరిగిందని రెండు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లలో మిషనరీ చేంజ్ చేసేందుకు అనుమతి మంజూరు చేయడం జరిగిందని, మూడు అల్ట్రాసౌండింగ్ స్కాన్ కేంద్రాలలో ఎంప్లాయిస్ ని మార్చుకునేందుకు అనుమతిని జారీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఒక సంస్థలో నూతన ఎంప్లాయిస్ ను చేర్చుకునేందుకు అనుమతి మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పిండ లింగ నిర్ధారణ చట్టం పై ప్రతి గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తగా గర్భిణీ స్త్రీ గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జిల్లా లో చట్ట వ్యతిరేకం గా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాల సమచారము లేక నమోదు చేసి కానీ స్కానింగ్ కేంద్రాలు మరియు అర్హత లేని వైద్యులు వివరములు ఈ దిగువ టోల్ ఫ్రీ నెంబర్ (1800 425 3365 ) మరియు వాట్సాప్ నెంబర్ 9494113365 కు తెలియ చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో డి ఎం అండ్ హెచ్ ఓ జె .నరసింహ నాయక్ , కాకినాడ , ఎస్ బి డి ఎస్ పి కే. సత్యనారాయణ, జీజీహెచ్ సూపర్డెంట్ డా.జి. మెహర్ కుమార్, డిసిహెచ్ఎస్ డాక్టర్ కే. మహేశ్వరరావు, డి ఐ ఓ డా.కెవి సుబ్బారావు, పెద్దాపురం డివిజన్ సూపర్వైజింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ .ప్రశాంతి , జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి. నాగార్జున, జి జి హెచ్ రేడియాలజీ డాక్టర్ బి. అనురాధ, జి జి హెచ్ పీడియాట్రిక్ డాక్టర్ బి. రమేష్ బాబు, జిజిహెచ్ పెథాలజీ హెచ్ ఓ డి డా.ఆర్.సంజీవ స్వప్న, చేంజెస్ ఎన్జీవో నుండి కె. వెంకటేశ్వరరావు, ఎస్. అప్పలనాయుడు ఎన్జీవో సభ్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహ ముక్త్ భారత్ పై

# విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన

**జిల్లాలో బాల్యవివాహాలకు నిషేధ చట్టం పట్టిష్టంగా అమలు చేస్తాం...**

**కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రజల డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి**




కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల క్యాంపెయిన్ లో భాగంగా కాకినాడ జిల్లా, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో కాకినాడ ఐడియల్ డిగ్రీ కాలేజీలో బాల్య వివాహ ముక్త్ భారత్ పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్ లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త్ భారత్ క్యాంపెయిన్ నవంబర్ 27 నుండి మార్చి 16 తేది 2026 వరకు ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశం లో బాల్యవాహాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు వివాహ నిరోధ చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం, నేరమని తెలిపారు. బాల్య వివాహాల నుండి బాలలను కాపాడ వలసిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందని చెప్పారు . బాలలను స్నేహపూరిత వాతావరణం లో తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. బాలివివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, రక్షణ మరియు అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను కూడా దూరం చేస్తుంది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతీ ప్రయత్నం చేయాలన్నారు. బాల్య వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్ని అయినా పంచాయతీ మరియు ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి. హెచ్.వెంకట్రావు మాట్లాడుతూ ఎవరైనా బాల్యవివాహాలను ప్రోత్సహించిన సహకరించిన లేదా 18 సంవత్సరాలు అమ్మాయికి నిండకుండా 21 సంవత్సరాలు అబ్బాయికి వివాహం చేసిన బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం లేదా పోక్సో చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు . అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థిని విద్యార్థులతో ప్రతిజ్ఞ, మానవహారం చేయించడం జరిగినది. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన లేదా జరుగుతున్నట్లు చూసిన చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కి పోలీస్ నెంబర్ 112 లేదా ఉమెన్ హెల్ప్ లైన్ 181 కి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కామరాజు, జిల్లా బాలల పరిరక్షణ సంరక్షణ అధికారులు కె.శ్రీనివాసరావు ,జె విజయ, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ బి.కుమారి, బి.దుర్గారాణి, ం.చిన్నిబాబు, ఎం.సుధాకర్, దుర్గభవాని, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## నీటిపారుదల శాఖ మంత్రిని గెలిచిన గన్నవరం గ్రామస్తులు

### విలీన మండలాల సమస్యలు మంత్రికి వినతి

**ఎటపాక ( మనసులో మాట), డిసెంబరు 10:** అల్లూరి సీతారామ జిల్లా విలీన మండలాలలోని పోలవరం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలైన ఎటపాక మండలంలో ఇంకా పరిష్కారం కాని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలకు సంబంధించిన భూములు నివాస హక్కులు పునరావాస చర్యలపై బుధవారం ఎటపాక మండలం పరిధిలోని గన్నవరం గ్రామస్తులు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ని కలిసి వినతి పత్రం అందించారు. గన్నవరం ప్రాంతానికి చెందిన కరి వెంకట్రావు, కరి చిన్న శ్రీనివాసరావు,మాచినేని వెంకన్న మందలపు సత్యనారాయణ స్థానిక రైతులు ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ని అమరావతిలో ప్రత్యేకంగా కలిసి తమ సమస్యలను వినిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ కారణంగా తమ భూములు కోల్పోయినా ఇప్పటికీ పూర్తి స్థాయి పునరావాసం జరగలేదని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ భూసేకరణ భూ పరిహారం సౌకర్యాలు ఇంకా అమలు దశలోనే ఉన్నాయని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కుటుంబాలు స్థిరపడేందుకు ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి సమస్యలను సమనుకూలంగా స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూప్రభుత్వం పోలవరం నిర్వాసితుల సమస్యల పట్ల పూర్తి నిబద్ధతతో వ్యవహరిస్తోందని తెలిపారు. మీ ఆందోళనలు న్యాయమైనవే మీకు తగిన న్యాయం తప్పకుండా చేస్తాం అని భూసేకరణ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీల పంపిణీ పునరావాస చర్యలు వేగవంతం చేసే విధంగా సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తాను అని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మంత్రి స్పందనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, త్వరితగతిన పరిపాలన నిర్ణయాలు అమలు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా వినడం వాటి పరిష్కారానికి ముందడుగు వేయడం పట్ల స్థానిక ప్రజలు మంత్రి నిమ్మల రామానాయుడు విధానాన్ని అభినందిస్తున్నారు.



### పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకే

## మెడికల్ కాలేజీలు ప్రైవేటికరణ కుట్ర

### - వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



**కిర్లంపూడి (మనసులోమాట) డిసెంబర్ 10..** పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం కుట్ర పన్నడమే కాకుండా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి,జగన్ మోహన్ రెడ్డికి ప్రజల్లో మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేపట్టిందని ప్రత్తిపాడు నియోజక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆరోపించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణపై ముద్రగడ నివాసం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడగిరి బాబు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం రౌతులపూడి, మండలాలు ఏలేశ్వరం పట్టణంతోపాటు సుమారు 58 వేల 410 సంతకాలు సేకరించామన్నారు. సేకరించిన సంతకాలను మండల కన్వీనర్ ల సమక్షంలో కాకినాడ జిల్లా పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే విధంగా పరిపాలన సాగిస్తుందని విమర్శించారు. దానిలో భాగంగా వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. కోటి సంతకాల సేకరణకు సహకరించిన వైసిపి నాయకులకు, కార్యకర్తలకు ప్రజలకు ముద్రగడ గిరిబాబు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సేకరించిన సంతకాలు తరలించే వాహనానికి మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురామ్,తుని నియోజకవర్గ పరిశీలకుడు వాసిరెడ్డి జమీలు, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి. రాష్ట్ర వైసిపి యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవిందు, జెడ్పిటిసిలు గొల్లు చినదివాణం, బెహరా దొరబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి, మండలాలతో పాటు ఏలేశ్వరం రూరల్ మండలం వైసిపి అధ్యక్షుడు రామిశెట్టి నాని, గొల్లపల్లి సురేష్, నరాల శ్రీను, సిహెచ్ సత్యన్నారాయణ,శిగడం వెంకటేశ్వరరావుతోపాటు ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం నాణ్యతపై

## ఫుడ్ కమిషన్ దృష్టి

### పౌష్టికాహారం పంపిణీ లో లోపాలు సహించం - రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి. కాంతారావు





**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** ప్రజల పౌష్టికాహారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తున్న తరుణంలో, ఆ నిధుల ప్రయోజనం విద్యార్థులకు నిజంగా చేరేలా చూడటం తమ ప్రధాన బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ సభ్యులు బి. కాంతారావు స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా నగరంలో పలు రేషన్ షాపులను, ఇంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పంపిణీ వ్యవస్థ, వంటశాల, స్టాక్ రిజిస్టర్‌లను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు, అంగన్‌వాడి కేంద్రాలకు ప్రభుత్వం రూపకల్పన చేసిన మెనూ తోపాటు పౌష్టిక ప్రమాణాలకు తగ్గట్టుగా భోజనం అందించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో భారీ నిధులు విడుదల చేస్తుండగా, వాటిని సరైన విధంగా వినియోగించి విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికమైన ఆహారం అందించాల్సిన బాధ్యత సంబంధిత శాఖలదేనని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రత, మెనూ ఫాలో అవుతున్న తీరు పట్ల ఎలాంటి అలసత్వం సహించబోమని హెచ్చరిస్తూ పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలి. నాణ్యతా ప్రమాణాల్లో రాజీపడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు స్పష్టంగా తెలిపారు. పాఠశాలలో వంట శాల పరిశుభ్రత, భోజనం నాణ్యతపై ఆయన అధికారులు, సిబ్బందికి అనేక సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మిడ్డే మీల్స్‌లో నాణ్యత పెంపుతో పాటు పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో కాకినాడ రూరల్ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. ఈసాక్, ఫుడ్ డిపార్ట్ మెంట్ పి. వి గోపాల్, ఇన్స్పెక్టర్ సుబ్బారావు, కె వి వి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

### వైసిపి చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం

## ప్రజల నుండి అనూహ్య స్పందన

### - ఇప్పటికి 57812 సంతకాల పత్రాలు స్వీకరణ - మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** ప్రభుత్వ పేదల వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను తక్షణమే నిలుపుదల చేయాలంటూ చేస్తున్న సంతకాల సేకరణ ఉద్యమం కాకినాడలో హోరెత్తించింది. మాజీ సీఎం, వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు కాకినాడ సిటీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే , కాకినాడ సిటీ మేజర్ గా ఇంచార్జ్ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమం ముమ్మరంగా సాగింది. పార్టీ నాయకులు కార్యకర్తలు కాకినాడ నగరంలో ప్రజల వద్ద నుండి సేకరించిన 57,812 సంతకాల ప్రతులను స్వీకరించామని మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ నగరంలోని వైఎస్ఆర్సిపి కార్యాలయం నుండి కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో జిల్లా పార్టీ కార్యాలయానికి భారీగా బైక్ ర్యాలీతో తరలి వెళ్లారు. జగన్మోహన్ రెడ్డి చేసిన మంచి పనులు భూస్థాపితం చేయాలన్న చంద్రబాబు కుట్రతో 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని ద్వారంపూడి విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు కొనసాగు తున్నాయని ఆరోపించారు. మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణ వల్ల వాటికి అనుబంధంగా ఉండే బోధన ఆసుపత్రులలో పేదలకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందదని చెప్పారు. ఇంకా రోగనిర్ధరణ అలాగే ఇన్ పేషెంట్ మెడిసిన్స్ కి చార్జ్ చేస్తారని ఆరోపించారు. ఇదిలా ఉండగా మరో వైపు రాష్ట్రం పెద్ద సంఖ్యలో పేద మధ్య తరగతి విద్యార్థులు మెడికల్ సీట్లు కోల్పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం ఒక చరిత్రగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం పి.పి. పి పేరిట డ్రామాలు ఆడుతోందని ప్రజలకు అర్థమైందని వివరించారు. వైయస్ జగన్ ప్రభుత్వం హయాం లోనూ 7 మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తికాగా అయిదు కాలేజీలో అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి అని చెప్పారు. మరో 10 కాలేజీల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నట్లు వెల్లడించారు. వైయస్సార్సీపి ప్రభుత్వం దిగిపోయేసరికి వాటిలో దాదాపు రూ. 3 వేల కోట్ల విలువైన పనులు జరిగినట్లు పేర్కొన్నారు. కొత్త మెడికల్ కాలేజీల కోసం ఏటా రూ. 1000 కోట్లరూపాయల వంతున అయిదు ఏళ్ళు వ్యయం చేస్తే చాలని, కానీ ప్రభుత్వం ఆ దిశలో ఆలోచన చేయకుండా, పి. పి. పి పేరుతో ప్రైవేటీకరణ పై ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ఆయన ధ్వజమెత్తారు. వీటన్నిటి నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలు కూడా పూర్తిచేసి అన్నిటిని ప్రభుత్వం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసాన్నసాగర్, మాజీ కూడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి కుమార్, నల్లబెల్లి సుజాత, పసుపులేటి వెంకటలక్ష్మి, శంకర్, రాంబాబు, కార్పొరేటర్లు బన్నీ, కంప్ర బాబి, సంఘాని నందం, అజ్జు, అల్లి రాజబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు













## మానవ హక్కులు వర్ధిల్లాలి!

**పల్నాడు, డిసెంబర్ 10 (మనసులో మాట):** ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం అమరావతి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అమరావతి మండల తహసిల్దార్ డానియల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పల్లోటి జూనియర్ కాలేజీ నుండి ప్రారంభమై గాంధీ బొమ్మ సెంటర్ నుండి తిరిగి గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ వరకు మానవ హక్కుల వర్ధిల్లాలి భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి మహిళలపై, దళితులపై, అణగారిన వర్గాలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసలకు, దోపిడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో పల్లోటి కాలేజ్ డైరెక్టర్ ఫాదర్ బెజ్జం కిషోర్ రాజ్. అమరావతి ఎస్సై రాజశేఖర్. సంస్థ కోఆర్డినేటర్ సిస్టర్ యాంటో, సిస్టర్ డియానా, సిస్టర్ స్మిత, లక్ష్మణ్ సంస్థ సిబ్బంది పల్లోటి జూనియర్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు అగస్తిన్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు గ్రామ పెద్దలు ర్యాలీలో పాల్గొన్నారు.

### క్రోసూరు ఐసిడిఎస్ కార్యాలయ మార్పు పై

## ఎమ్మెల్యేకు వినతిపత్రం



పల్నాడు, డిసెంబర్ 10, (మనసులో మాట): పౌర మానవ హక్కుల స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కార్యదర్శి చిర్రా రాజేష్ కుమార్ బుధవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కు వినతిపత్రం అందజేశారు. క్రోసూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న 75 తాళ్లూరు నుంచి క్రోసూరు మండల కేంద్రానికి మార్చి, అక్కడే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ, ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ జరిపించి, అవసరమైన ఆదేశాలు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఫండమెంటల్ లీగల్ రైట్స్ కన్స్యూమర్ స్టేట్ వైస్ చైర్మన్ రాంబాబు పాల్గొన్నారు.

### జిల్లా పార్టీ కార్యాలయానికి చేరిన అనపర్తి నియోజకవర్గ

## కోటి సంతకాల సేకరణ పత్రాలు



**అనపర్తి (మనసులో మాట) డిసెంబర్ 10:** రాజమండ్రి రూరల్ – బొమ్మూరు ప్రాంతంలో ఉన్న తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి, అనపర్తి నియోజకవర్గం నుండి సేకరించిన “కోటి సంతకాల సేకరణ పత్రాలు” చేరాయి. అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, “ప్రజా ఉద్యమం – కోటి సంతకాల సేకరణ” ఉద్యమానికి అనపర్తిలోని అన్ని వర్గాల ప్రజల నుండి విశేష స్పందన లభించిందని తెలిపారు. పార్టీ శ్రేణులు నిరంతరం శ్రమించి, ఈ ఉద్యమాన్ని విజయవంతం చేసినందుకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనపర్తి నియోజకవర్గం నుండి 60,129 సంతకాలు సేకరించామని ఆయన తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రజా ఉద్యమంలో భాగంగా, అనపర్తి నియోజకవర్గంలో సేకరించిన కోటి సంతకాల సేకరణ పత్రాలను, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఎమ్మెల్యే జిల్లా పార్టీ అధ్యక్షులు బొమ్మూరు లో ఉన్న తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ కి అందజేశారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

## అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్న మాణిక్యం విచ్చేసి, విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవుడు స్వతంత్రంగా జీవించి, తన మనుగడ కాపాడుకోవడానికి మానవ హక్కులు ఊతమిస్తాయన్నారు. ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ ఎలాంటి వివక్షకు గురికాకుండా సమాన హక్కులతో జీవించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1948 డిసెంబర్ 10 తేది న పారిస్ వేదికగా ప్రపంచంలోని దేశాలన్నీ ఓ ఒప్పందంపై సంతకం చేసినప్పటి నుండి డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఎస్. అప్పనమ్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగం భారత ప్రజలకు ఆరు ప్రాథమిక హక్కులను ప్రసాదించడం జరిగిందన్నారు. ఆ హక్కులకు భంగం కలిగినప్పుడు పౌరులు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డా. వై. పద్మ, డా. కె. శకుంతల, జి. హారతి, కే. శైలజ, ఆర్. మౌనిక, బి. శ్రీనివాస్ రావు, ఎన్. ఆనంద్, కె. కీర్తి, ఆర్. కిరణ్మయి తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# ఐవీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- క్షేత్రస్థాయి లోపాలు, ఫిర్యాదు లేకుండా చర్యలు తీసుకోవాలి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు ఐవీఆర్ఎస్‌పై అందుతున్న స్పందనను సమగ్రంగా విశ్లేషించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ ఆదేశించారు. తిరిగి ఫిర్యాదులు రాకుండా క్షేత్ర స్థాయిలో సేవల మెరుగుదలపై దృష్టిపెట్టాలన్నారు. అన్నదాత సుఖీభవ, నేను కర్మయోగిని, ఫిర్యాదుల పరిష్కారం, స్వామిత్వ, పన్నుల వసూళ్లు, హాస్టల్ సదుపాయాలు, గృహ నిర్మాణం, చట్టపరమైన కేసులు వంటి అంశాలపై బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ తహసీల్దార్ల పనితీరుపై ఇకపై ప్రదర్శన సూచికల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రెవెన్యూ సేవలు సమయపాలన ఖచ్చితంగా మార్గదర్శకాలు అనుసరించి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపించాలన్నారు.

రెవెన్యూ సంబంధిత సేవల్లో ఆలస్యం అనుమతించబోమని హెచ్చరించారు. మ్యుటేషన్ దరఖాస్తులు నిర్ణీత గడువులో పరిష్కారం కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నల్లజర్ల మండలంలో వీఆర్ఓ, రెవెన్యూ అధికారి, తహసీల్దార్ లాగిన్‌లలో ఉన్న పెండింగ్ అర్జీలను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. దిగువ స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం పెరిగితే తహసీల్దార్ బాధ్యతగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. అవసరమైన చోట సాంకేతిక సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుక్షోలని సూచించారు.

**ధాన్యం సేకరణలో పారదర్శకత తప్పనిసరి..**

ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ క్షేత్రం స్థాయి అధికారులు, మండల స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోనె సంచులు, రవాణా, కొలతలు, చెల్లింపులు వంటి అన్ని అంశాల్లో పారదర్శక వ్యవస్థ ఉండాలని, ప్రతి సమాచారం రైతులకు, మీడియాకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎరువుల అందుబాటుతో పాటు ధాన్యం సేకరణ ప్రక్రియపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. రైతుల సంతృప్తి స్థాయిని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అలక్ష్యం లేకుండా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండరాదు.. :డీఆర్వో**

ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) పై వచ్చే ప్రతి దరఖాస్తును సమయ పాలనతో పరిష్కరించాలని డీఆర్వో టీ సీతారామమూర్తి ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది అప్‌డేట్లు ఇవ్వకపోవడం వల్ల జిల్లా స్థాయికి సరైన సమాచారం అందడం లేదన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే నమోదుచేసి, ధృవీకరించి, వెంటనే ఫీల్డ్ స్థాయిలో స్పందన చూపాలని సూచించారు. ఒక ఫిర్యాదు రెండు సార్లు వస్తే, అది సంబంధిత అధికారి పనితీరుపై ప్రతిబింబిస్తుందని హెచ్చరిస్తూ, అలస్యానికి భాధ్యులు ఎవరో గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా సేవల నాణ్యతను పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యం కావాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె భాస్కర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు.

ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి

# ఇసుక కమిటీ పటిష్ట చర్యలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**



**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 10:** ఉచిత ఇసుక పాలసీ విధా నాన్ని ఇసుక కమిటీ పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కమిటీ చైర్మన్ ఆర్ మహేష్ కుమార్ అధ్యక్షతన కమిటీ సభ్యులతో నిర్వహించి ఉచిత ఇసుక పాలసీ టెండర్ల ప్రక్రియ అంశాలు కొత్త ఇసుక రీచ్లు అప్రూవల్, కొత్త ఇసుక రీచులకు టెండర్ నోటిఫి కేషన్ జారీ పలు అంశాలపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సెమీ మేకనైజడ్ నాలుగు రీచ్ లకు టెండర్లు ప్రక్రియ ఈ నెల 12 నుండి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వీటిలో మెర్ల పాలెం,కపిలేశ్వరపురం ఆలమూరు, జొన్నా డ రీచులు ఉన్నాయన్నారు. టెండర్ దార్ల నియమ నిబంధనలు అర్హతలు, సాంకేతిక క్యాబులిటీ, వార్షిక ఆదాయ విధానాలు లైసెన్సులు వాటిపై సమీక్షించి తగు సూచ నలు చేశారు. స్టాక్ యార్డ లీజు అంశాలపై తాహసిల్దార్లతో సర్టి ఫికేషన్ చేయించాలని సూచిం చారు. అదేవిధంగా లీజుదారుల నో అబ్జెక్షన్ ధ్రువపత్రాలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహనానికి జిపిఎస్ కో ఆర్డినేట్స్ ఉండాలన్నారు ఏటిగట్లపై ఇసుక లోడుతో రాకపోకలు రవాణాను నిర్వహించకుండా జల వనరుల శాఖ నిఘా ఉంచాలని, ప్రయాణం తగ్గుతుందనే ఉద్దేశంతో ఏటిగ ట్లపై ఇసుక లోడుతో రాకపోకలు సాగిస్తారని తద్వారా ఏటిగట్లు బలహీనపడే అవకాశం ఉంటుం దన్నారు. ప్రతిపాదిత నిర్దేశిత మార్గాలలోనే ఇసుక రవాణా జిపిఎస్ కోఆర్డినేట్స్ తో నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్లు బ్రిడ్జిలు వంతెనలు కండిషన్స్ ప్రకారం మాత్రమే వాహనాలు రాకపోకలు నిర్వహించాలన్నారు. ఈ నెల 12వ తేదీన ఈ నాలుగు రీచులకు టెండర్లు స్థానిక కలెక్టరేట్ జిల్లా జాయింట్ కలెక్టర్ వారి ఛాంబర్ నందు ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందని ఈనెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు టెండర్లు దాఖలు చేయవచ్చునని 18 వ తేదీ టెండర్లు పరిశీలన అనం తరం అర్హత సాధించిన టెండర్ దారుల పేర్లతో తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా గనులు భూగర్భ శాఖ ఎల్ వంశీధర్ రెడ్డి, గోదావరి హెడ్ వర్క్స్ కార్య నిర్వాహక ఇంజనీర్ జి శ్రీనివాస్, జిల్లా రవాణా అధికారి డి శ్రీనివాసరావు, జి ఎస్ డబ్ల్యూ ఎస్ కో ఆర్డినేటర్ సువిజయ్ జిల్లా గ్రామీణ త్రాగునీటి సరఫరా పారిశుద్ధ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఏవీఎస్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు అఖిల భారత మహాసభలకు

# జనవరి 4 చలో విశాఖ...

**- డిసెంబర్ 15 కార్మికుల ఇండ్లపై అరుణ పతాకావిష్కరణ**

**- జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం పిలుపు**



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 10..** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) అఖిలభారత 18 వ మహాసభలు 2025 డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న నేపథ్యంలో జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ జనవరి 4 తేదిన చలో విశాఖ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు బుధవారం పిలుపు నిచ్చారు. శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్. విజయకుమార్ అధ్యక్షతన జిజిహెచ్ ప్రాంగణంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మల్కా వెంకటరమణ మాట్లాడుతూ 1970 లో సిఐటియు ఏర్పడిందని, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2000 సంవత్సరంలో హైదరాబాదులో మహాసభ జరిగిందన్నారు. ప్రస్తుతం 18 వ అఖిలభారత మహాసభలు విశాఖ నగరంలో జరుగుతున్నా యన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ లేబర్ కోడ్ లు తీసుకొచ్చిందన్నారు. కార్మిక హక్కుల రక్షణ, చట్టాల పరిరక్షణకై ఈ మహాసభల్లో చర్చించి కార్యాచరణ రూపొం దించడం జరుగుతుందన్నారు. పలివెల వీరబాబు మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభల నేపథ్యంలో డిసెంబర్ 15వ తేదీన ప్రతి కార్మికుడు తమ ఇంటిపై అరుణ పతాక ఆవిష్కరణ చేయాలన్నారు. కార్మికుల నివాస ప్రాంతాలలో సిఐటియు మహాసభల గురించి ప్రచారం నిర్వహించాలన్నారు. సంఘాల్లో లేని కార్మికులను సంఘటితం చేయాలని సిఐటియు పిలుపు ఇస్తోందన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు జె. శేషు, ఆర్. రమేష్, ఎం. ఏసు, ఎస్. వాసు, జి. కళ్యాణ్, బి. కృష్ణవేణి, బి. మంగతాయారు, డి. శారద, బి .శ్రీకాంత్, డి. దుర్గాప్రసాద్, ఎం. రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ




**గొల్లప్రోలు (మనసులో మాట) డిసెంబర్ 10:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) 25 వ మహాసభలను జయప్రదం చేయాలని గొల్లప్రోలు మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్.ఎఫ్.ఐ నాయకులు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ గొల్లప్రోలు మండల కార్యదర్శి వడ్డికాసులు మాట్లాడుతూ... ఈ నెల 12, 13, 14 తేదీలలో ఎస్.ఎఫ్.ఐ 25 వ రాష్ట్ర మహాసభలను తిరుపతిలో జరుపుతున్నారని, ఈ మహాసభలు విద్యారంగంలో ఉన్న సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించడానికి ఉపయోగ పడతాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ వెయ్యకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు పెడుతుంది అన్ని, అలాగే కాలేజీలు ఫీజులు కట్టమని విద్యార్థులపై ఒత్తిడి కూడా తెస్తున్నాయని, స్త్రీ శక్తి పథకం పెట్టిన తర్వాత విద్యార్థులు బస్సుల్లో ప్రయాణించాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారని , విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచాలని, విద్యార్థులకు ప్రత్యేకంగా బడి బస్సు నడపాలని ఎస్.ఎఫ్.ఐ నాయకులు వడ్డి కాసులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ గొల్లప్రోలు మండలం కార్యదర్శి వడ్డికాసులు, కళాశాల నాయకులు సంతోష్,చరణ్, వినయ్ ,నవీన్, సిద్దు, రాజి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పిఠాపురంలో గర్జన

# 50 వేల సంతకాలు సేకరణ



**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు10:** ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ మోడల్ లో ప్రైవేటీకరించే కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టింది. పిఠాపురం నియోజకవర్గంలో సేకరించిన 50 వేల సంతకాల ప్రతులను జిల్లా కార్యాలయానికి బుధవారం తరలింపు కార్యక్రమం ఇన్ ఛార్జి వంగా గీత విశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగింది. పిఠాపురం నియోజకవర్గంలో ప్రజల నుంచి విశేషణ స్పందన లభించిందన్నారు. పిఠాపురం లో 50వేల మంది ప్రజలు సంతకాలు చేసి ప్రభుత్వ నిర్ణయానికి తమ వ్యతిరేకతను తెలిపారని వంగా గీతా విశ్వనాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను పేద ప్రజలు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని దూరం చేసే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా సేకరించిన ఈ సంతకాలను డిసెంబర్ 10లోగా జిల్లా కార్యాలయాలకు చేరవేయాలని పార్టీ అధిష్టానం ఇప్పటికే ఆదేశించిందని సేకరించిన మొత్తం సంతకాలను డిసెంబర్ 17న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ కి సమర్పిస్తారని తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన 17 మెడికల్ కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టే ప్రయత్నాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# కుక్కుటేశ్వరునికి కానుకలు వెల్లువ

**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 10:** దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం పిఠాపురం శ్రీ రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి వారి దేవస్థానం (పాదగయా) లో హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. గత 68 రోజులకు గాను భక్తులు సమర్పించుకున్న కానుకలను దేవస్థాన అధికారులు లెక్కించారు. ఈ లెక్కింపులో ఆలయ హుండీల ద్వారా 23, 32,155 రూపాయలు రాగా అన్నదానం హుండీ ద్వారా 1,41,215 వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాసు వెల్లడించారు. మొత్తం కలిపి 24,73,370 రూపాయల ఆదాయం సమకూరిందని ఆయన తెలిపారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు కనపర్తి నాగేశ్వరరావు ఇన్స్పెక్టర్ వడ్డీ ఫణీంద్ర కుమార్ల ఆధ్వర్యంలో ఈ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవా భక్త బృందం, బ్యాంక్ అధికారులు, పోలీస్ రెవెన్యూ సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు పేర్కొన్నారు

# రబీ పంటకు యూరియా కొరత లేదు

**రైతులు ఎటువంటి వదంతులను నమ్మవద్దు ఎమ్మెల్యే నల్లమిల్లి**



**అనపర్తి (మనసులో మా డిసెంబర్ 10:** బిక్కవోలు సొసైటీ లో రబీ పంటకు యూరియా కొరత వస్తుంది అని రైతులలో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో రైతులు,వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమైన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ సమావేశంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఈరోజు ప్రభుత్వం రైతుకు అన్ని విధాలుగా సహకరిస్తూ ముందుకు వెళుతుంది, అయితే గత 20 రోజులుగా యూరియా కొరత వస్తుంది అనే ఆందోళన రైతుల్లో నెలకొంది. ఒక అపోహ రైతుల్లో ప్రబలి ఒకరినొకరు యూరియా కొరత వస్తుంది అని అప్రమత్తం చేసుకోవడంతో రైతులందరూ ఒకేసారి యూరియా తీసుకోవడానికి రావడంతో, కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీనిని ఆసరాగా తీసుకొని వైసిపి నాయకులు మరింత గందరగోళం సృష్టించడానికి ప్రయత్నాలు చేశారు. వాస్తవానికి ఈరోజు రబీ సీజన్ కు సంబంధించి ప్రభుత్వం దగ్గర అదనంగా నిల్వలు ఉన్నాయి తప్ప, ఎటువంటి యూరియా గానీ, ఎరువుల కొరత గానీ లేదు. ఈ సీజన్ కు సంబంధించి వరి రైతులు ఒక్కో ఎకరాకు నాలుగు బస్తాలు వాడుతారు. ఆ నాలుగు బస్తాలు మూడు దఫాలుగా వాడుతారు. మూడు దఫాలుగా రైతులకు యూరియా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఒక్క బిక్కవోలు మండలం తీసుకుంటే 2600 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా, అంతా సరఫరా చేస్తాము ఎటువంటి కొరత ఉండదు. ఆందోళన నేపథ్యంలో ఒకేసారి రైతులంతా రావడం ఇక్కడ ఈపాస్ రిజిస్టర్ చేయాల్సి రావడంతో అదనంగా సమయం పట్టడంతో రైతులలో కొంత ఆందోళన వచ్చింది. రైతాంగానికి పదేపదే విజ్ఞప్తి చేసేది ఒకటే ఎక్కడా యూరియా కొరత అనేది రాదు. ధాన్యం కొనుగోలు ఎంత సక్రమంగా చేస్తున్నాము ధాన్యం సిఎంఆర్ కు నమ్మిన రైతుకు ఐదు గంటల్లో సొమ్ము జమ చేసేలా చేసాము చేసాము అదేవిధంగా యూరియా కూడా అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఏఎంసీ చైర్మన్, బిక్కవోలు సొసైటీ అధ్యక్షులు,బిక్కవోలు మండల కూటమి నాయకులు, బిక్కవోలు గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు,రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అల్లవరం పోలీస్ స్టేషన్ రికార్డులను తనిఖీ చేసిన

# అమలాపురం డిఎస్పి ప్రసాద్



**అమలాపురం (మనసులోమాట) డిశంబరు 10:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం పోలీస్ స్టేషన్ రికార్డులను వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం అమలాపురం డి ఎస్ పి టి.ఎస్.ఆర్ కె ప్రసాద్ తనిఖీ చేసారు. సందర్భంగా రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందినిదేశించి డిఎస్పి మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు హెల్మెట్ ఉపయోగించేలా వాహన దారులకు అవగాహన కల్పించాలని,ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాసింజర్లను ఎక్కించకుండా,వాహన ప్రమాదాలు జరగకుండా చర్యలు తెలుసుకోవాలని,గంజాయి,సైబర్ నేరాలు,డ్రగ్స్ వంటి వాటిపై ఉక్కుపదం మోపాలని ఎస్ ఐ డి.సంపత్ కుమార్ కు పలు సూచనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ డి.ప్రశాంత్ కుమార్,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## ముగ్గురు మోటార్ సైకిళ్ళ దొంగలను అరెస్టు చేసిన

# 'తూర్పు' పోలీసులు

- 29 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- రికవరీ చేసిన మోటార్ సైకిళ్ళ విలువ సుమారు రూ.17.4 లక్షలు
- మీడియాకు వివరాలు వెల్లడించిన డీఎస్పీ వై శ్రీకాంత్





**రాజమహేంద్రవరం క్రైమ్ (మనసులో మాట), డిసెంబరు 10:** స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజమహేంద్రవరం, చుట్టు ప్రక్కల ప్రాంతాలలో మోటార్ సైకిల్స్ ఎక్కువగా చోరీకి గురవుతుండటంతో తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ వై శ్రీకాంత్ ఉత్తర్వుల మేరకు నగరంలోని త్రీ టౌన్ (లా అండ్ ఆర్డర్) పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వీ అప్పారావు పర్యవేక్షణలో నిఘా వేశారు.

ఎస్ఐ ఎండీ జుబేర్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ హెచ్సీలు వీ కృష్ణ, ఎన్ వెంకట రామయ్య, ఎస్ చంద్రశేఖర్, పీసీలు బీ విజయ్ కుమార్, కే పవన్ కుమార్, ఆర్ సుబ్రహ్మణ్యం లు బుధవారం స్థానిక క్వారీ సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో సుమారు 25- 30 సంవత్సరాల వయస్సు గల యువకుడు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అనుమానం వచ్చిన పోలీసు సిబ్బంది అతడిని పట్టుకుని విచారించారు. దీంతో మోటార్ సైకిళ్ళ గుట్టురట్టయింది. తన పేరు సబ్బు వీరబాబు అని అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరిపేట గా తెలిపాడని డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించటంతో అమ్మమ్మ వద్ద ముద్దాయి ఉంటున్నాడు.

రాజమహేంద్రవరంలో పుష్కర ఘాట్ వద్ద మహాదేవ హోటల్లో నైట్ బాయ్ గా పనిచేస్తూ, పగటి సమయంలో వెల్డింగ్ పనులకు వెళ్తున్నాడు. అతడికి మోటార్ సైకిల్ లేకపోవడంతో ఒక రోజు రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద మోటార్ సైకిల్ వుండగా దానిని అతని వద్ద వున్న మారు తాళంతో ప్రయత్నించగా వచ్చేసింది. దానిని కొంతకాలం వాడుకుని ఆ తరువాత అతడి స్నేహితులు కోసూరి పవన్ కుమార్, జర్గాని అప్పన్నలతో మాట్లాడి పాత మోటార్ సైకిల్స్ తన వద్ద వున్నాయని, కొనుగోలు చేస్తారా అని అడుగడం.. వారు సరే అనడంతో వారికి రాజమండ్రి పుష్కర్ ఘాట్, కోటగుమ్మం, మల్లయ్యపేట, సుబ్రహ్మమణ్య మైదానం, లాలా చెరువు రోడ్డు, ఇస్కాన్ గుడి, ఆత్రేయపురం మండలం వాడపల్లి పరిసర ప్రాంతాలలో మోటార్ సైకిళ్ళు దొంగతనం చేశాడు. అలా దొంగతనం చేసిన మోటార్ సైకిళ్ళ కు సంబంధించి కొంత నగదు తీసుకుని కొయ్యూరు మండలం మటం భీమవరానికి చెందిన కోసూరి పవన్ కుమార్, గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన జార్గాని అప్పన్నలకు విక్రయించాడు. కాగా వీరబాబు దొంగిలించబడిన మోటార్ సైకిళ్ళ పై రాజమహేంద్రవరం 3 టౌన్ (లా అండ్ ఆర్డర్) పోలీస్ స్టేషన్, 2 టౌన్ (లా అండ్ ఆర్డర్) పోలీస్ స్టేషన్, ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదు అయ్యాయి. బుధవారం ముద్దాయిని అరెస్ట్ చేశామని, రిమాండ్ రిపోర్ట్ తో కోర్టులో హాజరు పరుస్తామని రాజమండ్రి సెంట్రల్ జోన్ డీఎస్పీ వై శ్రీకాంత్ తెలిపారు. ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డీ నరసింహ కిశోర్ అభినందించారు. ప్రజలు తమ బైక్ లకు, వీల్ లాక్లు, జీపీఎస్ లు పెట్టుకోవాలని, తగు జాగ్రతలు తీసుకోవలసిందిగా ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు.

## రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్‌లో

# ఇన్డిగో విమానాలు సాధారణంగా తిరిగి ప్రారంభం

- ఏపీడీ ఎన్ కే శ్రీకాంత్




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్, ఇండియాన్ అథారిటీ అధికారులు అందిస్తున్న సమాచారం ప్రకారం ఇన్డిగో విమానాల కార్యకలాపాలు సాధారణ స్థితికి తిరిగి వచ్చాయని ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ ఎన్ కే శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎయిర్‌పోర్ట్ నుండి రోజు వారీగా మొత్తం 10 షెడ్యూల్ ఫ్లైట్‌లు ఉంటాయని, ప్రస్తుతం 9 ఫ్లైట్‌లు సాధారణంగా ఆపరేట్ అవుతున్నాయన్నారు. అయితే ఢిల్లీ రాజమహేంద్రవరం- దేళు రూట్ 6ఈ-0364/0363 విమానం ఆపరేషన్ పరిమితుల కారణంగా ఈ నెల 11 వరకు రద్దు చేయబడినట్లు ఎయిర్ లైన్ ద్వారా సమాచారం అందిందన్నారు. అలయన్స్ ఎయిర్ ద్వారా తిరుపతి రూట్‌లో ఆపరేషన్లు షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో అన్ని కార్యకలాపాలు సజావుగా కొనసాగుతున్నాయని, విమానాశ్రయ అధికారి ఎయిర్లైన్స్‌తో సమన్వయం కలిగి ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ అధికారులు ప్రయాణికుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికులకు భద్రత, సమర్థత, సజావుగా సేవలు అందించడంలో కట్టుబడినట్లు రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎన్ కే శ్రీకాంత్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# తుది అంకానికి చేరుకున్న వైసీపీ కోటి సంతకాల సేకరణ






**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కు వ్యతిరేక ఉద్యమంలో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తూర్పు గోదావరి జిల్లాలో చేపట్టిన కోటి సంతకాల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. జిల్లా స్థాయిలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతకాల ప్రతులు బుధవారం రాజమండ్రి రూరల్ బొమ్మూరు వైసీపీ కార్యాలయానికి చేరుకున్నాయి. జిల్లాలో మొదటి స్థానం రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి 70 వేల సంతకాలు సేకరించినట్టు వేణు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల మందికి పైగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాలు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తం అవుతోందని చెల్లుబోయిన తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి తానేటి వనిత, జక్కంపూడి రాజా, గెడ్డం శ్రీనివాస నాయుడు, తకారి వెంకట్రావు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, పార్లమెంట్ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, చందన నాగేశ్వర్, నక్కా నగేష్, గొందేశి శ్రీనివాస రెడ్డి, నక్కా రాజబాబు, గిరజాల బాబు సహకరించినట్టు తెలిపారు. కాగా రాజమండ్రి సిటీ నియోజకవర్గం పరిధిలో 40 వేల సంతకాలను సేకరించామని, మరో పది వేల సంతకాలు సేకరించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్టు మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఇప్పటి వరకూ సేకరించిన సంతకాల ప్రతులను జిల్లా పార్టీ కార్యాలయానికి పంపినట్టు ఆయన తెలిపారు. ఈ నెల 16న రాష్ట్ర గవర్నర్ ని కలిసి మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ ఆపాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, విద్యార్థులు కోరనున్నట్టు తెలిపారు.







## రైతులను ఆదుకోవాలని

# పిఠాపురంలో సిపిఐ ధర్నా

**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 10:** కాకినాడ జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యూరియా కొరతతో పిఠాపురం నియోజకవర్గ రైతులు సతమతమవుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద సిపిఐ రైతు సంఘం సంయుక్తంగా నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ బిల్లు రద్దు చేయాలన్నారు. సిడి బిల్లు మసాయిదాపై జాతీయ రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు రైతు మార్కెట్ కమిటీలు వ్యవసాయ రంగ నిపుణులతో చర్చించి వారి సలహా సూచనలు పరిగణలోకి తీసుకుంటూ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఠాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు స్వాతికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ధాన్యం పత్తి మొక్కజొన్న పంటలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనసులు కలిపి కొనుగోలు చేసేందుకు రైతులను ఆర్థికంగా స్థిరపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ ధరలు పడిపోయిన అరటి,బత్తాయి, నిమ్మ, కొబ్బరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కే బోడకొండ,సహాయ కార్యదర్శి తోకల ప్రసాదు, నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ నక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యాభివృద్ధిలో

# తరగతి పరిశీలన అత్యంత కీలకం

- డీఈఓ వాసుదేవరావు - ముగిసిన టీచ్ టూల్ శిక్షణా తరగతులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** పాఠశాల విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంలో దోహదపడే తరగతి పరిశీలన చిత్తశుద్ధితో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు సూచించారు. గత రెండు రోజులుగా స్థానిక దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో జరుగుతున్న సీఆర్ఎంటీ లు, ఉపాధ్యాయుల "టీచ్ టూల్ అబ్జర్వేషన్ శిక్షణా" తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల కృషిని పరిశీలిస్తూ వారి విద్యా బోధనను అభినందిస్తూ, సవరణలను సూచిస్తూ, పరిశీలన చేయాలని ఆయన కోరారు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు సూచనలు చేశారు. తరగతి గది పరిశీలన ద్వారా లోటుపాట్లను సవరించుకుని తరగతి గది, బోధనా ప్రగతికి సూచనలు చేయడంలో సమన్వయం పాటిస్తూ పరిశీలన చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారిణి ఎస్ సుభాషిణి కోరారు. ఈ రెండు రోజుల శిక్షణా తరగతులలో జిల్లా వ్యాప్తంగా 75 మంది సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డీ గౌరీశంకర్రావు తెలిపారు. సీఆర్ఎంటీల వృత్తి నైపుణ్యంతో పాటు, టీచ్ టూల్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెండు రోజులుగా పలు సూచనలు, జాగ్రత్తలు, తగు శిక్షణాంశములు తెలిపిన అధికారులకు, శిక్షకులకు సీఆర్ఎంటీల జిల్లా అధ్యక్షుడు ఎం రఘునాథ్, కార్యదర్శి డీ సతీష్ బాబులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఐఈఆర్టీ కో ఆర్డినేటర్ ఎన్ కనకబాబు, సీఎంఓ కే శ్రీనివాసరావు, జీసీడీఓ ఎస్తేరు రాణి, టీచ్ టూల్ జిల్లా పరిశీలన సమన్వయకర్త కే వేణు, అసోసియేట్ సమన్వయకర్త ఆశిక్ అలీ, డీఎంహెచ్ స్కూల్ హెచ్ఎం ఎస్ రవికుమార్, మాస్టర్ ట్రైనీ లు పీ రమేష్ బాబు, ఎన్ శ్రీనివాస్, కే లక్ష్మణరేఖ, టీ ప్రవీణ్, సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 21న పల్స్ పోలియో కార్యక్రమం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 10:** పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆనం కళాకేంద్రంలో వైద్య సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే వెంకటేశ్వరరావు ఆదేశాలు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 0%-%5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం కోసం సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 1,89,550 మంది పిల్లలు లక్ష్యంగా గుర్తించగా, ఈ కార్యక్రమం కోసం 1,084 పోలియో బూత్‌లు, 62 ట్రాన్సిట్ టీంలు, 53 మొబైల్ టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 4,566 మంది టీం సభ్యులు, 116 మంది సూపర్వైజర్లు, 10 మంది మానిటరింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ బీ శ్రీదేవి నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు స్త్రీ%-%శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, పురపాలక తదితర శాఖలు, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. హై రిస్క్ ప్రాంతాల్లోని పిల్లలకు ప్రత్యేక మొబైల్ టీంల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. ప్రయాణంలో ఉన్న వారికి ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజలందరూ సహకరించి పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వీ షమ్మి కుమార్, వివిధ పీహెచ్సీ, యూపీహెచ్సీల మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# పలమనేరు మార్కెట్ అభివృద్ధికి సహకరించండి

## సీఎం, మంత్రిని కలసి విన్నవించిన - ఏఎంసి చైర్మన్ రాజన్న



పలమనేరు డిసెంబర్ 10 ( మనసులో మాట):పలమనేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి సహకరించాలని స్థానిక శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సూచన మేరకు ఏఎంసి చైర్మన్ రాజన్న ముఖ్యమంత్రి చంద్రబాబును, వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడును మంగళవారం సాయంత్రం కలసి విన్నవించారు. పలమనేరులో ప్రస్తుతం ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గా అభివృద్ధి చేసేందుకు నిధులను మంజూరు చేసి సహకరించాలని విజయవాడలో వారిని కలసి కోరారు. ఇక్కడి మార్కెట్ లో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉండడం కారణంగా స్థానిక రైతులు అధిక శాతం తమ వ్యవసాయ ఉత్పత్తులను కర్ణాటక మార్కెట్ కు తరలిస్తూన్నారని వివరించారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ ఏర్పాటుతో చెన్నై - బెంగుళూరు నగరాలకు రైతులు తమ పంటలను ఎగుమతి చేసుకొనే వెసులుబాటు ఉంటుందని, దీంతో స్థానిక రైతులకు గిట్టుబాటు ధర పొందెందుకు అవకాశం ఉంటుందన్నారు. మరోవైపు కుప్పం - క్రిష్ణగిరి రహదారి విస్తరణ త్వరలో ఏర్పాటు కానుండడంతో పాటు రామకుప్పం మండలంలో రానున్న కార్గో విమాన సేవలతో ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులు విదేశాలకు తరలించుకోవడానికి వీలుంటుందని తెలియజేశారు. కాబట్టి పలమనేరు మార్కెట్ ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని విన్నవించారు. దీనిపై ముఖ్యమంత్రితో పాటు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రాజన్న



## కట్టమంచి రామలింగారెడ్డికి ఘన నివాళి

**పలమనేరు డిసెంబర్ 10 (మనసులో మాట) :** ప్రముఖ విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి కి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలోఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు పీ. తులసి నాదం నాయుడు మాట్లాడుతూ.... సి ఆర్ రెడ్డి విద్యావేత్తగా ఆర్థిక వేత్తగా కవిగా మేధావిగా ప్రసిద్ధిగాంచారన్నారు. పాఠశాల విద్యనుభ్యసించే స్థాయిలోనే రచనలు చేశారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ మొదటి ఉపకులపతిగా విశేష సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, యుగంధర్ బాబు, ఆనంద్ బెన్, చంద్రశేఖరయ్య, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు జీవన జ్యోతి




**ధర్మవరం డిసెంబర్ 10 (మనసులో మాట)..** అక్టోబర్ 18 వ తేదీన అనంతపురం ఆర్.డి.టీ. స్టేడియంలో లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలో ధర్మవరం, జీవన్ జ్యోతి స్కూల్ నందు 9 వ తరగతి విద్యార్థులు పి.ఉషశ్రీ, ఎస్. మనుస్మృతి సాయి ఉత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయి ఎస్. జి.ఎఫ్ అండర్17 హాకీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెడ్ మిస్ట్రెస్ సిస్టర్ సుజాత తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, డిసెంబర్ 11 వ తేదీ నుంచి 13 వ తేది వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా లో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో ఉమ్మడి అనంతపురం జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరెస్పాండంట్ సిస్టర్ రిన్సీ,హెడ్మిస్ట్రెస్ సిస్టర్ సుజాత,ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థులు అభినందించారు.

## ధర్మవరం పట్టణంలో పట్టపగలు దొంగతనం

### రూ.1.10లక్షలు విలువ చేసే ల్యాప్ టాప్, సెల్ ఫోన్ దొంగతనం

**ధర్మవరం డిసెంబర్ 10 (మనసులో మాట)..** పట్టణంలోని లింగశెట్టిపాళ్యం వీధిలో బుధవారం ఉదయం సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఇంట్లో గుర్తు తెలియని దొంగలు రూ.1.10లక్షలు విలువ చేసే ల్యాప్టాప్, సెల్ఫోన్ను దొంగతనం చేశారు. బాధితురాలు సాఫ్ట్వేర్ ఉద్యోగి మౌలిక వన్ టౌన్ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు మౌలిక తెలిపిన వివరాల మేరకు.. లింగశెట్టిపాళ్యం వీధిలో బుధవారం ఉదయం 8గంటల సమయంలో టేబుల్ పైన ల్యాప్టాప్, సెల్ఫోన్ పెట్టి వర్క్ చేసుకుంది. అనంతరం మిద్దెపై పని ఉండటంతో మిద్దెపైకి వెళ్లి వచ్చింది. ఆ సమయంలో ఇంట్లో తల్లి, తమ్ముడు లోపల గదిలో ఉండటంతో బయట రూమ్ లో టేబుల్ పైన ఉన్న కంపెనీ ల్యాప్టాప్, సెల్ఫోన్ ను గుర్తు తెలియని దొంగ వచ్చి దొంగతనం చేశాడు. ఇంటికున్న గేటు శబ్దం రావడంతో ఎవరో వచ్చారని ఇంట్లో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లి చూడగా గేటు ఓపెన్ చేసి ఉండటంతోపాటు టేబుల్పై ఉన్న ల్యాప్టాప్, సెల్ఫోన్ కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని తెలుసుకుని చుట్టుపక్కల ఎంత వెతికినా దొంగ అచూకి కనిపించలేదు. దీంతో బాధితురాలు మౌలిక వెంటనే వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

## హిందూ సమ్మేళనం వాల్ పోస్టర్లు విడుదల చేసిన మంత్రి సత్య కుమార్ యాదవ్




**ధర్మవరం డిసెంబర్ 10 (మనసులో మాట)..** హిందూ సమ్మేళనం ధర్మవరంలో డిసెంబర్ 21సాయంత్రం 4.00 నుండి కాలేజీ గ్రౌండ్లో నిర్వహించబడుతుంది. ఇందులో భాగంగా వీటికి సంబంధించి వాల్పోస్టర్ విడుదల, స్థానిక ఎమ్మెల్యే వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్ , ధర్మవరంలో మంత్రికార్యాలయంలో హిందూ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది అని పులి చర్ల వేణుగోపాల్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ హిందువులు అందరూ, కులాలకు, వర్ణాలకు, వర్గాలకు, అతీతంగా, పిల్లలు పెద్దలు మాతృమూర్తులు కుటుంబ సమేతంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హిందూ సమ్మేళనం అనేది హిందూ ఐక్యతకు నిదర్శనమని వారు తెలిపారు. కావున వందలాదిమంది హిందువులు ఈ హిందూ సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి కార్యదర్శి, సి కె వివేకానంద, సింగనమల కిషోర్ , బిజెపి సీనియర్ నాయకులు అంబటి సతీష్, నిర్వహణ సమితి సభ్యులు పాల్గొన్నారు

## ధర్మవరం పట్టణంలో వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ

### - ఏర్పాట్లను, ఉచిత సైకిల్ పంపిణీ ఏర్పాట్లను మంత్రి సత్య కుమార్ సమీక్ష



**ధర్మవరం డిసెంబర్ 10 (మనసులో మాట)..** పట్టణంలో గురువారం జరగనున్న భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి గారి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అలాగే ధర్మవరంలో ప్రారంభం కానున్న అటల్-మోదీ సుపరిపాలన యాత్ర ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తో కలసి ప్రత్యక్షంగా పర్యవేక్షించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకలకు సంబంధించిన విభాగాలు, వేదిక నిర్వహణ, పార్కింగ్, నీటి%-%వైద్య సేవలు తదితర అన్ని అంశాలను సమగ్రంగా సమీక్షించిన మంత్రి, ఎటువంటి లోపాలు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు, సమన్వయ బృందాలకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అదే రోజు ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత సైకిళ్ల పంపిణీకి జరుగుతున్న ఏర్పాట్లు కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ. ధర్మవరం పట్టణం డిసెంబర్ 11 చారిత్రాత్మక రోజును చూస్తోందని పేర్కొన్నారు. దేశానికి దిశానిర్దేశం చేసిన, విలువల రాజకీయాన్ని నిలబెట్టిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ప్రజల మధ్య ప్రతిష్ఠించడం ధర్మవరం కోసం గర్వకారణమని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ యువతలో విద్యా ప్రోత్సాహం పెంచే దిశగా ఒక గొప్ప అడుగు అని పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు, బీజేపీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో జరగనున్న ఈ కార్యక్రమాలు ప్రజల సంక్షేమానికి అంకితమైన కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యం, శ్రద్ధ, సంఘీభావానికి అద్దం పడుతాయని అన్నారు. ధర్మవరంలో అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందని, సత్య కుమార్ యాదవ్ నాయకత్వంలో ప్రాంతంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా పలు కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

## భూసార పరిరక్షణపై పలమనేరు విద్యార్థులకు అవగాహన




**పలమనేరు డిసెంబర్ 10( మనసులో మాట) :** పలమనేరు మండలం నందు ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ బాలికల విద్యార్థులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరిరక్షణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వనరుల కేంద్రం నుండి వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రసన్న, ఆత్మ బిటిఎం సుకుమార్, పలమనేరు వ్యవసాయ విస్తరణాధికారి కుమార్ నాయుడు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు మట్టి నమూనా ప్రాముఖ్యత మట్టి నమూనా ఎలా సేకరించాలో దానిని ఎలా పరిశీలించాలో విద్యార్థులకు తెలియజేశారు. అలాగే మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి మంచి పోషకాలు ఉన్న మట్టి అవసరమని మట్టిలో ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకోవడానికి మట్టి నమూనాలు సేకరించి పరీక్ష ద్వారా తగిన ఎరువులు వాడితే పంట దిగుబడి పెరుగుతుందని భూమి నాణ్యత కాపాడు గలుగుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఏ పి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ ప్రిన్సిపాల్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమం కోటి సంతకాల సేకరణ



**పలమనేరు డిసెంబర్ 10 ( మనసులో మాట) :** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "ప్రజా ఉద్యమం - కోటి సంతాకల" సేకరణ కార్యక్రమంలో భాగంగా పలమనేరు నియోజకవర్గంలో ప్రజలను చైతన్యపరిచి వారి నుండి సేకరించిన 72వేల సంతకాల పత్రాలను పెట్టిన వాహానాన్ని పలమనేరు నియోజకవర్గ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్రాలయం నుండి పలమనేరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడ చిత్తూరు జిల్లా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంకి జెండా ఊపి పంపడమైనది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ మాట్లాడుతూ.... మన రాష్ట్రంలో విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి. కానీ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నం. ప్రజల డబ్బుతో, ప్రజల అవసరాల కోసం నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి అప్పగించడం ఎంతటి దుర్మార్గపు ఆలోచనో..ప్రజలే ఈరోజు అవగాహన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ఈ తప్పుడు నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత కోటి సంతకాల ఉద్యమంలో పాల్గొనడం ఎంతో ఆశాజనకమైన విషయం. కోట్లాది మంది ప్రజల మాట వినకుండా, వారి భావాలను అర్థం చేసుకోకుండా పాలన చేయాలని ప్రయత్నించడం సిగ్గుమాలిన చర్య, ఈ సంతకాల శక్తితో అయినా చంద్రబాబు ఆలోచన మారాలి. ఈ పోరాటం రాజకీయ పోరాటం కాదు, ఇది విద్యా హక్కు కోసం, భవిష్యత్తు కోసం జరిపే "మహోన్నత ఉద్యమం". కూటమి ప్రభుత్వం తీసుకోబోతున్న నిర్ణయాలను పునఃపరిశీలించాలన్నారు. ప్రజల ఆలోచనలకు గౌరవం ఇవ్వాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయకుండా ప్రజల కోసం నిలబెట్టాలి.ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు నియోజకవర్గ పరిశీలకులు వెంకటేరెడ్డి యాదవ్, పలమనేరు నియోజకవర్గంలోని అన్ని మండలముల వైఎస్ఆర్ సీపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయించాలి..

### ధర్మవరం రెవెన్యూ డివిజన్ కేంద్రంలో యుటిఎఫ్ నిరసన




ధర్మవరం డిసెంబర్ 10 (మనసులో మాట) ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని,పార్లమెంటులో ఆర్ టి ఈ యాక్ట్ సెక్షన్ 23(1)ను అమెండ్మెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, సింగల్ టీచర్ సమస్యలు పరిష్కరించాలని, ఇప్పటికే బదిలీలు పొంది వారి స్థానాలలో కొత్తవారు రాక అక్కడే కొనసాగుతున్న టీచర్లను వెంటనే బదిలీ అయిన స్థానాలకు రిలీవ్ చేయాలని, అదేవిధంగా రెండవ శనివారం, ఆదివారాల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక తరగతులు నిర్వహించ వద్దని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కాలేజ్ సర్కిల్ నుండి ఆర్డిఓ ఆఫీస్ ఎదుట వరకు ప్రదర్శనగా వెళ్లి అనంతరం ధర్మవరం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి,అనంతరం ధర్మవరం డివిజన్ ఆర్డిఓ మహేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమం లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, రాష్ట కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి ,జిల్లా కార్యదర్శి ఆర్ రామకృష్ణ నాయక్, ధర్మవరం డివిజన్ నాయకులు ఆంజనేయులు ,అమర్ నారాయణరెడ్డి, లక్ష్మయ్య ,సురేష్ ,చంద్రశేఖర్, రాంప్రసాద్, లతా దేవి, నాగేంద్రమ్మ , యాస్మిన్ సుల్తానా, శ్రీలత, రామాంజనేయులు ,సాయి గణేష్ ,వెంకట కిషోర్. జనార్ధన్, శివయ్య, గోపాల్ రెడ్డి, గోపాలరావు, ఆదిశేషు, రాజేశ్వరరావు, బాలాజీ లక్ష్మీనారాయణ ,రామకృష్ణ, బాలగోండ్ల ఆంజనేయులు, టోపీ వలి, విశ్వనాథ్, హేమంత్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘన పట్ల విద్యార్థులు జాగ్రత్తలు వహించాలి..

### - ప్రిన్సిపాల్ ఫణి కుమార్

**ధర్మవరం డిసెంబర్ 10 (మనసులో మాట)** సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘన పట్ల విద్యార్థులు జాగ్రత్తలు వహించాలని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫణి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాదులు, హెచ్ఆర్పిసి లీగల్ సేల్ టౌన్ ప్రెసిడెంట్ వైస్ చైర్మన్ భార్గవి, న్యాయవాదులు విజయ రాఘవేంద్ర సుమలత, బాల సుందరి పాల్గొన్నారు. తొలుత కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. తదుపరి మానవ హక్కుల దినోత్సవం వేడుకలను గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల డైరెక్టర్ లు పాల్గొన్నారు.



మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం

గురువారం 11 డిసెంబర్ 2025



# ఫోన్ ట్యాపింగ్ కేసు నేటికి వాయిదా



**న్యూఢిల్లీ, డిసెంబర్ 10:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ సుప్రీంకోర్టులో గురువారానికి వాయిదా పడింది. ఈ సందర్భంగా, కేసు దర్యాప్తునకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనానికి ఒక ముఖ్య విషయాన్ని తెలియజేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు దర్యాప్తు సంస్థతో ఏమాత్రం సహకరించడం లేదని, దర్యాప్తు సంస్థతో ఆయన ఆటలాడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, కీలకమైన ర-ుజువులను నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రభాకర్ రావు తన ఐక్లౌడ్‌లోని డేటాను డిలీట్ చేశారని కూడా న్యాయస్థానానికి వెల్లడించారు. అయితే, ప్రభాకర్ రావు తరఫు సీనియర్ న్యాయవాది ఆ రోజు అందుబాటులో లేకపోవడంతో, ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. ఈ కీలక కేసులో విచారణ రేపు కూడా కొనసాగనుంది.

# నేడే తొలివిడత

- పంచాయితీ పోరుకు సర్వసిద్ధం
- తొలి విడతలో 189 మండలాలు
- 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు
- రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు
- తొలి విడతలో ఓటేయనున్న 56,19,430 మంది ఓటర్లు
- గ్రామాల్లో భారీగా బందోబస్తు
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్
- మధ్యాహ్నామే ఓట్ల లెక్కింపు.. ఫలితం
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



**హైదరాబాద్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్రంలో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. ఇప్పటికే జోరుగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు నేటి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీ ఎన్నికల్లో పోటీ పెరిగింది. తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయి. హైదరాబాద్‌లో ఎస్ఈసీ రాణి కుముదిని విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. గురువారం జరగనున్న తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా విస్తృత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి విడతలో మొత్తం 189 మండలాలు, 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, తొలి విడతలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ. 8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు.

50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం సుమారు లక్ష మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. ఇందులో 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు 2,489 మైక్రో ఆబ్జర్వర్లను నియమించారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులు వినియోగించనున్నారు. ఓటర్ సౌలభ్యం దృష్ట్యా 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెల్లడించారు. ఎన్నికల ప్రచారం కూడా మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, భయభ్రాంతులు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ఓటు కీలకమని పేర్కొంటూ, గ్రామాల భవిష్యత్తు నిర్ణయంలో ఓటు శక్తిని గుర్తించాలని ఆమె అన్నారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు 18 రకాల ఐడి కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఇక మంగళవారం నుంచి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ వివరించారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు.

## తొలివిడతకు భారీ బందోబస్తు

### డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, డిసెంబర్ 10:** తెలంగాణలో గురువా రం జరిగే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లాల పోలీస్ యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లుచేసిందన్నారు. మొత్తం 3,800కు పైగా పంచాయతీల్లో ఎన్నికలు జరగనుండగా.. 3వేల పంచాయతీల్లో పోలింగ్‌ను నేరుగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. బందోబస్తులో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఇతర స్పెషల్ పోలీస్ సిబ్బంది కూడా పాల్గొంటారని తెలిపారు. సాధారణ పోలింగ్ కేంద్రాలతో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది పూర్తి స్థాయి విధుల్లో ఉంటారన్నారు. ఇప్పటి వరకు రూ. 8.20 కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. 54 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేస్తున్నాయ న్నారు. ప్రజలంతా తనిఖీలకు సహకరించి.. ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.



# ఉస్మానియా వర్సిటీకి మహర్దశ

**వెయ్యికోట్లు విడుదలకు సీఎం అంగీకారం**

**వెంటనే విడుదలకు విద్యాశాఖ ఉత్తర్వులు**

### బీఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం పెద్ద ఉదాహరణ

- ఉద్యమంలో ఉస్మానియా కీలకం
- ధైర్యంతో కాదు.. గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా
- చదువు విలువ తెలిసినోడిని
- సీఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం

**హైదరాబాద్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నా రు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణ లో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థు లు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ. 1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ. 45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజే శారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్య త్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరి త్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచే శారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉం డాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండె ల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చా నని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మాని యా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదిం టి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూ చిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయా లనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతు న్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీ లు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుం టూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నా రు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతు న్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగా నే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్క రించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్య ను పరిష్కరించాం. విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడ దనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువు కునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయా లని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ. వెయ్యి కోట్లు మం జూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.




# అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటి

- గూగుల్‌ది.. నేడు ప్రపంచస్థాయిలో అగ్రస్థానం
- సమిష్టి కృషికి ఇదో పెద్ద నిదర్శనం
- స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వేల కోట్లు
- గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

హైదరాబాద్‌లో ఉన్న అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీరు యువకులు, శక్తివంతులు.. సాధారణంగా మీరు మీ కలలను సాకారం చేసుకోవాలనుకుంటారని పేర్కొన్నారు. బుధవారం టీ హబ్‌లో గూగుల్ స్టార్టప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ. వేల కోట్లు కేటాయిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. మూడు దశాబ్దాల క్రితం స్టార్టప్‌గా ప్రస్థానం ప్రారంభించిన గూగుల్.. నేడు ప్రపంచస్థాయిలో నిలిచిందని చెప్పారు. ఆ సంస్థను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీహబ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. హైదరాబాద్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగా చేయనున్నట్లు రేవంత్ తెలిపారు. స్టార్టప్‌లు యూనికార్న్ స్థాయికి ఎదిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని కృషి చేయాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించారు. ఉన్నత ఆశయాలతో 1998లో ఇద్దరు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మిత్రులు ఇద్దరు కలిసి కాలిఫోర్నియాలో ఒక గ్యారేజీలో ఓ స్టార్టప్‌ను ప్రారంభించారని తెలిపారు. అదే నేటి ప్రఖ్యాత గూగుల్ కంపెనీగా అవతరించిందని గుర్తుచేశారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిని ఆకాంక్షించి ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలని గత రెండు రోజులు, మనం తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించామని వివరించారు. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ల సమక్షంలో తెలంగాణ భవిష్యత్ కోసం మన విజన్‌ను ఆవిష్కరించామని పేర్కొన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన అనేక స్టార్టప్స్ నేడు బిలియన్ల డాలర్ల కంపెనీలుగా ఎదిగాయని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.'గూగుల్, ఆపిల్, అమెజాన్, టెస్లా, ఫేస్‌బుక్ ఇలాంటి గొప్ప ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. గత 25 సంవత్సరాల్లో సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో చాలా స్టార్టప్స్ పెద్ద కంపెనీలుగా ఎదిగాయి. తెలంగాణ రైజింగ్ విజన్ స్టార్టప్స్ కోసం మీ ప్రణాళికలు ఏంటని అడిగితే... స్టార్టప్స్‌ని ఫుట్‌బాల్ ఆటతో పోలుస్తాం. నేను ఆ ఆట ఆడతాను. ఫుట్‌బాల్‌లో సమష్టి కృషి అవసరం. పట్టుదలతో సాధన చేయాలి. ఇది టీమ్ వర్క్. కానీ చివరకు గెలుపు చాలా ముఖ్యం. స్టార్టప్స్ కూడా అదే విధంగా ఉండాలి. ఈ రోజు నుంచి హైదరాబాద్ ప్రోడక్ట్ బేస్డ్ స్టార్టప్స్, ఇన్నోవేటీవ్ స్టార్టప్స్, ఐపీ ఇంటెన్సీవ్ స్టార్టప్స్ వీటి పైనే దృష్టి పెట్టాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు.'హైదరాబాద్ కేవలం స్టార్టప్స్ హబ్‌గా ఎదగడమే కాదు. ఆ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం. కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలుగా ఎదగాలి. 2034 నాటికి వాటిల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. అందుకోసం రాష్ట్రంలో ఒక మంచి ఎకోసిస్టమ్‌ను సృష్టించాలనుకుంటున్నాం. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ మీకు అవసరమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం మా ప్రభుత్వం రూ. 1000 కోట్లతో స్టార్టప్స్ ఫండ్ ఏర్పాటు చేస్తుంది. ఆ ఫండ్స్‌ను వినియోగించుకోండి. తద్వారా స్టార్టప్‌లు గూగుల్ స్థాయిలో లేదా 1 బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలని కోరుకుంటున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికే ఎన్నో జీసీసీలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయని.. స్టార్టప్‌లు సైతం ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని ముందుకువెళ్లాలని సూచించారు.



# ఫ్రస్టేషన్‌లో ఎమ్మెల్యే మాధవరం

## అన్ని ఆరోపణలకు ఆధారాలతో సమాధానమిస్తా..

## మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, డిసెంబరు 10:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం ఆయన ఫస్ట్రేషన్‌ను బయట పెడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆయన చేసిన అన్ని ఆరోపణలకు ఆధారాలతో సహా వివరణ ఇస్తానన్నారు. కూకట్‌పల్లిలో 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే తాను చెప్పానని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడిన మాటలకు ఫీలయ్యేది లేదని... ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ఐదు రోజుల పాటు హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తామని తెలిపారు. నేడు కంటోన్మెంట్‌లోని బోయినపల్లి గవర్నమెంట్ స్కూల్‌ను సందర్శించినట్లు చెప్పారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్‌ను బాగు చేశారని.. కానీ కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు లేవన్నారు. వాటిని తాము ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ స్కూళ్లోనే అంగన్ వాడీని కూడా కలిపారని... కానీ అంగన్‌వాడీలో హెల్పర్లు లేరన్నారు. జనం బాటలో భాగంగా విద్య, వైద్యం మీద ఫోకస్ పెట్టామని వెల్లడించారు. స్కూల్స్, హాస్పిటల్స్‌లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామన్నారు. ఇండ్లు, ఇళ్ల పట్టాలను లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నామన్నారు. తమ వరకు చేయగలిగేది ఒక సంస్థగా చేస్తామని స్పష్టం చేశారు. టాప్ టెన్ విద్యార్థులకు జాగృతి తరఫున స్కాలర్ షిప్‌లు ఇస్తామని ప్రకటించారు.ఏ జిల్లాకు వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ, సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటోందన్నారు. ప్రజల సమస్యలను వీలైనంతగా పరిష్కరిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వంలో తనను నిజామాబాద్‌కే పరిమితం చేశారని.. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏం జరుగుతుందో చూడలేదన్నారు. తెలంగాణ వచ్చాక ఏం జరిగింది... ఏం జరగలేదన్నది జనం బాట కార్యక్రమం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తాము చేయగలిగేవి చేస్తామని... మిగిలిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. మంచిని మంచి, చెడును చెడు అనే అంటామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పట్టించుకోవటం లేదని... పాలక పక్షం అసలే పట్టించుకుంట లేదని.. అందుకే జాగృతి జనం గళమై పనిచేస్తోందని కవిత పేర్కొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ దోపిడీ ప్లాన్

## రైజింగ్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ ● మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, డిసెంబర్ 10:** కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. ఇది గ్లోబల్ సమ్మిట్ కాదని.. భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్ అంటూ వ్యాఖ్యలు చేశారు. అందాల పోటీల్లాగే, ఏఐ సమ్మిట్ లాగే.. గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అయ్యిందంటూ కామెంట్స్ చేశారు. పెట్టుబడుల కట్టు కథలు చెప్పి, కోట్లు ఖర్చు చేసి గ్లోబల్ సమ్మిట్‌ను అట్టర్ ఫ్లాప్ చేశారంటూ ఫైర్ అయ్యారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట రియల్ ఎస్టేట్ స్కాంకు తెరతీశారంటూ మాజీ మంత్రి సంచలన ట్వీట్ చేశారు. 'విజన్ డాక్యుమెంట్‌లో విజన్ లేదు, దాన్ని చేరుకునే మిషన్ లేదు, విజన్ డాక్యుమెంట్ కాదు.. 'విజన్ లెస్' డాక్యుమెంట్. క్యూర్, ప్యూర్, రేర్ అంటూ అంటున్న రేవంత్ రెడ్డి.. తెలంగాణను కొల్లగొడుతున్న చోర్. గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి.. దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి గ్లోబల్ సమ్మిట్ వేదికగా టోనీ ÷–లబెయిర్, సుబ్బారావు ఇచ్చిన కితాబు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు. రేవంత్ రెడ్డి నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదు, భూములు అమ్మకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ సమ్మిట్' అంటూ హరీష్ రావు ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

# మత్తు ఇంజెక్షన్ల కలకలం

## చాంద్రాయణగుట్టలో మత్తు ఇంజెక్షన్ల కేసు సంచలన ఘటన

## అధిక డోస్‌తో ఇద్దరు ఆటోడ్రైవర్ల మృతి ■ ఇద్దరు వైద్యుల అరెస్ట్

**హైదరాబాద్, డిసెంబర్ 10:** హైదరాబాద్ నగర పరిధిలోని చాంద్రాయణగుట్ట పరిధిలో మత్తు ఇంజెక్షన్ల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. మత్తుకోసం అనస్తీషియా తీసుకుని ఇద్దరు డ్రైవర్లు మృతిచెందడంతో పోలీసులు విచారణ చేపట్టి ఇద్దరు డాక్టర్లను అరెస్ట్ చేశారు. రోగులకు ఇవ్వాల్సిన డోసు కంటే ఎక్కువ మోతాదులో మత్తు ఇచ్చినందువల్లే వారు మృతిచెందినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఇద్దరు ఆటోడ్రైవర్లు ఆటోలనే కుప్పకూలి మరణించడంతో.. ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా విశ్లేషించి కీలక విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఇంజెక్షన్లు ఎక్కడి నుంచి వస్తున్నాయనే అంశంపై పలు ఆధారాలు సేకరించారు. రోగులకు చికిత్స చేసేందుకు వాడాల్సిన మత్తు ఇంజెక్షన్లను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ జైపాల్ రెడ్డి బహిరంగ మార్కెట్లో అక్రమంగా అమ్ముతున్నాడు. అతడి వద్ద నుంచి ఈ ప్రమాదకర ఇంజెక్షన్లు బయటకు వెళ్లినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో మరో ఆసుపత్రికి చెందిన ఇంకో వైద్యుడి పాత్ర కూడా ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. ఇరువురూ కలిసి అక్రమంగా అనస్తీషియా ఇంజెక్షన్లు విక్రయిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు.. ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ఆసుపత్రుల్లో నిల్వ ఉన్న ఔషధాలను దారిమళ్లించి.. మత్తుకు అలవాటుపడిన వారికి అమ్ముతూ వ్యాపారం సాగిస్తున్నారని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో శస్త్రచికిత్సల సమయంలో మాత్రమే వినియోగించాల్సిన ఇంజెక్షన్లను ఇలా బహిరంగంగా అమ్మడంతోనే ఈ దుర్ఘటన జరిగిందని భావిస్తున్నారు పోలీసులు.

# ఆర్టీసీకి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు



- కాలుష్య నివారణ లక్ష్యంగా కృషి
- బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, డిసెంబర్ 10:** తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచుతూ, ఆర్టీసీని కాలుష్య రహిత ప్రజా రవాణా వ్యవస్థగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీలో 810 ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెడుతున్నాయి. ఇందులో జంట నగరాల పరిధిలో 300కు పైగా బస్సులు తిరుగుతున్నాయి.జనవరి చివరి నాటికి మరో 175 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అత్యాధునిక 'పీఎం ఈ–డ్రైవ్' పథకం కింద అతి త్వరలో ఏకంగా 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియ దశలవారీగా ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పూర్తవుతుందని మంత్రి తెలిపారు. ఆర్టీసీ రవాణా వ్యవస్థను ఈవీ బస్సుల ద్వారా ముందుకు తీసుకువెళ్లి, హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను విస్తరించడంలో భాగంగా త్వరలో 373 కొత్త ప్రాంతాలకు బస్ కనెక్టివిటీని అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇంటర్ సిటీ ట్రాన్స్‌పోర్టేషన్ కింద వరంగల్, ఖమ్మం, నల్గొండ వంటి చుట్టుపక్కల జిల్లాల నుండి హైదరాబాద్‌కు ఈవీ బస్సులను ప్రారంభం చేసినట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బస్సుల విస్తరణ జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, మహాలక్ష్మి పథకం అమలు ద్వారా ఆర్టీసీ వ్యవస్థ లాభాల బాట పట్టిందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇస్తూ, వారి సమస్యలన్నీ అతి త్వరలో పరిష్కారమవు తాయని హామీ ఇచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, శ్రామిక్, ఇతర సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని.. వారందరికీ అభినందనలు చెప్పారు. ఇప్పటికీ 251 కోట్ల మంది మహిళలు.. రూ.8,500 కోట్ల విలువైన ప్రయాణాలు చేశారన్నారు. హాస్పిటల్స్, దేవాలయాలు, ఉద్యోగులు, బంధువుల ఇంటికి, స్కూళ్లకు రాకపోకలు సాగించారన్నారు. దేవాదాయ శాఖ ఆదాయం మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిందన్నారు. రెండేళ్లలో ప్రస్తుతమున్న 40శాతం బస్సులను కొనుగోలు చేయడం జరిగిందని.. ఆర్టీసీలో కొత్త రక్తం వస్తుందన్నారు. కొత్తగా డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్స్ వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానుల చేసిందన్నారు. ఢిల్లీ లో నివాస యోగ్యం లేకుండా కాలుష్యం ఉన్న పరిస్థితి ఉందని.. ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత దృష్టిలో పెట్టుకుందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఈవీ బస్సులు సమ్మక్క సారలమ్మ జాతర, శ్రీశైలం, యాదాద్రికి రాకపోకలు సాగిస్తాయన్నారు. ప్రత్యేక బస్సులు బస్సులు, నూతన బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్లను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. 1932లో ప్రారంభించిన ఆల్బియన్ బస్సు, మధ్యలో వచ్చిన ఎర్రబస్సు, ప్రస్తుతం నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సు అక్కడ ఎగ్జిబిషన్ పెట్టినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్ట్‌లో ఇబ్బందులు వచ్చినా దగ్గరలో ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపినట్లు చెప్పారు. ప్రజారవాణాలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామని.. ఈవీ బస్సుల ప్రారంభోత్సవంతో నగరంలో మరింత మెరుగ్గా బస్సులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈవీ పాలసీని తీసుకువచ్చామని.. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవీ, సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఆటోలకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. బస్సుల ప్రారంభోత్సవం సందర్భంగా నగర ప్రజలకు మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు.

# కోటి కోట్లు సాధ్యమా?

- మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారు?
- ఇప్పటికీ పూర్తిస్థాయి రుణమాఫీ కాలేదు
- 7వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు
- పెంచిస్తామని చెప్పిన పింఛన్లకు దిక్కేలేదు
- కాంగ్రెస్ పాలనలో ప్రజలు మోసపోయారు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా 5వేల మంది ఆటో కార్మికులకు ప్రమాద బీమా బాండ్ల అందజేత



**సిరిసిల్ల:** కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేయాలంటే ఎన్ని కోట్లు కావాలి.. కోటీ కోట్లు సాధ్యమవుతుందా అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్లలో బుధవారం గతంలో ఇచ్చిన మాట ప్రకారం జిల్లావ్యాప్తంగా 5వేల మంది ఆటో కార్మికులకు రూ.5లక్షల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో చెప్పిన విధంగా ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.1000 చొప్పున రెండేళ్లకు రూ.24వేల బాకీ పడిందన్నారు. మహిళలందరికీ సీఎం రేవంత్ రెడ్డి రూ.1560 కోట్లు బాకీ పడ్డాడన్నారు. ఆటో కార్మికులతో తమ అనుబంధం ఈనాటిది కాదని, ఉద్యమ సమయం నుంచి ఇప్పటివరకు వారి మద్దతు మరువలేమన్నారు. మానిఫెస్టోలో పెట్టకుండానే కేసీఆర్ ప్రమాద బీమా అమలు చేయలు చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో 13 లక్షలకు పైగా అన్ని రంగాల కార్మికులకు ప్రమాద బీమా చేసినట్లు చెప్పారు. అలాగే ప్రపంచంలో రైతులకు రైతు బీమాతో ధీమా ఇచ్చిన నాయకుడు కేసీఆర్ అని, జిల్లాలో నేతన్నలు, గౌడన్నలకు బీమా పెట్టారని.. బీఆర్‌ఎస్ మూడోసారి గెలిస్తే రాష్ట్రంలో అందరికీ కేసీఆర్ ధీమా పథం వచ్చేదని చెప్పారు. 4.30 లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఈ రెండేళ్లలో మార్పు అర్థమైందని, ప్రజలందరూ బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారన్నారు.

### ఓనర్ టు డ్రైవర్

జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా తాను ఆటోలో ప్రయాణించినట్లు చెప్పారు. 'రెండు ఆటోల ఓనర్ మస్రత్ అలీ ఆటోలో గతంలో రాహుల్ గాంధీ ప్రయాణించాడు. ఇప్పుడు రెండు ఆటోలు అమ్ముకున్న కిరాయి ఆటోలు నడుపుకుంటున్నాడు. డ్రైవర్ టు ఓనర్ ఆనాడు.. ఈనాడు ఓనర్ టు డ్రైవర్' అయ్యాడని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు మోసపోయారని, బోగస్ హామీలిచ్చి గద్దెనెక్కారని విమర్శించారు. రుణమాఫీకి రూ.50 వేలకోట్లు అవసరమని, ఇప్పటికీ రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారని, రెండేళ్లలో 7 వేల ఉద్యోగాలు ఇవ్వలేదని మండిపడ్డారు. పెంచి ఇస్తామని చెప్పిన పెన్షన్లు ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు.

### ఆటో సంక్షేమ బోర్డు పెట్టాల్సిందే

రాష్ట్రంలో ఆటో కార్మికుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని కేటీఆర్ అన్నారు. 13.30 లక్షల మంది ఆటో కార్మికులకు బీమా కార్యక్రమం చేస్తే దాన్ని కూడా రేవంత్ రెడ్డి ఊడగొట్టిండన్నారు. పాసింజర్ ఆటోలే కాకుండా ట్రాక్టర్, ట్రాలీ ఆటో కార్మికులకు సంఖ్య కూడా సంక్రాంతి వరకు తీసుకుని వారికి కూడా బీమా సౌకర్యం కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఆటో సంక్షేమ బోర్డు పెట్టకపోతే ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో కోపరేటివ్ సొసైటీగా ఏర్పడితే మేలు జరుగుతుందన్నారు. మరోవైపు మహిళలకు ఫ్రీ బస్సు అంటూనే ప్రభుత్వం రేట్లు పెంచిందని.. ఇలా అయితే ఎలా ఫ్రీ బస్ పథకం అవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# వర్సిటీల్లో 'ఇంక్యూబేషన్' సెంటర్లు

## 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, డిసెంబర్ 10 :** కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో 'ఇంక్యూబేషన్' సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలనే లక్ష్య సాధనలో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, లైఫ్ సైన్సెస్ హబ్ 'వన్ హబ్'కు ధీటుగా ఈ కేంద్రాలను తీర్చి దిద్దుతామన్నారు. బుధవారం టీ హబ్ లో 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్'ను సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... మేం స్టార్టప్ లను కేవలం చిన్న కంపెనీలుగా మాత్రమే చూడటం లేదని, సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు వినూత్న పరిష్కారాలు అందిస్తూ... కొత్త ఉద్యోగాలను సృష్టించే 'ఎకనామిక్ ఇంజిన్స్'గా చూస్తున్నామన్నారు. 2024 లో ఇక్కడి స్టార్టప్‌లు 571 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 160 శాతం అధికమని వివరించారు. ముఖ్యంగా హెల్త్ టెక్ రంగంలో 2,139 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. మహిళా నేతృత్వంలోని స్టార్టప్‌లలో హైదరాబాద్ దేశంలోనే ఆరో స్థానంలో ఉందన్నారు. 531 వుమెన్ లెడ్ స్టార్టప్ లు 417 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ పనితీరుకు, ప్రగతిశీల విధానాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం టెక్నాలజీని కేవలం టూల్ గా మాత్రమే చూడటం లేదని, ఒక సమానత్వ సాధనంగా చూస్తోందన్నారు.

# మహాలక్ష్మి పథకానికి రెండేండ్లు

## ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి శుభాకాంక్షలు

**హైదరాబాద్, డిసెంబర్ 10:** మహా లక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బస్ భవన్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 97 డిపోల్లో ఉన్న ఆర్టీసీ అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహాలక్ష్మీ పథకం విజయవంతానికి నిరంతరం శ్రమిస్తున్న డ్రైవర్లు , కండక్టర్లు , శ్రామిక్ ఇతర సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రవాణా శాఖ మంత్రి గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎండీ, ఈడిలు సత్కరించారు. ఆర్టీసీని మరింత విస్తృత పర్చాలని క్షేత్ర స్థాయిలో రాజధాని నుండి గ్రామాల వరకు ఆర్టీసీ కొత్త రూట్లను అన్వేషించి ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడిపించేలా కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ఇప్పటికే హైదరాబాద్ నగరంలో గత 3 నెలలుగా సర్వే చేసి 373 కొత్త రూట్లలో ఈరోజు నుండి ప్రజా రవాణా అయిన ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. 2047 విజన్ లో ముఖ్యమంత్రి గారి ఆలోచనలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లో రవాణా శాఖ కీలక పాత్ర పోషించాలని తెలిపారు.

# అల్విదా నవాబ్ భాయ్

## పేదల పక్షపాతిని, ప్రజా బాంధవుడిని కోల్పోయాం

- సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్ కు తీరని లోటు
- అంత్యక్రియలకు హాజరైన రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్
- సమద్ నవాబ్ ను కడసారి చూపుకోసం వేలాదిగా తరలివచ్చిన జనం
- బైపాస్ రోడ్ ఖబ్రస్థాన్ లో జనాజా నమాజ్ ఆచరించి.. అంత్యక్రియలు పూర్తి





**కరీంనగర్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇదారా ఏ ఖాదిమానే మిల్లత్ సెక్రటరీ అబ్దుల్ సమద్ నవాబ్ ను కడసారి చూడటం కోసం కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి, కరీంనగర్ పట్టణం నుంచి పార్టీలకతీతంగా ముస్లింలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్, డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, ప్రతినిధులు, అభిమానులు, జమాత్ లకు అతీతంగా ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. హుస్సేనీ పుర నుంచి బైపాస్ రోడ్ వరకు జన ప్రవహంతో కిక్కిరిసి పోయింది. పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేలాది మంది అశ్రునయనాల నడుమ కరీంనగర్ బైపాస్ రోడ్ లో సమద్ నవాబ్ పట్టుదలతో, కృషితో నిర్మించిన మస్జిద్ అఫ్జల్ బియాబాని లో వందలాదిమంది ముస్లింల సమక్షంలో ఇస్లామీయ సాంప్రదాయం ప్రకారం చివరగా నమాజే జనాజా ఆచరించి, సమద్ నవాబ్ కృషితో సాధించిన పక్కనే గల ఖబ్రస్తాన్ లో అంత్యక్రియలు నిర్వహించారు.

ఈఅంత్యక్రియల్లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ లతో పాటు పలువురు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు మాట్లాడుతూ పేద ముస్లింల పక్షపాతిని, ప్రజా బాంధవుడిని సమాజం కోల్పోయిందన్నారు. సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది నాయకులు కేవలం తమ స్వార్థం కోసం జీవిస్తారని, ప్రజల క్షేమం కోసం, సమాజాన్ని ఉద్ధరించడం కోసం కొందరు నాయకులే పుడతారని, ప్రజాభిమానాన్ని సంపాదించి, పేదల అభిమానాన్ని చూరగొన్న నేతగా, సంఘ సంస్కర్తగా సమద్ నవాబ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సమద్ నవాబ్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. సమద్ నవాబ్ మరణం తనను కలిచివేసిందని, ఆయన కుమారులను ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ తరపున సంతాపం ప్రకటించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఇంటికి పిలిచి, బ్యాట్‌తో కొట్టి..

**సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం**

**కూతురు ప్రేమపై విషం చిమ్మిన తల్లిదండ్రులు**

**యువకుడిని పిలిపించి దారుణంగా హత్య**



**సంగారెడ్డి, డిసెంబర్ 10 (మనసులో మాట):**

సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం జరిగింది. కూతురును ప్రేమించాడని తెలిసి.. పెళ్లి గురించి మాట్లాడదామని అతడిని ఇంటికి పిలిపించి అమ్మాయి తల్లిదండ్రులు అతనిడిని దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంజనీరింగ్ స్టూడెంట్ జ్యోతి శ్రావణ్ సాయిని హత్య చేసిన ఘటన అమీన్‌పూర్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో వెలుగులోకి వచ్చింది. జ్యోతి శ్రావణ్ సాయి(20), బీరంగూడ ఇసుకబావికి చెందిన శ్రీజ (19) గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉండడంతో అమ్మాయి తల్లిదండ్రులు తమ కూతురిని ప్రేమించొద్దని పలుమార్లు సాయిని హెచ్చరించారు. అయినప్పటికీ శ్రావణ్ సాయి, శ్రీజ తమ ప్రేమను కొనసాగించారు. ఈ విషయం శ్రీజ తల్లిదండ్రులకు తెలిసింది. సాయిపై పగ పెంచుకున్న శ్రీజ కుటుంబం ఇద్దరికీ మ్యారేజీ చేస్తామని, మాట్లాడుకుందా మని అతనిని ఇంటికి పిలిపించారు. ఇంటికి పిలిచి ఒక్కసారిగా సాయిపై దాడి చేశారు. విచక్షణా రహితంగా అతనిని కొట్టడంతో శ్రావణ్ సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లోకి లాక్కెళ్లి మరీ దాడి చేశారు. దెబ్బలకు తాళలేక విలవిలలాడిపోయిన శ్రావణ్ సాయి ప్రాణాలు కోల్పోయాడు. జ్యోతి శ్రావణ్ సాయి మైసమ్మ గూడలోని సెయింట్ పీటర్ కాలేజీలో బీటెక్ సీఎస్ఈ సెకండియర్ చదువుతున్నాడు. కుత్బుల్లాపూర్‌లో రూం తీసుకుని జ్యోతి శ్రావణ్ సాయి ఉంటున్నాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమీన్ పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరూ పదో తరగతి వరకూ కలిసి చదువుకోవడంతో సాన్నిహిత్యం ఏర్పడి.. ప్రేమకు దారితీసినట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలిసి ఇరువురినీ పలుమార్లు హెచ్చరించారు శ్రీజ తల్లిదండ్రులు. అయినా వినిపించుకోకపోవడంతో ఆగ్రహించిన యువతి తల్లిదండ్రులు.. హతమార్చారు. ఈ ఘటనపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# సమ్మిట్‌తో ఊహించని పెట్టుబడులు

- పేరెన్నికగన్న కంపెనీలతో పలు ఒప్పందాలు
- ముందస్తు కార్యక్రమాలతోనే రాహుల్, ఖర్గేలు రాలేదు
- త్వరలోనే పార్టీ పదవుల భర్తీని పూర్తి చేస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని స్థాయిలో తెలంగాణకు పెట్టుబడులు వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే తమ ప్రభుత్వానికి ఒప్పందాలు జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోయారని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు.తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్. ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుందని తెలిపారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌లు భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లావాదేవీలలో భాగంగానే కవిత – బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని విమర్శించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను టీపీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ అంటే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. మీడియాలోనే తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తున్నారని చెబుతున్నారని.. అప్పుడే మంత్రి పదవి ఇస్తున్నారంటూ కూడా ఊహాగానాలు వస్తున్నాయని తెలిపారు. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారని ప్రశంసించారు మహేశ్ కుమార్ గౌడ్. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాహర్ లాల్ నెహ్రూను విమర్శిస్తూ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని మండిపడ్డారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే బయపడ్డారని ఎద్దేవా చేశారు. 1965లో ఇందిరాగాంధీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారని... 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లడం చరిత్రగా నిలిచిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఆదిలాబాద్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**ఆదిలాబాద్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. జైనథ్ మండలం తరోడ సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మృతులను ఆదిలాబాద్‌లోని జైజవాన్ నగర్, లక్ష్మీనగర్ వాసులుగా గుర్తించారు. మహారాష్ట్రకు మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

# ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా జడ్జి జి. రాజగోపాల్**





**ఖమ్మం, డిసెంబర్ 10 (మనసులో మాట):**

ఖమ్మం జిల్లాలోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో తాత్కాలిక పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాలు, పోక్సో కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈ కోర్టులో, మార్చి 2026 వరకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయడానికి సీనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంపికైన సీనియర్ అసిస్టెంట్‌కు నెలకు రూ. 22,750, ఆఫీస్ సబార్డినేట్‌కు రూ. 15,600 చొప్పున వేతనం చెల్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోస్టులకు ప్రధానంగా తెలంగాణ మినిస్టీరియల్ సర్వీసులలో పనిచేసి పదవీ విరమణ పొందిన జ్యుడీషియల్ ఉద్యోగులు అర్హులని, వారికి 65 ఏళ్ల వయసు నిండి ఉండకూడదని జడ్జి సూచించారు. ఒకవేళ రిటైర్డ్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోని పక్షంలో జనరల్ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని, వారి వయసు 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వయసు సడలింపు ఉంటుంది. విద్యార్హతల విషయానికి వస్తే, సీనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు 7వ తరగతి నుంచి 10వ తరగతి మధ్య అర్హత కలిగి ఉండాలని, 10వ తరగతి కంటే ఎక్కువ చదివిన వారిని ఎంపిక చేయరని స్పష్టం చేశారు. అలాగే సబార్డినేట్ పోస్టులకు డ్రైవింగ్, ఎలక్ట్రికల్ పని, ప్లంబింగ్, వంట వంటి పనుల్లో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తారు. జనరల్ అభ్యర్థుల నుంచి 20 కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే, మెరిట్ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసి రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు డిసెంబర్ 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ ఆ ప్రకటనలో కోరారు.

# సీఎం సహాయనిధిలో కొత్త రికార్డు

## రెండేళ్లలో రూ.1,685.79 కోట్ల సహాయం అందజేత




**హైదరాబాద్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

తెలంగాణలో ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎప్పుడూ లేని స్థాయిలో వైద్య సహాయం అందింది. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 డిసెంబర్ 6 వరకు మొత్తం 3,76,373 మంది లబ్దిదారులకు రూ.1,685.79 కోట్ల సహాయం అందజేశారు. గతంలో 2014 నుంచి 2024 వరకు సంవత్సరానికి సగటున రూ.450 కోట్లు మాత్రమే సహాయ నిధి ద్వారా పంపిణీ కాగా, ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సగటున సంవత్సరానికి రూ.850 కోట్ల మేర నిధులు వెచ్చించడం గమనార్హం.ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రజలకు రెండు విధాలుగా వైద్య సహాయం అందుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ముందుగానే ఖర్చు భరించే లెటర్ ఆఫ్ క్రెడిట్ విధానం ద్వారా 27,421 మంది లబ్దిదారులకు రూ.533.69 కోట్ల సహాయం అందింది. నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి వంటి వైద్య కేంద్రాల్లో ఈ సహాయం నేరుగా చికిత్స ఖర్చులకు ఉపయోగపడింది. మరోవైపు ప్రైవేటు లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు ఖర్చులు చెల్లించిన అనంతరం తిరిగి పొందే రీయింబర్స్‌మెంట్ విధానం ద్వారా 3,48,952 మందికి రూ.1,152.10 కోట్లు అందజేశారు. ప్రజలు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం పొందేలా ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా నిమ్స్‌లో ఎక్కువగా లెటర్ ఆఫ్ క్రెడిట్ కేసులు మంజూరవడం ద్వారా పేదలకు అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఈ మొత్తం ప్రక్రియలో దళారీల పాత్ర లేకుండా దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నారు. ఆధార్ ధృవీకరణ తర్వాత లబ్దిదారుడి పేరు, బ్యాంక్ ఖాతా వివరాలతో చెక్కులు జారీ చేస్తుండటంతో పారదర్శకత మరింత పెరిగింది.తెలంగాణ రాష్ట్ర నివాసితులు, సాధారణంగా సంవత్సరానికి రూ.1.60 లక్షల లోపు కుటుంబ ఆదాయం ఉన్నవారు ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్హులు. ప్రజాప్రతినిధుల సిఫారసుతో అధికారిక అటీఈఈ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అనారోగ్యం కారణంగా ఆర్థికంగా కుంగిపోయే కుటుంబాలకు పెద్ద భరోసాగా మారింది. గతంతో పోలిస్తే నాలుగింతల స్థాయిలో నిధులు వెచ్చించడం ద్వారా ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం కోసం ఎంత కీలకమో ఈ గణాంకాలే స్పష్టంగా చూపిస్తున్నాయి.

# ఈశ్వరచారిని పరామర్శించే తీరిక సీఎంకు లేదా?

**బీసీ జేఏసీ ఆగ్రహం**

**హైదరాబాద్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బీసీల ఆకాంక్షలు నెరవేరాలని తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన తొలి బీసీ ఉద్యమ అమరవీరుడు సాయి ఈశ్వర చారి మరణించి ఐదు రోజులు గడిచినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గానీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గానీ ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవడం అత్యంత బాధాకరమని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సాయి ఈశ్వర చారి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ గురువారం హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీజేపీలు మోసం చేసినందుకే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు ఈశ్వర చారి చెప్పారని గుర్తుచేశారు. బీసీలను మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీసీ సమాజం క్షమించదని హెచ్చరించారు. ప్రస్తుతం ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే, అక్కడ పోరాడాల్సిన కాంగ్రెస్ వెనుకడుగు వేస్తోందని, మరోవైపు బీజేపీ రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించకుండా జాప్యం చేస్తూ బీసీల బలిదానాలకు కారణమవుతోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

# స్కూల్ ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి

**కామారెడ్డి, డిసెంబర్ 10 (మనసులో మాట)::**

స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న ఆటో బోల్తాపడి పదవ తరగతి విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో 14 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ఈ ప్రమాదం జరిగింది. మండలంలోని సావర్గావ్ గ్రామం నుంచి ఖండే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తుండగా ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో పదవ తరగతి విద్యార్థి ప్రణవ్ (15) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# ఏకగ్రీవ సర్పంచ్, ఉప సర్పంచ్‌కు విప్ సన్మానం

**వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట మండలం జై సేవాలాల్ ఊరు తండాలో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్, ఉప సర్పంచ్ ఏకగ్రీవమయ్యారు. బుధవారం నూతనంగా ఏకగ్రీవమైన సర్పంచ్ ఇస్లావత్ మంజుల-రవి, ఉప సర్పంచ్ అజ్మీరా దేవా లాల్ నాయక్‌ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏకగ్రీవానికి కృషిచేసిన తండావాసులను అభినందించారు. తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథం లో తీసుకెళ్లడానికి తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, గ్రామాల్లో చేయి తిరిగే వారిని సర్పంచులుగా ఎన్నుకుంటే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

# ఈవీఎంల గోడౌన్ తనిఖీ

**ఈవీఎంలను పరిశీలించిన సీఈఓ, ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ**




**సిరిసిల్ల:** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ వద్ద ఉన్న ఎలెక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల గోడౌన్ ను ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ వద్ద ఉన్న ఈవీఎంల గోడౌన్ తనిఖీ చేసేందుకు ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి సీఈఓ సుదర్శన్ రెడ్డి చేరుకోగా, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేశ్ బీగీతే, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఈఓ.. ఇన్‌చార్జి కలెక్టర్‌తో పలు అంశాలపై చర్చించారు. అక్కడి నుంచి సీఈఓ నేరుగా సర్దాపూర్ లోని ఈవీఎం గోడౌన్, ఈవీఎంలను ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేశ్ కుమార్, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# మొదటి విడత పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత : ఎస్పీ



**సిరిసిల్ల:** గ్రామ పంచాయతీ మొదటి విడత పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మహేశ్ బీగితే తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికలు జరిగే మండలాల్లో బందోబస్త్ కు వచ్చిన పోలీస్ సిబ్బందికి ఆయా పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలింగ్, ఓట్ల లెక్కింపు సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో రూట్ మొబైల్ పోలీస్ అధికారులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, పోలింగ్ కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో గుంపులుగా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సమచారం అందించాలన్నారు. ఎస్పీ వెంట పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



# సీఎం దృష్టికి ఓయూ బస్తీల సమస్యలు

- తార్నాక అభివృద్ధికి రూ.25 కోట్ల బడ్జెట్ కేటాయించండి
- ముఖ్యమంత్రితో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు శోభన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని యూనివర్సిటీలో ఘనంగా స్వాగతించి వేదికపైకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తార్నాక డివిజన్ ప్రజల తరఫున పలు కీలక సమస్యలపై ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించి, వాటి పరిష్కారానికి సంబంధించి విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో గత 70ఏళ్లుగా సుమారు తొమ్మిది బస్తీల్లో వేలాది కుటుంబాలు నివసిస్తూ వస్తున్నాయని తెలిపారు. సుమారు 90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ బస్తీలు, మౌలిక సదుపాయాల లేమి, గత ప్రభుత్వాల నిర్లక్ష్యం, యూనివర్సిటీ యాజమాన్యం అవసరమైన సౌకర్యాలను నిలిపివేయడం వంటి కారణాలతో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఆయా బస్తీల ప్రజలకు శాశ్వత పునరావాసం కల్పించే దిశగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోనే 20 ఎకరాల భూమిని కేటాయించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సీఎంను కోరారు. ఈ ప్రతిపాదన అమలుతో యూనివర్సిటీ యాజమాన్యానికి



సుమారు 70 ఎకరాల భూమి స్వేచ్ఛగా లభిస్తుందని, ఇది పరస్పర ప్రయోజనకరమని తెలిపారు. అదేవిధంగా, గత ఎంపీ ఎన్నికల సందర్భంగా మణికేశ్వర్ నగర్‌లో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ హామీ మేరకు ఆస్పత్రి నిర్మాణ ప్రతిపాదనను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. తార్నాక డివిజన్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, పార్కులు తదితర మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.25 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతులపై స్పందించిన ముఖ్యమంత్రి, వెంటనే వీటిపై వైస్ ఛాన్సలర్‌తో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎస్ఈసీ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్
- కోనరావుపేట, చందుర్తి, వేములవాడ రూరల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో తనిఖీ

**కోనరావుపేట/చందుర్తి/వేములవాడ రూరల్:** ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా కోనరావుపేట, చందుర్తి, వేములవాడ రూరల్ మండలాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీవీహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.





# ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

**వీర్నపల్లి:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. వీర్నపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అసౌకర్యం కలగొద్దు

- ఏర్పాట్లన్నీ వేగవంతం చేయాలి
- సమ్మక్క జాతర ఏర్పాట్లను పరిశీలించిన విప్



**వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రాబోయే సమ్మక్క%–%సారక్క జాతర దృష్ట్యా భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. బుధవారం దేవస్థానం అధికారులతో కలిసి భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఉచిత దర్శనం, కోడె క్యూలైన్, రూ.100, 300 క్యూలైన్, కల్యాణ కట్ట, వీఐపీ రోడ్డు క్యూలైన్లు పరిశీలించారు. అక్కడ అవసరమైన వసతులను సమీక్షించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న తాగునీటి సదుపాయం, దిశా నిర్దేశం కోసం సైన్ బోర్డులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానాల గదులు (షవర్స్), లైటింగ్ సదుపాయాలు, ఫ్యాన్లు, సీసీ కెమెరాల వ్యవస్థ, భద్రతా రంగు లైన్ మార్కింగులు, స్వామివారి – అమ్మవారి గోడలపై డిజైన్స్, శానిటైజేషన్ ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు సంబంధిత పనులను త్వరితగతిన పూర్తిచేసి, జాతర రోజుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి సన్నాహాలు చేయాలని ఆదేశించారు.

# రాత్రుల్లో ప్రలోభాలకు ప్రయత్నాలు

- కవర్లలో నగదు, బాటిల్స్‌లో మద్యం!
- బెండారలో పట్టుబడ్డ అభ్యర్థి?
- పంచాయతీ ఎన్నికల ప్రలోభాలు!
- వాంకిడి మండలం బెండార గ్రామంలో ఘటన!
- పోలింగ్‌కు ముందు తీవ్ర కలకలం!




**ఆసిఫాబాద్ :** రాష్ట్రంలో గురువారం మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వెలుగు చూశాయి. ముఖ్యంగా వాంకిడి మండలంలోని పలు వార్డు అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు అక్రమ మార్గాలను ఎంచుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

### బెండార గ్రామంలో బట్టబయలు..!

వాంకిడి మండలంలోని బెండార గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలింగ్‌కు కేవలం కొన్ని గంటల సమయం మాత్రమే ఉండగా, బుధవారం రాత్రి వార్డు అభ్యర్థి తమ అనుచరులతో కలిసి ఓటర్లకు డబ్బు, మద్యం పంచుతూ రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులకు పట్టుబడినట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవుతుంది. గ్రామంలో అభ్యర్థులు ఓటర్లకు ప్రలోభాలు పంచుతున్నారనే పక్కా సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు, రాత్రిపూట దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అభ్యర్థులు వారి అనుచరుల వద్ద డబ్బు, మద్యం నిల్వలు లభించినట్లు తెలుస్తోంది.

### ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు..!

పంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో అభ్యర్థులు ఇలాంటి అక్రమాలకు పాల్పడడం తీవ్ర నేరంగా పరిగణించబడుతోంది. పట్టుబడిన వార్డు అభ్యర్థి, అనుచరులపై పోలీసులు ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కింద కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు రోజు రాత్రి ఈ ఘటన వెలుగుచూడటంతో జిల్లా రాజకీయాల్లో, ముఖ్యంగా వాంకిడి మండలంలో తీవ్ర కలకలం రేగింది. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్న అధికారుల ప్రయత్నాలకు అడ్డు తగిలే విధంగా కొందరు అభ్యర్థులు వ్యవహరించడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### అధికారుల అప్రమత్తత అవసరం

ప్రలోభాలకు గురిచేసే అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు, ఎన్నికల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి



### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్:** ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవా రం ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా సమీపంలోని ఉర్దూ భవన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ మీడి యం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత టెట్ శిక్షణ కేంద్రాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలనే ఉ ద్దేశ్యంతో ఉచిత శిక్షణను అందిస్తున్నామని, పట్టణ కేంద్రంలో నిర్వహిస్తుండడంతో ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా అభ్యర్థులు టెట్ కోచింగ్ కు రావడం అభినందనీయమని, ప్రభుత్వ ఉద్యోగాలు ప్రతిఒక్కరికి రావని, కానీ శిక్షణతో ప్రైవేట్ రంగంలో సైతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. నిత్యం తరగతులకు హాజరవుతూ వచ్చే డీఎస్సీలో అత్యధిక మంది ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఉర్దూ భవన్‌లో లైబ్రరీ ఏర్పాటుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు ఉర్దూ భవన్ లో ప్రత్యేక నిధులతో చేపట్టిన మరమ్మత్తులను మైనారిటీ సంక్షేమ అధికారి కలీం కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా యువజన క్రీడల సంక్షేమ అధికారి శ్రీని వాస్, అధికారులు, ట్రైనర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.






# ఎన్నికల నేపథ్యంలో బాంబు డిస్పోజల్ టీమ్ తనిఖీలు

**జైనూర్:** గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో బాంబు డిస్పోజల్ టీమ్ తనిఖీలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ నితిక పంత్ అన్నారు. భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి జిల్లా పరిధిలోని కెరమెరి, వాంకిడి, జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యు) మండలాల్లో జిల్లా పోలీస్ బాంబు డిస్పోజల్ టీమ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ముందు భద్రతా పరిస్థితిని సమగ్రంగా సమీక్షిస్తూ, పోలింగ్ కేంద్రాలు, రూట్ మ్యాపులు, ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, బస్ స్టాండ్లు, మార్కెట్ యార్డులు, గ్రామ ప్రవేశ ద్వారాల వద్ద తనిఖీలు జరిపినట్లు వివరించారు. బాంబు డిస్పోజల్ టీమ్ సిబ్బంది అనుమానాస్పద వస్తువులను గుర్తించే విధానం, భద్రతా ప్రోటోకాల్, అత్యవసర స్పందన చర్యలను సమీక్షించడం జరిగిందని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు అన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్, రిజర్వ్ పోలీస్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, రూట్ మొబైల్ టీమ్స్ నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడరాదని, జిల్లా పోలీసులు ఎన్నికల భద్రతాపై పూర్తి దృష్టి సారించినట్లు వివరించారు.





# పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ఎంచికల్ పేట్:** ఈనెల 11, 12 తేదీల్లో జిల్లాలోని పెంచికల్ పేట్ మండలంలో జరిగే రెండొవ విడత ఎన్నికల్లో భాగంగా అధికారులు పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవా లని ఎంపీడీఓ ఆల్బర్ట్ ఒక ప్రకట నలో తెలిపారు. అర్హత ఉన్న ప్రభు త్వ ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని పూర్తిగా వినియోగిం చుకుని తమ ఓటును నమోదు చేయాలని సూచించారు. దీనిని వినియోగించడానికి ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ కాపీ, ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు తీసుకొచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ విస్తృత ప్రచారం



**పెంచికల్‌పేట్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి జోరందుకుంది. ఈ క్రమంలో, పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి భక్తు సంతోష్ కు మద్దతుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'లేడీ పర్సు' గుర్తుకు ఓటేసి భక్తు సంతోష్ గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని, అధికార పార్టీని గెలిపిస్తేనే అభివృద్ధికి బాటలు వేయగలుగుతామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, బెస్త మరియు మైనార్టీ కమ్యూనిటీల కోసం కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. వీటికి తోడు, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని అన్నారు. సర్పంచ్ అభ్యర్థి గెలిచిన వెంటనే సుమారు కోటి రూపాయలతో ఎల్కపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని కూడా ఆయన హామీ ఇచ్చారు.




# అభివృద్ధికి సహకరించాలి

**గంభీరావుపేట:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గంభీరావుపేట సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వారు ఏ పార్టీకి చెందినవారైనా గెలుపొందిన అనంతరం గంభీరావుపేట అభివృద్ధికి సహకరించాలని గంభీరావుపేట గ్రామ సేవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లా డుతూ గంభీరావుపేట ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టి, స్థానిక గాంధీ నడిబొడ్డున ఉన్న మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామ ప్రజల తరుపున కోరారు. ఈ సమావేశంలో గ్రామ సేవ కమిటీ అధ్యక్షులు సిరిపురం రవి, ప్రధాన కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షులు కొత్తపల్లి చేపూరి ప్రభాకర్, కోశాధికారి రాగిశెట్టి నారాయణ, కార్యవర్గ సభ్యులు కోటలింగం, గంద్యడపు రాజు, జెల్ల బుదయ్య, శ్రీనివాసు, కృష్ణ, పార్థసారథి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



**ఆదిలాబాద్:** అధికార పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ కోరారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం తలమడుగు మండలంలోని ఉండం, సాయి లింగి, కుచ్చులాపూర్ గ్రామాల్లో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీబీ అడ్డి భోజారెడ్డి, ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, బాబన్నలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల తప్పుడు మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన వచ్చాక రెండేళ్ల కాలంలోనే గ్రామాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజిలు, పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించామన్నారు. అధికార పార్టీ అభ్యర్థులు గెలిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలమడుగు, గుడిహత్నూర్ మండలాల అధ్యక్షులు కళ్యాణం రాజేశ్వర్, మల్యాల కరుణాకర్, ప్రకాష్ రావు, వెంకన్న, వివిధ మండలాల నాయకులు, సర్పంచ్ అభ్యర్థులు, వార్డ్ మెంబర్లు అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో బోరంచు



**ఆదిలాబాద్:** ప్రజల మధ్య ఉంటూ సేవా చేసే ధర్మపురి చంద్రశేఖర్ ను మావల సర్పంచ్ గా భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఓటర్లను కోరారు. గ్రామపంచాయితీ సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మావల పంచాయి తీ పరిధిలో ప్రచారం చేపట్టా రు. అధికార పార్టీ బలపర్చిన మావల గ్రామపంచాయితీ సర్పంచ్ అభ్యర్థి ధర్మపురి చంద్రశేఖర్ కు మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ఫుట్ బాల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉండి సమస్యల పరిష్కారం కోసం పాటుపడిన శేఖర్ కు ఈసారి అవకాశం ఇవ్వాలన్నారు. అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుం దని పేర్కొన్నారు. వారి వెంట కాంగ్రెస్ శ్రేణులు ఉ న్నారు.

# ప్రతి పైసాకు లెక్క చూపాలి

**నేరడిగొండ:** సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికల్లో చేసిన ప్రతి పైసాకు లెక్క చూపాలని ఎన్నికల నోడల్ అధికారి ఎంఎ కలీమ్, ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ జిల్లా అధికారి మోహన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థుల ప్రచార నిమిత్తం చేసే ఖర్చు, ఎన్నికల నియామాళి, నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిమిత్తం రోజువారి ప్రతి అభ్యర్థి చేసే ఖర్చులు రాసి లెక్క చూపెట్టాలని సూచించారు. 5వేల జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2లక్షల 50వేలు వరకు, 5వేల లోపు జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1లక్ష 50వేల వరకు ఖర్చు పెట్టవచ్చని తెలిపారు. ప్రచార సామాగ్రికి కోసం చేసే ఖర్చులు రోజు రాసిపెట్టాలని పేర్కొన్నారు. అభ్యర్థులు గెలిచినా, ఓడినా 45 రోజుల లోపు లెక్క చూపాలన్నారు. సర్పంచ్ అభ్యర్థులు ప్రచారం కోసం అనుమతి లేనిది వాహనాలు వాడరాదని తెలిపారు. డబ్బులు, లిక్కరు పంచడం చేసే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ మండల అధికారి రియాజోద్దీన్, ఎంపిడిఓ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కు వినియోగానికి 18 రకాల గుర్తింపు కార్డులు

**కలెక్టర్ సిక్తా పట్నాయక్ వెల్లడి**



**నారాయణపేట, డిసెంబర్ 10 (మనసులో మాట):**

నారాయణపేట జిల్లాలో ఈ నెల 11, 14, 17 తేదీలలో మూడు విడతలుగా జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఎన్నికల సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు, నిర్దేశిత 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒక దానిని తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లు తమ గుర్తింపు కోసం ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్ లేదా బ్యాంక్ పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా పాన్ కార్డును చూపించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. వీటితో పాటు ఫోటోతో కూడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధృవీకరణ పత్రాలు, ఇండియన్ పాస్పోర్ట్, ఫోటో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు కూడా చెల్లుబాటు అవుతాయని తెలిపారు. అలాగే దివ్యాంగుల గుర్తింపు కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, రేషన్ కార్డు, ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం, ఫ్రీడం ఫైటర్ ఐడీ కార్డు లేదా ఆర్జీఐ ద్వారా జారీ చేయబడిన ఎన్.పీ.ఆర్ స్మార్ట్ కార్డులలో ఏదో ఒక దానిని పోలింగ్ అధికారులకు చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు.

# వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం

**జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్**

**నారాయణపేటలో ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం**

**చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచన**



**నారాయణపేట, డిసెంబర్ 10 (మనసులో మాట):**

జాతి, మత, లింగ, రాజకీయ కారణాలతో ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదని, మానవ హక్కులను పరిరక్షిస్తూ వివక్ష లేని సమాజాన్ని నిర్మించుకుందామని నారాయణపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ బి. సాయి మనోజ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నారాయణపేట టౌన్‌లోని మార్కండేయ దేవాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి సాయి మనోజ్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పౌర, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులపై అవగాహన కల్పించేందుకే ఏటా డిసెంబర్ 10న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.


మానవ హక్కుల ప్రధాన లక్ష్యం కుల, మత, వర్ణ, లింగ వివక్ష లేని జీవనం గడపడమేనని ఆయన స్పష్టం చేశారు. చిత్రహింసలు, క్రూరత్వం, వెట్టిచాకిరీ, బానిసత్వం వంటి దురాచారాల నుంచి రక్షణ పొందడం, నిర్బంధం లేని జీవన విధానం, స్వేచ్ఛగా స్వదేశం, విదేశాల్లో పర్యటించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని గుర్తుచేశారు. నిరంకుశత్వానికి, అణచివేతకు వ్యతిరేకంగా మనుషులు తిరుగుబాటును ఆశ్రయించకుండా ఉండాలంటే, చట్టబద్ధ పాలన ద్వారా మానవ హక్కులను రక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ, విశ్వాసాల విషయంలో స్వేచ్ఛ, భయం, లేమి నుంచి విముక్తి ఉన్న ప్రపంచాన్ని ఆవిష్కరించుకోవడం అందరి ఆకాంక్ష అని అన్నారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి సూచించారు. ఈ సందర్భంగా పిల్లల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం అనైతిక ట్రాఫిక్ నివారణ చట్టం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే తల్లిదండ్రులదే బాధ్యత అని హెచ్చరించారు. అలాగే వరకట్న వేధింపులు, మహిళా రక్షణ కోసం సఖి సెంటర్లు, వయోవృద్ధుల కోసం ఉన్న చట్టాలు, ఓల్డేజ్ హొమ్స్, సామాన్య ప్రజలు ఉచిత న్యాయ సేవలు పొందే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్, పారా లీగల్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేషనల్స్ కు ఎంపికైన పరిగి యువ క్రికెటర్ సాయి రిత్విక్

**మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ ఘన సన్మానం**

**పరిగి, డిసెంబర్ 10 (మనసులో మాట):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేదికగా ఇటీవల జరిగిన 69వ ఎస్జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అండర్-14 క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పరిగికి చెందిన యువ క్రికెటర్ సాయి రిత్విక్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. తన ఆటతీరుతో ఆకట్టుకున్న రిత్విక్ జాతీయ స్థాయి పోటీలకు (నేషనల్స్) ఎంపికై సత్తా చాటాడు. వికారాబాద్ జిల్లా నుంచి ఈ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిగా రిత్విక్ గుర్తింపు పొందడం విశేషం. ఈ ఘనత సాధించిన సాయి రిత్విక్‌ను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ బుధవారం తన నివాసంలో శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. పరిగి పట్టణానికి చెందిన కానిస్టేబుల్ రవికుమార్, ఉపాధ్యాయురాలు సాహితీ దంపతుల కుమారుడైన రిత్విక్ చిన్ననాటి నుంచే క్రికెట్‌పై మక్కువ పెంచుకుని రాణిస్తున్నాడు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ, పరిగి నుంచి ఒక క్రీడాకారుడు జాతీయ స్థాయికి ఎంపిక కావడం నియోజకవర్గానికే గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో రిత్విక్ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. అలాగే రిత్విక్‌ను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, మురళీకృష్ణలను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్. ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జాక్ రవికుమార్ తదితరులు పాల్గొని రిత్విక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# పోలింగ్ సకాలంలో ప్రారంభించాలి

- పోలింగ్ సకాలంలో ప్రారంభించాలి
- మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి



**మద్దూరు/కోస్గి, డిసెంబర్ 10 (మనసులో మాట):**

నారాయణపేట జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల కోసం యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 11న మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్, కోస్గి మండలాల్లో జరగనున్న పోలింగ్ నిర్వహణకు సంబంధించి ఎన్నికల సామాగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం సందర్శించారు. ముందుగా మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రానికి వెళ్లిన కలెక్టర్, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాగ్రి తీసుకున్న సిబ్బంది బ్యాలెట్ పత్రాలు, బాక్సులు, పోటీ చేసే అభ్యర్థుల గుర్తులు సక్రమంగా ఉన్నాయా లేదా అని ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వెంటనే ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలని, విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటల సరఫరా ఉండేలా, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభించాలని, మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మొదటి విడత ఎన్నికలు ప్రశాంతంగా జరిగితే మిగతా రెండు విడతలు కూడా సాఫీగా సాగుతాయని, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఉంటుందని ఆమె తెలిపారు. అనంతరం కలెక్టర్ కోస్గి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన తాగునీరు, వైద్య శిబిరం, భోజన వసతి, షామియానాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా చెక్ లిస్టు ఆధారంగా సామాగ్రిని పక్కాగా అందించాలని, బ్యాలెట్ పేపర్ల తరలింపు సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసు బందోబస్తు ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ సిబ్బందిని, పోలీసులను తరలించేందుకు వాహనాలను సిద్ధం చేశామని, వారు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సామాగ్రి సర్దుకుని భోజనం చేస్తున్న పీవోలు, ఓపీవోల వద్దకు వెళ్లిన కలెక్టర్, భోజన వసతిపై ఆరా తీస్తూ వారికి 'బెస్ట్ ఆఫ్ లక్' చెప్పారు. ఇదిలాఉండగా, జిల్లా అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను.. కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి పంపిణీ తీరుతెన్నులను పర్యవేక్షించారు. ఈ పర్యటనలో ఎస్డీసీ రాజేందర్ గౌడ్, డీఆర్డీవో మొగులప్ప, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

**ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం - అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు**

**ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట/కొడంగల్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

నారాయణపేట జిల్లాలో జరగనున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మద్దూరు, కొత్తపల్లి, కోస్గి, గుండుమాల్ మండలాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు వచ్చిన పోలీసు అధికారులకు, సిబ్బందికి మద్దూరులోని షా గార్డెన్ ఫంక్షన్ హాల్, కోస్గిలోని పంచాక్షరి ఫంక్షన్ హాల్‌లలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎస్పీ భద్రతాపరమైన దిశానిర్దేశం చేశారు. ఈ నాలుగు మండలాల పరిధిలో మొత్తం 650 మంది సివిల్ పోలీస్ ఫోర్స్, రెండు టీఎస్ఎస్పీ బెటాలియన్లు, సీఐడీ బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

జిల్లాలోని ఈ నాలుగు మండలాల్లో మొత్తం 67 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో 12 ఏకగ్రీవం అయ్యాయని, మిగిలిన 55 పంచాయతీలకు పోలింగ్ జరుగుతోందని ఎస్పీ వివరించారు. వీటిలో 13 సమస్యాత్మక గ్రామ పంచాయతీలు, 27 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అక్కడ అదనపు బలగాలతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని తెలిపారు. మద్దూరు, కొత్తపల్లి మండలాలను 18 రూట్లుగా, కోస్గి, గుండుమాల్ మండలాలను 15 రూట్లుగా విభజించి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రూట్ మొబైల్ ఆఫీసర్లు నిరంతరం గస్తీ తిరుగుతూ, గ్రామాల్లో గుంపులుగా ఉండకుండా చూడాలని, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, డబ్బు పంపిణీ జరగకుండా, రాజకీయ ప్రచారాలు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




# డిసెంబర్ 20లోగా ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి

**జీహెచ్ఎంసీ**

**పెనాల్టీ లేకుండా గడువు వినియోగించుకోవాలని సూచన**

**హైదరాబాద్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వ్యాపార సంస్థల నిర్వాహకులు 2026 సంవత్సరానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్సులను డిసెంబర్ 20, 2025 లోపు రెన్యువల్ చేసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, నిర్ణయించిన ఈ గడువు లోపు రెన్యువల్ చేసుకుంటే ఎటువంటి పెనాల్టీ (అపరాధ రుసుము) ఉండదని స్పష్టం చేశారు. వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం పెనాల్టీ వివరాలను కూడా అధికారులు వెల్లడించారు. డిసెంబర్ 20, 2025 వరకు ఎలాంటి పెనాల్టీ ఉండదు. అయితే, గడువు ముగిసిన తర్వాత అంటే డిసెంబర్ 21, 2025 నుంచి ఫిబ్రవరి 19, 2026 మధ్య రెన్యువల్ చేసుకుంటే 25 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఫిబ్రవరి 20, 2026 ఆ తర్వాత రెన్యువల్ చేసుకుంటే 50 శాతం పెనాల్టీ విధిస్తారని తెలిపారు. పెనాల్టీ లేకుండా రెన్యువల్ చేసుకునేందుకు చివరి తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో, చివరి నిమిషంలో రద్దీని, భారీ జరిమానాలను తప్పించుకోవడానికి వ్యాపారులు ముందుగానే తమ లైసెన్సుల రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జీహెచ్ఎంసీ విజ్ఞప్తి చేసింది.

# భద్రకాళి బండ్ పనులను త్వరగా పూర్తి చేయండి

**మేయర్ గుండు సుధారాణి**

**కమిషనర్‌తో కలిసి అభివృద్ధి పనుల పరిశీలన**



**వరంగల్, డిసెంబర్ 10 (మనసులో మాట):**

వరంగల్ నగరంలోని చారిత్రక భద్రకాళి బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి బండ్ పై తుది దశకు చేరుకున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న మేయర్, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, భద్రకాళి బండ్‌పై చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికే చివరి దశలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఈఈలు రవికుమార్, మాధవిలత, ఏఈ సంతోష్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మొదటి దశ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం, డిసెంబర్ 9 (మనసులో మాట):**



ఖమ్మం జిల్లాలో జరగనున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎన్నికల వివరాలను వెల్లడించారు. డిసెంబర్ 11న జిల్లాలోని 7 మండలాల పరిధిలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 192 గ్రామ పంచాయతీలకు గాను 20 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 172 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ స్థానాల కోసం 488 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే మొత్తం 1740 వార్డులకు గాను 2 వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదని, 323 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 1415 వార్డులకు గాను 3424 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ మరియు కౌంటింగ్ ఒకే రోజు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం మధ్యాహ్నం 2 గంటల తర్వాత అక్కడే ఓట్ల లెక్కింపు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2,41,137 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1,16,384 మంది పురుషులు, 1,24,743 మంది మహిళలు, 10 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 2089 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడంతో పాటు, 1899 మంది పోలింగ్ అధికారులు, 2321 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ మరియు సేకరణ కోసం 7 డిస్ట్రిబ్యూషన్, 7 రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలను కూడా కట్టుదిట్టం చేశారు. జిల్లాలో 36 సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లను గుర్తించామని, 360 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయగా, 162 సున్నితమైన (సెన్సిటివ్) కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరిగేలా చూసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు తమ సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విజ్ఞప్తి చేశారు.

# మరో ఆసక్తికర పోరుకు టీమిండియా సిద్ధం

## నేడు న్యూ ఛండీగఢ్ వేదికగా రెండో టీ20

సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. న్యూ ఛండీగడ్ వేదికగా గురువారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభమయ్యే రెండో టీ20లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. కటక్ వేదికగా జరిగిన తొలి టీ20లో టీమిండియా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తా చాటి 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టీ20లోనూ అదే జోరును కొనసాగించాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు చెత్త బ్యాటింగ్‌తో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సౌతాఫ్రికా.. రెండో టీ20లోనైనా గట్టి పోటీనివ్వాలనే పట్టుదలతో ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలి టీ20 విజయంతో టీమిండియా కాంబినేషన్‌లో మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. గాయం నుంచి కోలుకొని బరిలోకి దిగిన శుభ్‌మన్ గిల్ తీవ్రంగా నిరాశపర్చాడు. వన్డే, టెస్ట్‌ల్లో సత్తా చాటుతున్న గిల్.. టీ20ల్లో మాత్రం ఆశించిన రీతిలో రాణించలేకపోతున్నాడు. తొలి మ్యాచ్‌లో 4 పరుగులే చేసి వెనుదిరిగాడు. రెండో టీ20లోనైనా అతను సత్తా చాటాలి. లేదంటే అతనిపై విమర్శలు ఎక్కువవుతాయి. ఫస్ట్ డౌన్‌లో ఆడిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తీవ్రంగా నిరాశపర్చాడు. ఈ ఏడాది సూర్య ఒక్క మ్యాచ్‌లో కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. గత 15 ఇన్నింగ్స్‌ల్లో ఒక్క హాఫ్ సెంచరీ లేదు. కనీసం రెండో టీ20లోనైనా సూర్య సత్తా చాటాలి. తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబేలు కూడా బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. తొలి టీ20లో హార్దిక్ పాండ్యా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. అతను అదే జోరు కొనసాగించాల్సి ఉంది. చివర్లో తనదైన శైలిలో ఫినిష్ ఇచ్చేందుకు జితేష్ సిద్దంగా ఉన్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తికి తిరుగులేదు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లు కూడా సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలోనే తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం కనిపించడం లేదు. దాంతో హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లకు మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.



**భారత్ తుది జట్టు(అంచనా)**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ/సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్/అర్ష్‌దీప్ సింగ్

**భారత టీ20 టీమ్**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ,సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.



# రెండో స్థానానికి విరాట్ కోహ్లీ

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ విడుదల

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజాగా రిలీజ్ చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రెండో స్థానానికి దూసుకెళ్లాడు. రీసెంట్‌గా సౌతాఫ్రికా సిరీస్‌లో సత్తా చాటడంతో విరాట్ రెండు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. ప్రస్తుతం అతడు 773 రేటింగ్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అగ్రస్థానం నిలబెట్టుకున్నాడు. అతడు 781 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. వన్డే ర్యాకింగ్స్‌లో టాప్ - 2 స్థానాల్లో టీమ్‌ఇండియా బ్యాటర్లే ఉండడం విశేషం.టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ఇచ్చేసిన భారత సీనియర్ బ్యాటర్లు కోహిత్, విరాట్ వన్డేల్లోనే కొనసాగుతున్నారు. 2027 వరల్డ్‌కప్‌లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఇద్దరు స్టార్లు ప్రస్తుతం అత్యుత్తమ ఫామ్ కనబరుస్తున్నారు. టీమ్‌ఇండియా ఆడిన గత రెండు సిరీస్‌ల్లో ఈ ఇద్దరే టాప్ స్కోరర్లుగా నిలిచారు. అక్టోబర్‌లో ఆసీస్ సిరీస్‌లో రోహిత్ శర్మ, ఇటీవల ముగిసిన సౌతాఫ్రికా సిరీస్‌లో విరాట్ కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' లుగా నిలిచారు. దీంతో లేటెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్ 2 స్థానాల్లో కొనసాగుతున్నారు.అక్టోబర్ నెలలో ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ ఆకట్టుకున్నాడు. దాదాపు ఏడు నెలల తర్వాత ఈ సిరీస్‌తోనే ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. తొలి మ్యాచ్‌లో విఫలమైనా, తర్వాత రెండు వన్డేల్లోనూ హిట్‌మ్యాన్ తనదైన ఆటలో అలరించాడు. అడిలైడ్‌లో 73 పరుగులతో ఆకట్టుకున్న రోహిత్, సిడ్నీ వన్డేలో (121పరుగులు ) సెంచరీతో అదరగొట్టాడు. మొత్తం సిరీస్‌లో 202 పరుగులు బాదాడు.ఇటీవల ముగిసిన సౌతాఫ్రికా సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. మూడు మ్యాచ్‌ల్లోనూ రాణించాడు. ఇందులో 2 సెంచరీలు, 1 హాఫ్ సెంచరీ ఉండడం విశేషం. 151 యావరేజ్‌తో విరాట్ 302 పరుగులు చేశాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. వన్డే కెరీర్‌లో విరాట్‌కు ఇది 12వ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్. ఈ క్రమంలో శ్రీలంక మాజీ క్రికెటర్ సనత్ జయసూర్య (11)ను అధిగమించాడు. ఈ లిస్ట్‌లో సచిన్ తెందూల్కర్ (15) తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు.ఇక బౌలింగ్ విభాగంలో స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. 655 రేటింగ్ పాయింట్లతో కుల్దీప్ వన్డే బౌలింగ్ ర్యాకింగ్స్‌లో ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. 710 రేటింగ్స్‌తో అఫ్గానిస్థాన్ బౌలర్ రషీద్ ఖాన్ టాప్‌లో ఉండగా, ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ (670 రేటింగ్స్) రెండో ప్లేస్?లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో అఫ్గాన్ క్రికెటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (334 రేటింగ్స్) టాప్‌లో ఉన్నాడు.



# మహికా శర్మ వల్లే నేను రాణించాను

## టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా

తన ప్రియురాలు మహికా శర్మ వల్లే సౌతాఫ్రికాతో తొలి టీ20లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చానని టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం కటక్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 101 పరుగుల భారీ తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది. 176 పరుగుల లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 74 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా(28 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు. బౌలింగ్‌లోనూ ఒక వికెట్ తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన వేళ అద్భుత బ్యాటింగ్‌తో జట్టుకు భారీ స్కోర్ అందించాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్నాడు. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న హార్దిక్ పాండ్యా.. సానుకూల దృక్పథమే తనను తిరిగి మైదానంలో అడుగు పెట్టేలా చేసిందని తెలిపాడు. 'గాయం తర్వాత నేను మరింత దృఢంగా తిరిగి వచ్చాను. గాయాలు మనల్ని మానసికంగా పరీక్షిస్తాయి. బలంగా నిలబడటం వల్లే నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. నా మీద నాకు చాలా నమ్మకం ఉంది. నిజానికి మనల్ని మనం కచ్చితంగా నమ్మాలి. మనమీద మనకే విశ్వాసం లేనప్పుడు ఇతరులు మనల్ని ఎలా నమ్ముతారు. మైదానంలో దిగిన ప్రతీ క్షణాన్ని, ఆటను ఆస్వాదించాలనుకున్నా. జనాలను ఆకట్టుకునేలా ఆడాలనుకోవడమే నాకు అసలైన ప్రేరణ. అలాగే నేను రాణించడానికి నా ప్రియురాలు కూడా ఓ కారణం. ఆమె నా జీవితంలోకి వచ్చిన తర్వాత చాలా మంచి జరిగింది.'అని హార్దిక్ పాండ్యా తన ప్రియురాలు మహికా శర్మ గురించి చెప్పుకొచ్చాడు. ముంబైలో కొందరు ఫొటోగ్రాఫర్లు మహికా శర్మను అసభ్యంగా ఫొటోలు తీయడంపై హార్దిక్ పాండ్యా ఆగ్రహం వ్యక్తం చేశాడు. మహిళలకు కనీస గౌరవం ఇవ్వాలని , ప్రతీ ఒక్కరికీ హద్దులుంటాయని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు. మహికా శర్మ లోదుస్తులు కనిపించేలా ఫొటోలు, వీడియోలు తీయగా.. అవి నెట్టింట వైరల్‌గా మారాయి.



# గౌతమ్ గంభీర్‌పై షాహిద్ అఫ్రిది ఫైర్!

భారత క్రికెట్ జట్టులో వెటరన్ ఆటగాళ్ల కొనసాగింపుపై చర్చ జరుగుతున్న సమయంలో పాక్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల అద్భుత ప్రదర్శన తర్వాత షాహిద్ అఫ్రిది వారిని 2027 ప్రపంచ కప్ వరకు జట్టులో కొనసాగించాలని గట్టిగా వాదించారు. ఈ నేపథ్యంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. భారత వన్డే ప్రణాళికలకు ఈ ఇద్దరూ చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. టీమిండియా ఈ ఇద్దరు దిగ్గజాలను తెలివిగా ఉపయోగించుకోవాలని అఫ్రిది సూచించారు. బలహీన జట్లతో ఆడేటప్పుడు వారికి విశ్రాంతి ఇచ్చి కీలక సిరీస్‌లలో వారిని ఆడించాలని చెప్పారు. "విరాట్, రోహిత్ భారత బ్యాటింగ్ లైనప్‌కు వెన్నెముక అనే వాస్తవాన్ని అంగీకరించాలి. ఇటీవల వన్డే సిరీస్‌లలో వారు ఆడిన తీరు చూస్తే, వారు 2027 ప్రపంచ కప్ వరకు సులభంగా ఆడగలరని నమ్మకంగా చెప్పవచ్చు. మీరు ఈ ఇద్దరు స్టార్స్‌ను రక్షించుకోవాలి. భారతదేశం ఒక బలహీనమైన జట్టుతో ఆడుతున్నప్పుడు, కొత్త ఆటగాళ్లను ప్రయత్నించి, విరాట్, రోహిత్‌లకు విశ్రాంతి ఇవ్వవచ్చు." అని అఫ్రిది వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా అఫ్రిది, గౌతమ్ గంభీర్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ఆల్‌రౌండర్ భారత హెడ్ కోచ్‌ను విమర్శించడానికి వెనుకాడలేదు. గంభీర్ సారథ్యంలో టీమిండియా మిశ్రమ ఫలితాలను చవిచూసింది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌ను గెలిచినప్పటికీ, టెస్టుల్లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మరియు దక్షిణాఫ్రికా చేతుల్లో ఓటమిని ఎదుర్కొంది. "గౌతమ్ తన పదవీకాలాన్ని ప్రారంభించిన తీరు చూస్తే, తాను అనుకున్నది, తాను చెప్పింది మాత్రమే సరైనదని అతను భావించినట్లు అనిపించింది. కానీ కొంతకాలం తర్వాత, మీరు ఎల్లప్పుడూ సరైనవారు కారని నిరూపించబడింది." అని అఫ్రిది విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా అఫ్రిది వన్డేల్లో అత్యధిక సిక్సర్ల రికార్డును బద్దలు కొట్టినందుకు రోహిత్ శర్మను అభినందించారు. ఐపీఎల్ 2009లో డెక్కన్ ఛార్జర్స్ తరఫున రోహిత్‌తో కలిసి ఆడిన అఫ్రిది, అప్పుడే రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్ద స్టార్ అవుతాడని తనకు తెలుసునని చెప్పారు. "రికార్డులు బద్దలు కొట్టడానికే ఉంటాయి, ఈ రికార్డు కూడా ఇప్పుడు మెరుగుపడింది. నేను ఎప్పుడూ ఇష్టపడే ఆటగాడు ఈ రికార్డును బద్దలు కొట్టినందుకు నేను సంతోషిస్తున్నాను." అని షాహిద్ అఫ్రిది పేర్కొన్నారు.

# ఆర్‌సీబీ షార్ట్‌లిస్ట్ సిద్ధం



డిఫెండింగ్ ఛాంపియన్‌లైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, జోష్ హాజిల్‌వుడ్, కెప్టెన్ రజత్ పాటిదార్ వంటి స్టార్లతో కూడిన 17 మంది ఆటగాళ్ల స్థిరమైన కోర్‌తో ఇండియన్ ప్రీమియర్ లీగ్ మినీ-వేలంలోకి ప్రవేశిస్తోంది. ఛాంపియన్‌షిప్ హోదాను కాపాడుకోవడానికి చిన్నపాటి, నిర్దిష్టమైన ఖాళీలను భర్తీ చేయడమే వ్యూహంగా వేలంలోకి దిగనుంది. విదేశీ ఆల్ రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, పేసర్ లుంగి ఎన్‌గిడిల విడుదలతో ఏర్పడిన ఎనిమిది ఖాళీలను (రెండు విదేశీ స్థానాలతో సహా) భర్తీ చేయడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ. 16.40 కోట్లను ఖర్చు చేయనుంది. జోష్ హాజిల్‌వుడ్, నువాన్ తుషారాలతో పేస్ ఎటాక్‌లో డెప్త్ ఉన్నప్పటికీ, హాజిల్‌వుడ్ పనిభారం నిర్వహణ, తుషారాకు తగినంత అనుభవం లేకపోవడం వల్ల, వారితో భాగస్వామిగా ఉండటానికి లేదా రొటేట్ చేయడానికి అధిక ప్రభావం చూపే, ప్రపంచ స్థాయి పేస్ బౌలర్ అవసరం. ఇది అత్యంత కీలకమైన విదేశీ ప్లేయర్ అవసరాన్ని సూచిస్తుంది. ఢిల్లీ క్యాపిటల్స్ విడుదల చేసిన అన్రిచ్ నోర్జే ఇందుకు సరిగ్గా సరిపోతాడు. అతను పవర్ ప్లే, మిడిల్ ఓవర్లలో 145ం కిమీ/గం వేగంతోపాటు దూకుడును అందిస్తాడు. ఇది బెంగళూరులోని ఫ్లాట్ పిచ్‌లపై విలువైన ఆస్తిగా మారనుంది. దక్షిణాఫ్రికాకు చెందిన మరో ఆప్షన్ గెరాల్డ్ కోయెట్జీ (గుజరాత్ విడుదల చేసింది). అతను హాజిల్‌వుడ్‌కు దీర్ఘకాలిక బ్యాకప్‌గా పనిచేయడానికి విలువైన ఎంపిక. డెత్ ఓవర్లలో స్పెషలిస్ట్‌గా నిరూపించుకున్న ముస్తాఫిజుర్ రెహమాన్ ను తిరిగి తీసుకురావాలని కూడా భావించవచ్చు. టాప్-ఆర్డర్ పటిష్టంగా ఉంది. కానీ ఫ్రాంచైజీకి స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని, మిడిల్ ఆర్డర్‌లో గేమ్‌లను ముగించగల నాణ్యమైన భారతీయ బ్యాటర్ అవసరం. పరిమిత విదేశీ స్లాట్‌లతో సౌలభ్యాన్ని అనుమతించడానికి ఇది కీలక దృష్టిగా మిగిలిపోయింది. వెంకటేష్ అయ్యర్ వారి ప్రధాన లక్ష్యం. అతను ఎడమచేతి వాటం పవర్, 3 లేదా 4వ స్థానంలో బ్యాటింగ్ చేసే సామర్థ్యం, ఉపయోగకరమైన పేస్ బౌలింగ్‌ను అందిస్తాడు. మరింత వాస్తవిక, బడ్జెట్‌కు అనుకూలమైన లక్ష్యం మహిపాల్ లోమ్రోర్. అతను మిడిల్ ఆర్డర్‌తోపాటు లెగ్-స్పిన్‌ను సంధించగల ఎడమచేతి వాటం భారతీయ ఆల్ రౌండర్. ఫ్రాంచైజీ పృథ్వీ షా వైపు కూడా చూడవచ్చు. కృనాల్ పాండ్యా, సుయాష్ శర్మల స్పిన్ ద్వయాన్ని అట్టిపెట్టుకున్నప్పటికీ, 2025లో నిజమైన, అధిక ప్రభావం చూపే వికెట్లు తీసే స్పిన్నర్ లేరు. దీనిని పరిష్కరించడానికి, వారు ఎలైట్ (అత్యుత్తమ) ఆప్షన్ కోసం ప్రయత్నిస్తారని భావిస్తున్నారు. రవి బిష్ణోయ్కి డిల్ ఓవర్లలో వికెట్లు తీసే ముప్పును ఎక్కువగా కలిగి ఉంటాడు. ఇది జట్టుకు భారీ అప్‌గ్రేడ్ అవుతుంది. వనిందు హసరంగా తో పునఃకలయిక కూడా సాధ్యమే. లియామ్ లివింగ్‌స్టోన్ విడుదలతో ఒక బహుముఖ విదేశీ బ్యాటింగ్ ఆల్ రౌండర్ కోసం చిన్న ఖాళీని మిగిల్చింది. మైఖేల్ బ్రేస్‌వెల్ ఈ అవసరానికి సరిగ్గా సరిపోతాడు. అతను మిడిల్ ఆర్డర్‌లో ఎడమచేతి వాటం బ్యాటింగ్, పొదుపుగా ఉండే ఆఫ్-స్పిన్‌ను అందిస్తాడు. దీని వలన అతను కృనాల్ పాండ్యాకు అనుబంధంగా ఉండటానికి అనువైన రొటేషనల్ ప్లేయర్‌గా మారుతాడు.

# వారణాసిలో యుగయుగాల చరిత్ర

## ఐదు అవతారాల్లో మహేశ్

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' మీద ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇండియన్ సినిమా చరిత్రలోనే రికార్డు స్థాయి బ్జడెట్‌తో నిర్మాణం జరుపుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరవేయాలనే లక్ష్యంతో రాజమౌళి ప్రతి ప్రమోషన్‌ను అత్యున్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇక ఇదిలా ఉంటే వారణాసికి సంబంధించిన మరో వార్త కూడా నెట్టింట వైరల్‌గా మారింది.చిత్రంలో మహేష్ ఏకంగా ఐదు అవతారాల్లో కనిపించబోతున్నాడని అంటున్నారు. సినిమాలో చాలా యుగాలు చూపించబోతున్న నేపథ్యంలో యుగానికి ఓ అవతారంలో మహేష్ కనిపిస్తాడా అని ముచ్చటించుకుంటున్నారు. గెటప్స్ ఏంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే . రాజమౌళి అయితే వీటిని ఇప్పట్లో రివీల్ చేసే అవకాశం అసలు లేదు. వారణాసిలో మహేష్ రెండు లుక్స్ లో కనిపించబోతున్నారనే క్లారిటీ ఇప్పటికే ఉంది. రుద్ర అనే పాత్రతో పాటు రాముడిగా కనిపించి మహేష్ అలరించనున్నాడు.ఇదే క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో వెలుగుచూసిన కొన్ని ఫోటోలు భారీ హంగామా సృష్టించాయి. లాస్ వెగాస్‌లోని ప్రపంచ ప్రసిద్ధ స్పియర్ బాల్‌పై 'వారణాసి' గ్లింప్స్ ప్రదర్శించారన్న న్యూస్ విపరీతంగా వైరల్ అయింది. స్పియర్ బాల్‌పై మహేష్ బాబు విజువల్స్ తిరుగుతున్నట్లు కనిపించే ఆ ఫోటోలు నెట్టింట్లో వేగంగా స్ప్రెడ్ కావడంతో అందరు నిజమేనని నమ్మారు. కాని వాస్తవానికి అవి అసలు నిజం కావని తర్వాత తేలింది. ఆ ఫుటేజ్, ఫోటోలు అన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవి మాత్రమే అని పరిశీలనలో బయటపడింది. దీంతో చాలామంది అభిమానులు, నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్పియర్ బాల్‌పై ప్రమోషన్ చేయడం అసాధ్యమేమి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్రాండ్లు, సినిమాలు అక్కడ తమ కంటెంట్‌ను ప్రదర్శిస్తున్న దృష్ట్యా, సరైన మొత్తాన్ని చెల్లిస్తే 'వారణాసి' టీమ్ కూడా భవిష్యత్తులో అలాంటి గ్లోబల్ ప్రమోషన్ చేయవచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

# అఖండ-2 విడుదలతో పలు సినిమాలు వాయిదా




టాలీవుడ్ మాస్ యాక్షన్ జానర్‌లో భారీ అంచనాలు సెట్ చేసిన నందమూరి బాలకృష్ణ తాజా చిత్రం 'అఖండ 2: తాండవం' 12 నుంచే ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా మాస్ ఎంటర్‌టైనర్ వాయిదా పడిన తర్వాత మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. చివరకు డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్ షోలు, 12 నుంచి ఫుల్ ఫ్లెడ్జ్ రిలీజ్ అని అధికారికంగా ప్రకటించడంతో, ఇప్పటికే ఆ తేదీకి షెడ్యూల్ చేసుకున్న పలు చిత్రాల విడుదల తేదీలలో మార్పులు చేసుకోక తప్పలేదు. అఖండ 2 రిలీజ్ డేట్‌ను ప్రకటించే వరకు ఇతర సినిమాలన్నీ సస్పెన్స్‌లో పడిపోయాయి. అఖండ 2..డిసెంబర్ 12కా లేదంటే , క్రిస్మస్ సీజన్‌లో విడుదలవుతుందో తెలియక ఆ సమయంలో రిలీజ్‌కి సిద్ధమైన పలు సినిమాలు తమ విడుదల తేదీలను మార్చుకోవాలా లేదా అనే సందిగ్ధతలో ఉన్నాయి. ఆ సమయంలో, బాలయ్య సినిమాపై క్లారిటీ వచ్చిన వెంటనే కొన్ని నిర్మాణ సంస్థలు తమ ప్లాన్‌లను మార్చేశాయి. డిసెంబర్ 12న రావాల్సిన రోషన్ కనకాల-సందీప్ రాజ్ కాంబినేషన్ చిత్రం 'మోగ్లీ' ఒక రోజు వెనక్కి తగ్గి డిసెంబర్ 13కి మారింది. నందు నటించిన 'సైక్ సిద్దార్థ్' అయితే ఏకంగా నూతన సంవత్సర కానుకగా జనవరి 1 న రిలీజ్‌కి సిద్ధమైంది.ఇక ఈ జాబితాలో సూపర్ స్టార్ రజినీకాంత్ చిత్రం కూడా చేరింది. రజినీకాంత్ పుట్టినరోజు సందర్భంగా తెలుగు స్టేట్స్‌లో శంకర్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ చిత్రం 'శివాజీ' ని రీరిలీజ్ చేయాలని అనుకున్నారు. కాని అఖండ 2 ప్రభావంతో ఆ చిత్రం కూడా వాయిదా పడింది. ఈ పరిణామాలు చూస్తుంటే మార్కెట్‌లో అఖండ 2 హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. బాలయ్య-బోయపాటి కాంబో ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన నేపథ్యంతో ఈ సినిమా పై అపారమైన అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే వారం ఆలస్యంగా వస్తున్న అఖండ 2 ఈ భారీ హైప్‌ను నిలబెట్టుకుంటుందా? బాక్సాఫీస్ వద్ద అదే స్థాయి తాండవం చేస్తుందా? అన్నది మరో 24గంటల్లోనే తేలనుంది.






# త్రివిక్రమ్-వెంటకటేశ్ కాంబో

## ఆదర్శ కుటుంబం టైటిల్ ఖరారు

త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న మూవీని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు 'ఆదర్శ కుటుంబం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'హౌస్ నం47 ' అనేది ఉప శీర్షిక. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన తర్వాత దీనికి సంబంధించిన ఎన్నో పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వాటికి చెక్ పెడుతూ ఈ టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు తెలుపుతూ వెంకటేశ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. వచ్చే ఏడాది వేసవిలో దీన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. తాజాగా పంచుకున్న ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో వెంకటేశ్ సింపుల్‌లుక్‌లో మధ్యతరగతి వ్యక్తిగా ఆకట్టుకుంటున్నారు. సంచలన విజయం సాధించిన 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత వెంకటేశ్ సోలోగా నటిస్తున్న సినిమా ఇదే. వెంకటేశ్ కథానాయకుడిగా ఇదివరకు వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. త్రివిక్రమ్ గత చిత్రాల్లాగే ఇందులోనూ ఇద్దరు నాయికలకు అవకాశమున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ పాత్రల కోసం త్రిష, నిధి అగర్వాల్‌తో పాటు రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం బలంగా వినిపిస్తోంది. దీనితో పాటు వెంకటేశ్ వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబోలో రానున్న 'మన శంకర వరప్రసాద్'లో అతిథి పాత్రలో కనిపించనున్నారు. అలాగే 'దృశ్యం -3'తో మరోసారి థ్రిల్ పంచనున్నారు.

# సినిమా నిర్మాణం ఎవరి ఇష్టం వారిదే

## అన్నగారు ప్రచార కార్యక్రమంలో కార్తీ



సినిమాను తెరకెక్కించడంలో ఎలాంటి రూల్స్ లేవని నటుడు కార్తి అభిప్రాయపడ్డారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అన్నగారు వస్తారు' నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించగా, డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా కార్తి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.సినిమాను ఇలానే తీయాలి అని రూల్స్ ఉండవు. మనకు నచ్చినట్లు ప్రేక్షకులకు నచ్చేవిధంగా తెరకెక్కించవచ్చు. ఈ విషయంలో ఎవరి వ్యక్తిగత నిర్ణయం వారిది. ఎవరికి నచ్చినట్లు వాళ్లు రూపొందిస్తారు. ఈ విషయంలో ఎవరూ ఎవరికీ నేర్పించలేరు. మనం చిన్నప్పటి నుంచి చూసిన సినిమాల ప్రభావం మనపై ఎక్కువగా ఉంటుంది. మంచి చిత్రాలు రూపొందిస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరణ చూపిస్తారు. 'అన్నగారు వస్తారు'లో మంచి ఫైటింగ్ సీన్స్ ఉన్నాయి. అవి సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని చెప్పారు. ఇక తాను ఇండస్ట్రీకి రావడానికి ముందు అమెరికాలో వర్క్ చేసినట్లు కార్తి తెలిపారు. 'నేను అమెరికాలో మూడు సంవత్సరాలు చదువుకున్నాను. అక్కడ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసి ఇక్కడకు వచ్చాను. నేను చదువు మానేసి సినిమాల్లోకి వెళ్తాను అని చెప్పగానే అక్కడి వాళ్లందరూ షాక్ అయ్యారు. నువ్వు ఇంత మంచి స్టూడెంట్‌వి సినిమాల్లోకి ఎందుకు వెళ్లడం అన్నారు. ఆ రంగానికి వెళ్లకు కెరీర్ మొత్తం పాడైపోతుంది అన్నారు. నేను ఇండస్ట్రీకి రావడానికి మా కుటుంబం చాలా సపోర్ట్ చేసింది' అని వెల్లడించారు.



# 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' రెండో సీజన్ రెడీ

భారత స్వాతంత్ర్య పోరాటం, దేశ విభజన నాటి చారిత్రక ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చూపించిన ప్రముఖ వెబ్ సిరీస్ 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' తన రెండో సీజన్‌తో రాబోతుంది. నిఖిల్ అద్వానీ దర్వకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ ప్రముఖ రచయితలు డొమినిక్ లాపియర్, లారీ కాలిన్స్ రాసిన ప్రసిద్ధ పుస్తకం 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' ఆధారంగా రాబోతుంది. తాజాగా ఈ దీనికి సంబంధించిన ట్రైలర్‌తో పాటు స్ట్రీమింగ్ తేదీని చిత్రబృందం విడుదల చేసింది. రెండో సీజన్‌ని జనవరి 9 నుంచి ప్రముఖ ఓటీటీ సోనిలివ్ వేదికగా స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. రెండో సీజన్ ట్రైలర్ చూస్తుంటే.. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే దేశంలో చోటు చేసుకున్న కీలక పరిణామాలను ఈ సిరీస్ ప్రస్తావించనుంది. స్వాతంత్ర్యానంతరం భారత్ ఎదుర్కొన్న పెను సవాళ్లు, దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడానికి జరిగిన భారీ పోరాటంపై దృష్టి సారించింది. ముఖ్యంగా, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహానాయకులు అప్పటికింకా భారతదేశంలో భాగంగా లేని రాచరిక సంస్థానాలను ఏ విధంగా విలీనం చేశారు. అలాగే కీలకమైన కలకత్తాను పాకిస్థాన్‌లో కలపకుండా ఎలా అడ్డుకున్నారు. చారిత్రక నగరం అయిన లాహోర్‌ని ఎలా వదులుకున్నారు అనేది ఇందులో ఆసక్తికరంగా సాగింది. మొదటి సీజన్ భారీ విజయం అందుకున్న నేపథ్యంలో దేశ నిర్మాణంలో మన నాయకులు పడిన శ్రమను తెలుసుకోవాలనుకునే చరిత్ర అభిమానుల్లో సీజన్ 2 పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861